

వీనస్ మహిజా పిక్చర్స్
బాలభారతము
సిహెచ్.ప్రకాశరావు. కె.కామేశ్వర రావు. యస్.రాజేశ్వర రావు
నవయుగ
VEEKAY

సచిత్ర మాస పత్రిక

7 A. శివాజీ స్ట్రీట్
టి. నగర్, మద్రాసు-17.
ఫోన్ : 442001

విడి ప్రతి వెల
ఒక రూపాయి

ఏడాది చందా
పన్నెండు రూపాయలు

సంపుటి 10
అక్టోబర్ 1972
సంచిక 10

సంస్థాపకులు :
కీ. శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్ :
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

అసోసియేట్ ఎడిటర్:
వ్యాస్‌చంద్

తొలిమాట 3

ఉత్తరాలు 5

తద్దినాల సుబ్బారావు కథ 9
—తురగా కృష్ణమోహన్‌రావు

మరో ప్రేమకథ (సీరియల్) 19
—గణేష్ పాత్రో

పతిత అంటే ఎవరు? 20
—ఆర్. మాధవీలత

నిజం 33
—వి. రాజా రామమోహనరావు

హనీమూన్ (పెద్దకథ) 40
—యర్రంశెట్టి శాయి

సంస్కారం 49
—దార్ల తిరుపతిరావు

తూనికలూ-కొలతలూ 57
—డా॥ మహీధర నళినీ మోహన్

సమర్థుడు 62
—శ్రీరాజ్

మూడో మనిషి (సీరియల్) 74
—కె. రామలక్ష్మి

చావు 85
—త్రిపురనేని రామ్‌గోపాల్

చిచ్చుర గిల్చిన చీకటి 87
—పైడిపాల

కబుర్లు 97
—చలసాని ప్రసాదరావు

మనుషులు మారాలి 102
—పి. వి. ఆర్. శివకుమార్

సరాగమాల 112
—వి. ఎ. కె. రంగారావు

సినిమా 114

రాజకీయాలు 127
—కృష్ణవేణి

ముఖ చిత్రం :
శ్రీ లక్ష్మీ ప్రొడక్షన్స్
"పాపం పసివాడు"

Edited & Published by V. Leelavaty Raghavaiah, 7-A, Sivaji Street, Madras-17 and Printed by B. V. Narasimha Rao, at Sri Krishna Chitra Printers 7, NageswaraRao Road, Madras-17
Associate Editor: Vyaschand

తప్పక చూడండి।



తొలిమాట

చలనచిత్ర రంగంలో తమ పేరును తరగని గనిలా స్థిరపరచుకొనిన శ్రీ కె. వి. రెడ్డిగారు యిక మనకు లేరు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని మనసారా జ్యోతి కోరు కుంటూంది.

* * *

పేద ప్రజల పరిస్థితుల్ని ఆవంతైనా సంస్కరించలేని ప్రభుత్వం పాతకేళ్లుగా సోషలిజమంటూ దేశాన్నేం ఉద్ధరిస్తున్నట్లు?! చూ. పే. 102

* * *

చావు ముసుగు వేసుకొన్న పిరికిది. ఎదిరించ గలిగిన వాళ్ళను తాకలేదు సరికదా చావు చచ్చి వూరుకుంటుంది. చూ. పే.

వేలూరి సహజానంద!

ఉత్తరాలు

ఎడిటర్‌గార్కి,

గతనెల మా (మీ) అభిమాన జ్యోతిలో ప్రచురింపబడ్డ "చిన్నతల్లి—కాకాహోటెల్. మేనక అను ఉద్యోగ విజయాలనే'' వాస్తవిక కథను అతి సరళమయిన కడుపుబ్బ నవ్వించే రీతిలో. ప్రభుత్వ సంస్థలో నున్న అవినీతి-లంచగొండితనాన్ని బహిరంగ పరచి జీవిత నగ్న సత్యానికి చిలువలు - పలవలల్లి కడు రమ్యంగా తయారు చేసిన రచయితకు నా ధన్యవాదాలు.

—బలివాడ.

విశాఖపట్టణం-4.

* * *

సెప్టెంబర్ జ్యోతి ముఖచిత్రం ఆకర్షణీయంగా వుంది. అరాచకం ఎక్కడయినా ఒక్కటే. అంతస్తునిబట్టి తారతమ్యాలు ప్రభుత్వమే గడ్డి తింటూంటే ప్రజలేం చేస్తారు? యీ నిజసత్యాన్ని ద్విభాష్యం రాజేశ్వరరావు "చిన్నతల్లి కాకాహోటేల్'' ద్వారా విశదముగా వ్రాశారు. మాకుబాగా నచ్చింది. పిల్లలు కలిగినా వారికి పాలివ్వ లేని తల్లులు గొడ్రాలితో సమానమని నిరూపించే సత్యము 'బొమ్మ' ద్వారా పాఠకుల హృదయాలను కదలించింది. 'మరో ప్రేమ కథ' ముగింపు కూడా మాకు నచ్చింది. "ఆంధ్రకేసరి'' గారిని మరలా పాఠకులకు జ్ఞప్తికి తెచ్చినందునకు మా కృతజ్ఞతలు. మరువరాని కథలందిస్తున్న మా (మీ) జ్యోతికి అభివందనలు తెలియజేయటానికి సంతోషిస్తున్నాము.

—ఆర్. బాబుశ్రీనివాసరావు.

ఆర్. వేణుగోపాలరావు.

కమ్మూరు గ్రామము

* * *

ఎడిటర్‌గార్కి. సెప్టెంబరునెల జ్యోతిని చదివాను. (చూవాను) అందులోని టంగుటూరి ప్రకాశంపంతులుగారి శతజయంతి సందర్భముగా ఏ రమేష్ చౌదరిగారు బలే వర్ణించారు. అందాలబొమ్మ అనుకథను కూడా చదివాను. చాలా బాగుంది. సీరియల్స్ కథలు కూడ జ్యోతి హైయస్టగా

ఉన్నవి. అక్టోబరు నెల జ్యోతిలో కూడ ఇలాంటి మంచివి వేస్తారని ఆశిస్తున్నాను.

—పి. వి. కోటేశ్వరరావు.

బాపట్ల.

* * *

సెప్టెంబర్ 'జ్యోతి'లో "కాళా హోటలు లేక హోటలు మేనక అను ఉద్యోగవిజయాలు" ద్విభాష్యం రాజేశ్వర రావుగారి ఈ కథానిక నాకు బాగా నచ్చింది. రచయిత శ్రీ ద్విభాష్యం తమకలాన్ని పూర్తి హాస్య రసంలో ముంచుతూ ఈ రచన సాగించారేమో। చదువుతూ నెమ్మదిగా నవ్వాలని ప్రయత్నించి.... పెద్దగా నవ్వేశాను।। ఇంకా ఈ సంచికలో శ్రీ అవసరాల రామకృష్ణరావుగారి "మన మందరం గజదొంగలు" (కథానిక) తర్వాత శ్రీ అరిగె రామరావుగారి "బొమ్మ" ఈ రెండు కథానికలు చాలా ఇంటరెస్టింగ్‌గా ఉన్నాయి. ఈ కథలు పూర్తిగా చదివేక....'రెండు మంచికథలు చదివామన్న తృప్తి కలుగుతుంది. రచయితలకు నా ప్రణామములు। ఇక "జ్యోతి" లో ప్రతిపేజీలో కన్పించే జోక్సుతో ఉండే కార్టూన్లు గిలిగింతలు పెట్టేస్తున్నాయ్। 'జ్యోతి' నిర్వాహకులకు నా అభివందనలు।।

—వి. ఆర్. శేఖర్,

చేబ్రోలు.

* * *

సెప్టెంబర్ నెల 'జ్యోతి' లో చలసాని వారి కబుర్లు ఆణిముత్యాల్లాంటివి సిరి, సంపదలు దా(దో)చు కుంటున్న పెద్ద లకూ, మహా మేధావులకోసం ఆయన చెప్పినవి పచ్చినిజాలు. ఇక కథల్లో జరిగే రామారావుగారి 'బొమ్మ' కథ ఈ నెల జ్యోతికే ఒక దివ్యజ్యోతి అని అనవచ్చు. ఒకటికి రెండుసార్లు చదవాలనిపించింది. 'మనమందరం గజదొంగలం' అన్న కథలో ఈ నాటి అల్లుళ్ళు మామలనుఎలా దోచుకుంటూ దోపిడీ చేస్తున్నారో అవసరాల రామకృష్ణారావుగారు మరో విధంగా తెలియపరచారు. ఇకపోతే 'చిన్నతల్లి.... మేనక....' కథలో ఏమంత కొత్తదనం గాని. గొప్పతనంలేదు. మొత్తం మీద అన్నిరకాల అభిరుచిగల వాళ్ళకూ అన్నిటీ సీ సమపాళ్ళలో అందిస్తున్న ఎడిటర్‌గారి కృషిని అభినందించక తప్పదు.

—కాళ్ళ గోవిందరావు

ఆమదాలవలస.

* * *

'జ్యోతి' దినదినాభి వృద్ది చెందుతూ వుంది. ఆ మాటలో సందేహమేలేదు. శ్రీ చలసాని ప్రసాదరావుగారి కబుర్లు, కృష్ణవేణిగారి రాజకీయాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్లుగా చదివిస్తున్నాయి. కథలూ, సీరియల్సూ అన్నీ బాగుంటున్నాయి. కార్టూనులూ జోకులూ చాలా బాగుంటున్నాయి. ముందు ముందు ఇంకా బాగా వుండాలని కోరుతున్నాను మీ తొలి మాటలో మంచి పట్టువుంది.

కుమారి అపర్ణ.

హైదరాబాదు.

72 దీపావళి ప్రత్యేక సంచిక

దీపావళికి ముందుగానే అన్ని హంగులతో, అనేకానేక ఆకర్షణలతో మీ అభిమాన రచయిత (తృ)లు యద్దనపూడిసులోచనారాణి, పోల్కంపల్లి శాంతాదేవి, పవని నిర్మల ప్రభావతి, ఐ. వి. యస్. అచ్యుతవల్లి. వాసిరెడ్డి కాశీరత్నం, తురగా జానకీరాణి, ఆచంట శారదాదేవి, బీనాదేవీ, మాదిరెడ్డి సులోచన, డి. కామేశ్వరి, కొడవటిగంటి కుటుంబరావు, పోలా ప్రగడ సత్యనారాయణ మూర్తి. మధురాంతకం రాజారాం, యం. రామకోటి, చలసాని ప్రసాదరావు, అవసరాల రామకృష్ణరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, చందు సోంబాబు. డి. వెంకట్రామయ్య. యఱ్ఱంశెట్టి శాయి, గణేష్ పాత్రో, శివల జగన్నాధరావు వి. రాజారామ మోహనరావు, అరిగే రామారావు గొల్లపూడి మారుతీరావు, బలివాడ కాంతారావు. హితశ్రీ, భమిడిపాటి రామగోపాలం, పర్వతనేని గంగాధర రావు. త్రిపురనేని రమేష్. కొల్లు కుదురు రాజశేఖర రెడ్డి రచనలతో వెలువడుతుంది

ఆనవాయితీగా 'జ్యోతి'ని ఆదరించి అభిమానిస్తున్న పాఠకులకు, ప్రకటనదారులకు మా కృతజ్ఞతలు.

అదే విధంగా ఈ ప్రత్యేక సంచికను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

మేనేజరు

'జ్యోతి'

7-A శివాజీ స్ట్రీట్. టి. నగర్

మద్రాసు-17.

అక్టోబరు రెండు

బాపూ!

నువ్వులేని నీ 'పుట్టినరోజు పండుగ'

నేడు దేశమంతటా ఘనంగా మేం జరుపుకొంటున్నాం.

ఈ శుభసమయంలో నిన్ను స్మరిస్తూ, మా కోర్కె మన్నిస్తావని
వేడుకొంటున్నాం.

భారత స్వాతంత్ర్య రథ సారధ్యం వహించి

నీవు మాకందించిన 'స్వేచ్ఛాజీవనం' ఏమూల దాక్కుందో వెదుకుతున్నాం.

నీవు అవలంబించిన అహింసా సిద్ధాంతం

ఏ రాద్ధాంతాల కౌగిళ్ళలో వేడి నిట్టూర్పులు విడుస్తుందో వెతుకుతున్నాం.

నీవు ప్రతిపాదించిన 'మద్యపాన నిషేధం' నిషేధించబడి

'ప్రభుత్వ సారాయి'గా చలామణీ అవుతూ ఎలా సొమ్ము చేసుకొంటుందో
తెలుసుకున్నాం.

నీ అడుగుజాడల్లో నడుస్తున్నాం అని చెప్పుకొంటూ

నెత్తికి ఖద్దరు టోపీ పెట్టి, వొంటికి ఖద్దరు దుస్తులు తొడిగి

వేదికలపై 'సోషలిజం'పై ఉపన్యాసాలు దంచే నాయకుల మాటల్లో
నిజాన్ని తెలుసుకున్నాం.

అవినీతి అక్రమం అధర్మం అధికార అహంకారం

ఎలా నాల్గు పాదాల నడుస్తుందో నేడు మేం చూస్తున్నాం.

అందుకే బాపూ!

మళ్ళీ నీవు పుట్టి ఈ బంగారు కలల్ని పండించి

'శాంతి కపోతా'న్ని ఎదురువేస్తావని గంపెడాశతో ఎదురుచూస్తున్నాం.

—టి. రామారావు

తద్దినాల సుబ్బారావు కథ



తురగా కృష్ణమోహన్‌రావు

పెళ్ళిళ్ళు స్వర్గంలో ఏర్పాటౌతా యిట—అని ఒక ఇంగ్లీషు వాడు అన్నాట్ట—అని మా సుబ్బారావు అన్నాడు. ఈ మాట మీరైతే నమ్మేస్తారు; నేను నమ్మను. నేనెరిగున్నంతగా సుబ్బారావును మీరూ ఎరిగుంటే- మీరూ నమ్మరు!

అసలు సుబ్బారావుకి పెళ్ళి కాలేదు వాళ్ళింటో నాకు తెలుసున్నంతవరకు ఇద్దరికే పెళ్ళయింది—వాళ్ళ అమ్మకీ, నాన్నకీ। వాళ్ళిద్దరూ సుబ్బారావు పుట్టక ముందే చచ్చిపోయారని తెలిసినవాళ్ళు అంటారు సుబ్బారావు పుట్టగానే. ఇద్దరూ ఇతని ముఖంలోకి తెల్లబోయి చూసి. 'హా, కుమారా!' అంటూ ఏకగ్రీవంగా దశరథుడిలా అరిచి చచ్చిపోయారని మరి కొందరంటారు. అప్పట్నించీ కిణ్వాషహ.

అశ్రమంలో ఉపయోగించే పాలనలో శాంతిల పేరి ఈ సుబ్బారావు పెరిగాడనీ పక్షుల మెజారిటీ ఉన్న చోట పెరగడం వల్ల శకుంతల అలా పెరిగితే, పశువుల మెజారిటీ ఉన్న చోట పెరగడంవల్ల సుబ్బారావు ఇలా అయ్యాడనీ అందరూ అంటారు. మొత్తమ్మీద సుబ్బారావుకి పెళ్ళి కాలేదు.

ఇంకో సంగతి, సుబ్బారావుకి ఇంగ్లీషు రాదు. అంటే— 'గుడ్ మార్నింగ్' 'వాటీజ్యువర్ నేమ్' వంటి మూడో, నాలుగో, పదో ముక్కలు తప్ప వచ్చునుగాని, వాటి అర్థాలు అదే వరసలో తెలియవు. మరి ఈ కాలంలో ఇంగ్లీషు రాని ఆడపిల్ల లేదు. అందువల్ల పెళ్ళయ్యే పిల్లలంతా అతన్ని పెళ్ళాడు పిల్లలం కామని చెప్పేవారు. 'ఇంగ్లీషు మాటాడొద్దురా!' అని సుబ్బారావు ఫేన్స్ అసోసియేషన్ సభ్యులం మేమంతా వాణ్ణి ఎంత బతిమాలుకున్నా, వాడు ఒప్పుకొని, తీరా పెళ్ళికూతుర్ని చూడగానే ఉద్రేకపడి, ముద్దుగా అని తను అనుకున్నట్టుగా మొహం పెట్టి గద్గద స్వరంతో, 'వాటీజ్యువర్ నేమ్?.... మై నేమీజ్ జుబ్బారావ్' అనేవాడు. ఒక్కొక్కప్పుడు వాడికి ఉద్రేకం పెళ్ళికొడుకు తండ్రిని చూసినా, మేనమామని చూసినా కూడా 'ఫిట్'లా వచ్చేది.

హోమియోపతిలో ఉద్రేకం రావడానికీ రాకుండా ఉండడానికీ మందులుంటాయని ఎవరో చెప్తే, చందా వేసుకు మందిప్పిచ్చాం. డాక్టరుగారు—'ఏ చేత్తో అన్నం తింటావ్? ఏ కాలితో నడుస్తావ్? ఎడం కాలా? కుడి కాలా? ఏ కంటితో చూస్తావ్? ఏ పంటితో నములుతావ్?' అంటూ ప్రశ్న వేసి, అమోఘమైన మందిచ్చారు. ఐతే హోమియోపతిలో రోగం తగ్గేముందు, ఒకసారి పెరుగుతుందట. సుబ్బారావుకి ఉద్రేకం బాగా పెరిగిపోయి, కనబడిన వాడినల్లా 'వాటీజ్యువర్ నేమ్' మై నేమీజ్ జుబ్బారావ్' అని షేక్ హేండివ్వడం మొదలెట్టాడు. ఒకసారి కోఠీలో ఊపిరి తిరక్కుండా బళ్ళకీ, బస్సులకీ, కార్లకి దారి చూపిస్తున్న పోలీసబ్బాయిని సుబ్బారావు పలకరించాడు. అతను కంగారుపడి, ఇతన్ని తప్పించుకునే ప్రయత్నంలో చేతులు గిరగిరా తిప్పేసే సరికి, బస్సులు కార్లు బళ్ళు హఠాత్తుగా ఒక దానిలోకి ఒకటి వెళ్ళిపోయి, జనాన్ని మార్చేసుకున్నాయి. పాపం పోలీసు జవాన్ సెలవుపెట్టి వెళ్ళిపోయాడు. మేము సుబ్బారావుకి మత్తుమందిచ్చి, మేడమెట్ల గదిలో పడుకో పెట్టాం వారంరోజులు ఎవరికీ కనబడకుండా.

ఆయుర్వేదం చూశాం; యూనానీ; ప్రకృతి వైద్యం చేయించాం.

"పోనీ ఆపరేషన్ చేయిద్దాం' అన్నాడు మాలో ఒక అప్పారావు. 'ఛీ మొహం. ఉద్రేకానికి ఆపరేషనేమిటి! ఇదేమైన తల నొప్పా తల తీసెయ్యడానికి!' అన్నాడు

మాలోనే ఇంకొకడు వెంకట్రావు పోనీ ఇంజెక్షన్లు ఇప్పిద్దాం పెన్సిలిన్ ఇస్తేసరి. ఈ రోజుల్లో ఏదో ఒకదానికి పాతికా పరకా ఇంజక్షన్లు అంతా పుచ్చుకొంటూనే ఉన్నారు' అన్నాడు అప్పారావు. 'ఇంజక్షన్లయితే నేనే ఇవ్వగలను. మీరంతా సాయంపడితే' అన్నాడు కామేశ్వర్రావు. వాడు మెడిసిన్ మూడో సంవత్సరం ఫెయిలయినప్పట్నుంచీ. నాటకాల్లో డాక్టరు వేషం తప్ప మరోటి వెయ్యడంలేదు. రోగి బాగా నటించక పోయినా. రోగి

వాడ్డానికి రెండో మూడో స్పేర్‌గా పెట్టుకోవాలి' అన్నాడు కామేశ్వర్రావు 'ఇ తకీ మా సాయందేనికి?' అన్నాం మేము. 'సుబ్బారావుని పట్టుకోడానికి ఒక జత మనుష్యులు కావాలిగా? ఒంటి సూది గుచ్చేటప్పుడు బయటికి బలమంతా పెట్టి లాగేటప్పుడూ. నా జబ్బ గట్టిగా పట్టుకోడానికి ఒకరిద్దరు కావద్దూ? అన్నాడు కామేశ్వర్రావు. మాకు నిజమేననిపించింది. 'సుబ్బారావు ఇంజక్షన్ సహాయకోప సంఘం' అవి ఒక ఉపసంఘాన్ని వేసుకున్నాం.

తద్దినపు గారెలు రుచిచూసి, చేసిన వాళ్ళ వయస్సు అంచనా వెయ్యొద్దు. పప్పులో కాలు వేస్తారు. సుబ్బారావు గతే మీకూ పట్టుంది——

పక్కన డాక్టరు వేషంలో కామేశ్వర్రావు నిలబడేసరికి ప్రేక్షకుల్లో పెద్దవాళ్ళు పిల్లలు తల్చుకు తల్చుకు ఏడుస్తారు. రోగి చచ్చిపోయే సీనుల్లో, వాడు పెదవి విరవడం చూసి తీరాల్సిందే గాని చెప్పనలవి కాదు.

'మా సాయం దేనికి?' అన్నాం మేము. "సుబ్బారావుకి ఇంజషన్ ఇవ్వడం అంటే సామాన్యంట్రా? ఫారెన్ నీడిల్సు పనికిరావు ఇండియన్‌వే దళసరివి కొనుక్కురావాలి. ఒకటి విరిగిపోతే.


ఈ కోప సంఘం గట్టిగా పనిచేయాల్సిన అవసరమే ఏర్పడలేదు. సుబ్బారావుకి ఇంజక్షన్ ఇవ్వడం కోసం కామేశ్వరరావుకి పుష్టికరమైన ఆహారం ఇచ్చిన తర్వాత ఇంజక్షన్ సూదుల్ని నిగనిగలాడేటట్టు. చింతపండుతో తోమిన తదుపరి, సుబ్బారావుకి మత్తుమందు ఇచ్చాం ఇచ్చాం అంటే-మత్తుమందు తినడానికి గాని. తాగడానికి గాని, పీల్చడానికి గాని సుబ్బారావు ఒప్పుకోలేదు. తన తరపున డాక్టరుగాని. కాంపౌండరు గాని. మత్తు

వాసన చూస్తే చాలన్నాడు. అందువల్ల సుబ్బారావుకి ఇంజక్షన్ ఇవ్వడానికి వీలున్న చోట్లన్ని కామేశ్వరావు మేపుగీపి చూపించిన తర్వాత మేమంతా ఇంటూ మార్కు పెట్టిన చోటల్లా స్థానికంగా మత్తుమందు పులిమాం. ఈ మందు పులిమిన చేతుల్ని మామా ముక్కులకు రాసుకున్నాం కాబోలు—కామేశ్వరావుతో సహ మా కందరికీ స్పృహ వచ్చేవరికి. సుబ్బారావు మెలకువగానే ఉండి-కళ్ళు మూసుకుని. 'హా! ప్రియా! భానుమతీ! వాజేజ్యువర్ నేమ్! మై నేమీజీ జాబ్బారావు అంటున్నాడు

సుబ్బారావు ప్రేమలో పడేముందు కాని. పడుతూ కాని. పడిన తర్వాత కాని. మాట వరసకైనా మాకు చెప్పలేదు. ఒక్కొసారి రెండుమూడు మంచినీళ్ళు తాగి. కళ్ళు తేలేసిన ఉదాహరణలు ఉన్నాయి కాని. అవి ప్రేమలక్షణాలని మేము అనుకోలేదు. 'చూసి-చూసి ప్రేమలో పడ్డ వాడికి ఇంజక్షన్ ఎలా ఇవ్వమురా?' అన్నాడు కామేశ్వరావు 'ఏం?' అన్నాము మేము ప్రేమోన్మాదంలో ఉన్న వారికి మస్క్యులర్ ఇంజక్షన్ ఇవ్వాలో. ఇంట్రావీనస్ ఇవ్వాలో మెడిసిన్ మొదటి మూడు సంవత్సరాల్లోనూ చెప్పలేదట.... మేము ఇంజక్షన్ సహాయ కోప సంఘాన్ని వెంటనే రద్దుచేసి, వాడి ప్రేమ (వాడి అనగా 'వాడైన' అని అర్థం 'సుబ్బారావుగాడి' అని అర్థం నంబర్ టూ) సహాయ కోప సంఘాన్ని స్థాపించాం.

'ఎవరై ఉంటుందిరా ఈ భానుమతి!' అన్నాడు అప్పారావు. నేనెరుగున్న ఒక అమ్మాయి నాటకాల్లోనూ. సినిమాల్లోనూ వేస్తూంటుంది. ఆ అమ్మాయేమో.'' అన్నాడు. కామేశ్వరావు ఒకసారి ఆ అమ్మాయి ఒక నాటకంలో చచ్చిపోతూంటే వీడు డాక్టరు వేషం వేసి ఆమె నాడి చూసి పెదవి విరిచాట్ట 'ఆ అమ్మలు పేరు భానుమతి కాదుగా?' అన్నాడు వెంకట్రావు 'ఔను కాదు' అన్నాడు కామ్ 'వేషంలో పేరు భానుమతే' అన్నాడు 'నీ మొహం' అన్నాం మేము 'ఏకగ్రీవంగా కామ్ మొహం మడుచుకున్నాడు 'ఈ భానుమతి ఎవరో చెప్పరా ప్రాణాలతోనో లేకుండానో ఎలాగో అలాగ పట్టుకు తెస్తాం' అని బ్రతిమాలుకున్నాం మేము సుబ్బారావుని వాడు చెప్పడు. మాలో అంజనేయులని సబినస్పెక్టరు గారి మనవడున్నాడు. వాడితో చెప్పాం చివరకి వాడు నెల తిరిగేలోగా 'భాను—' తో ప్రారంభమై. మతిలేని వాళ్ళనీ పని హేనుగురినీ, మతి ఉండి భానులేనివి ముగ్గురునీ. భానుమతి రెండూ గల ఒక్కరినీ వివరాలు పట్టుకొచ్చాడు తద్దినాల భానుమతి పేరు చెప్పగానే బావురుమన్నాడు సుబ్బారావు.

తద్దినాల భానుమతి అందంగా ఉంటుందని చెప్పడానికి వీల్లేదు. అవడలా,



ఇడ్లీలా, పొట్లకాయ పెరుగు పచ్చడిలా తెల్లగానూ ఉండదు; ఉప్మాలా, రవా కేసరిలా నాజూగ్గానూ ఉండదు ఎక్స్ట్రాగా పొంగిన బూరెల్లాంటి బుగ్గలతో, రోస్టుచేసిన పెసరట్టు రంగులో. నూనె ఎక్కువగా పీల్చుకున్న గారెలా ఉంటుంది. కాని లవిజ్ బ్లైండు అన్నాడు. ఇంగ్లీషువాడు ఆవిడ తద్దినం గారెలా ఉండడమే సుబ్బారావు కొత్త ఆకర్షణ.

సుబ్బారావుకి తద్దినాలన్నా: తద్దినం గారెలన్నా ఇష్టం అని మీకెన్నడూ చెప్పలేదను కుంటాను. ఇంక నా మొహం. నేను మీకేం చెప్పినట్లు ఇందాకట్నుంచీ? వినండి. 'బినా తద్దిన్, గారెల్ నహీం! బినా గారెల్ ఖాన్మత్ నహీం! ఔర్—సునో సునోయే దునియావాలో-బినా ఖాన్మత్ సుబ్బారావ్ నహీం!' ఇది సుబ్బారావు ఫిలాసఫీ!

అసలు సుబ్బారావుకి తద్దినాలంటే ఇష్టం. కూచుని ఎప్పుడో చచ్చిపోయిన వాళ్ళని రమ్మని ఆహ్వానిస్తూ. బ్రతికున్న వాళ్ళ ఆఫీసు టైములకు సరిపోయేటట్టు మంత్రంచెప్పగల బ్రాహ్మలు; జలతరంగిణి వాయించే ఆర్టిస్టులా నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్లు. మనకి అట్టే తేడా తెలియకుండా, ఒకేసారి వండి వడ్డించగల

వంటూవిళ్ళు:—ఈయనకి తెలియకుండా ఆయనకీ, ఆయనకి తెలియకుండా ఈయనకీ కాఫీ ఇచ్చి తద్దినాల సాంప్రదాయాల్ని చేతనైనంతవరకూ పరిరక్షిస్తున్న మోడరన్ ఇంటావిళ్ళు:—ఇవన్నీ ఇష్టమే సుబ్బారావుకి

తద్దినాలంటే ఇష్టమని ఒక మూల కూచుంటే సరిపోతుందా? మానవ ప్రయత్నం ఉండాలి. మనుష్యులు సక్రమంగా చచ్చిపోతే తప్ప. తద్దినాలు రూల్సు ప్రకారం రావు ఒక రోజున సుబ్బారావు ఎరుగున్న వాళ్ళు ముగ్గురు చచ్చిపోయారు. చూస్తూండగా ఏడాదేడాదీ వీళ్ళ ముగ్గురి తద్దినాలో ఒక రోజున తగలతాయని తలచుకు. తలచుకు ఏడ్చాడు సుబ్బారావు— ఆ ఇళ్ళ వాళ్ళకంటె కూడా.ఇది అతివృష్టి. తర్వాత వారంరోజులు ఎవరూ చావలేదు. ఎరుగున్నవాళ్ళు. ఇది మరీ అనావృష్టి. ఒక రోజు రోజల్లా ఏడ్చాడు సుబ్బారావు.

ఈ సందర్భంలోనే ఒక దీర్ఘ కాలిక ప్రణాళిక ఒకటి రూపొందించి, అది అమలులోకి వచ్చేందుకు కాళ్ళు అరిగేటట్టు తిరిగాడు. అతని కడుపులో తద్దినంగారెలకంటె, కాళ్ళ చెప్పులు అగిరి పోయాయి ఈ సందర్భంలో, రోజూ ఉస్మానియా ఆసుపత్రికి వెళ్ళి, తను ఎరుగున్న వాళ్ల ఎవరు చావడానికి సిద్ధంగా ఉన్నారో కనుక్కునేవారు, విదియనాడు ఒక పరిచయస్థుడు చచ్చిపోతే. చస్తే మరొకణ్ణి చావనిచ్చేవాడు కాదు తదియ వరకు-డాక్టర్లతో చెప్పి! తదియనాడు ఎవరూ చావకుండా ఉండి, చవతినాడు ఇద్దరు పోయేటట్లుగా ఉంటే, అందులో ఒకరికి ఎందుకైనా మంచిదని తదియనాడే ఏర్పాట్లు చేయించేవాడు-డాక్టర్లతో చెప్పి! మొత్తానికి సాధించాడు 'వన్‌డే-వన్‌తద్దినం' ప్రణాళికని

ఒక రోజున ఒక సీతమ్మగారి తద్దినం దాదాపు ఐపోయి, సుబ్బారావు తృప్త్యావస్థలో ఉన్నప్పుడు, అతని మనసులో విపరీతమైన ఒక సంఘర్షణ చెలరేగింది. నాలిక. అతనిని. 'ఒకటి రెండు గారెలు వేయించుకో' అంది. అదే క్షణంలో కడుపు; అతనిదే, ఒద్దు అని గర్జించింది. ఆ క్షణంలోనే అతని చెవులకి ఒక తియ్యటి కంఠం 'ఒకటి రెండు గారెలు వేయించుకోండి' అన్నట్టు వినవచ్చింది ఆ కంఠం చచ్చిపోయిన సీతమ్మదేమోనని భయపడి కళ్ళుమూసుకొని, తియ్యగా ఉంది కాబట్టి సీతమ్మది కాదని తేల్చుకొని కళ్ళు తెరిచాడు సుబ్బారావు. ఎదురుగా గారెల పళ్ళెం చేత్తో పట్టుకొని భానుమతి! సుబ్బారావు హృదయంలో హఠాత్తుగా ఒక హండ్రెడ్ కేండిల్ పవర్ బల్బు వెలిగింది.

సుబ్బారావు భానుమతిని ప్రేమించాడు లవ్ ఈజ్ బ్లైండు అని ఇంగ్లీషు వాడన్నాడని తెలియకపోయినా గుడ్డిగా ప్రేమించాడు. పది తలకాయలున్న రావణాసురుణ్ణి మండోదరి ప్రేమించలేదా? 'అతని నెత్తిమీద గంగ ఉంది. చెబితే వినవే' అని వాళ్ళ అమ్మా, నాన్నా మొత్తుకున్నా. వినకుండా పార్వతి శివుణ్ణి ప్రేమించలేదా? అలాగే, సుబ్బారావూ భానుమతిని ప్రేమించాడు. ప్రేమలో పడిన తర్వాత, కష్టాలు పడం తప్పదని మనందరికీ తెలుసు.జూలియట్ అనే అమ్మాయిని ప్రేమించి రోమియో అనే కుర్రాడు, ఆ అమ్మాయి ప్రేమను కనుక్కోడానికి బాల్కనీలు అన్నీ

తెగవేతికాదని మనకి తెలుసు. దుష్యంతుడనే అబ్బాయిని శకుంతల అనే అమ్మాయి ప్రేమించి ఎన్ని కష్టాలు పాలయిందో మనకీ కాళిదాసుగారికీ, కందుకూరి వీరేశలింగం పంతులుగారికీ తెలుసు నలుడూ దమయంతీ అనే అబ్బాయీ అమ్మాయి ప్రేమించుకుని, హంస ద్వారా సందేశాలు కూడా పంపుకొని, చివరికి ఒక దశలో, బట్టలు వెయ్యడానికి వాకిలిలేకుండా, వాకలికి వెయ్యడానికి బట్టలు లేకుండా ఎలా బాధపడ్డారో మనకీ, శ్రీహర్షుడుగారికీ, శ్రీనాథుడుగారికీ కూడా తెలుసు, కాబట్టి, ప్రేమికులెవరూ కష్టపడకుండా ఉండరు, ఇది రూలు

సుబ్బారావు కష్టం ఎక్కడ వచ్చిందంటే—భానుమతి అతని హృదయంలో అద్దెలేకుండా కాపురం పెట్టేసిందని మీకు చెప్తాను కదా? ఇంకా ఎంత మంది హృదయాల్లో ఆమె ఇటువంటి కాపురం పెట్టిందో తెలియదు ఆమె తద్దినంగార్లు (నాయనా, కంపోజిటరు బాబూ, ఆమెకీ తద్దినానికీ మధ్య కొంచెం స్పేసు అట్టేపట్టు, లేకపోతే అట ఆమె తద్దినమై, సుబ్బారావు గుండె పగిలి చావగలడు!) ఏళ్లబాలుగా ఆమె (వండిన) తద్దినం గారెలు తినడానికి అనేకశంగల కుర్రవాళ్లు ఆమెను ప్రేమించకుండా ఉన్నారంటే సుబ్బారావుకి నమ్మకం కలగలేదు. ఇది తలుచుకున్నప్పుడల్లా అసూయతో అతని గుండెలు మండిపోయేవి. ఈ కష్టం ఇలా ఉండగా, ఆమె అసలు కాపురం ఎక్కడో సుబ్బారావుకి తెలియలేదు.

ఆ సంద్రకదన ఎక్కడ ఉంటుందో కనుక్కొని, మలయ మారుతాలు ఉవ్వెతంగా వీస్తూండే ఒక సంధ్యారుణవేళ హఠాత్తుగా ఆమె ఇంటికి వెళ్ళి, 'అహా, భానుమతీ, ప్రియా, వాట్ఈజ్యువర్ మై? మైసీ మీజ్ జుబ్బారావ్' అనాలి అన్నది సుబ్బారావు మనసులో అర్థంకాని ఒక కోరిక. అటువంటి సమయంలో అందగాడొకడు వచ్చి ఇలా పలకరిస్తే, ఏ భామైనా సిగ్గుపడక మానదు కనుక, భానుమతి సిగ్గుపడి 'కూచోండి, నా పేరు మీకెలా తెలిసింది, అంటుంది. 'నిన్ను మొదటిసారి చూడగానే నీ పేరు భానుమతి అయ్యుండాలి అనుకున్నాను' అంటాడు తను చూసిన ఒక సినిమాలో హీరోలా ఆమె మరింత సిగ్గుపడి—'ఈవేళ మా నాన్నగారి తద్దినం రెండు తద్దినం గారెలు తింటారా?' అంటుంది. 'భానుమతీ, ప్రియా, నీకోసం మీ నాన్నగారిదేకాదు ఎవడి తద్దినం గారెలైనా తింటాను, పెట్టు రెండు కాదు; పన్నెండు పెట్టు. అల్లపచ్చడి కూడా ఒక అర్థలీటరు వెయ్యి, ఒక వందగ్రాములు నూపచ్చడి కూడా వడ్డించు' అంటాడు తను. ఆమె మొఖం నూనె పీల్చుకున్న గారెలా విప్పారుతుంది. 'కాని ఒక్క షరతు' అంటాడు అతను, మళ్ళా ఆమె భీతహరిణేక్షణలా చూస్తుంది ఒక సెకను, పెప్పులా మాడిపోతుంది ఆమె మొహం. 'మరి-నువ్వు కూడా నాతో తినాలి' అంటాడు తను. ఆమె సిగ్గుపడ, నవ్వి ఛెంగున గంతేసి లోనికిపోయి, గారెలు పట్టుకొస్తుంది. తినేసి ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకొని 'గూఢచారి 117' చిత్రం చూడ్డానికి వెళ్ళిపోతారు.

ఇదంతా ఇలా జరుగుతుందని, కొంచెం తేడాగా, కలలు కంటూండేవాడు సుబ్బారావు. ఇవి కలలుగానే నిలిచిపోయాయి. నిజానికి భానుమతి ఎదురుగా

తనబడ్డప్పుడు. ఆమె మాట వినపడ్డప్పుడు, సుబ్బారావు నోరు పెగిలేది కాదు-గారెలు తినడానికి తప్ప! అసలు భానుమతి పేరు భానుమతి అని తెలియడానికి ఇరవై మూడు తద్దినాలూ, ముప్పై ఏడు రోజులూ పట్టింది. తద్దినాల ఎంగేజిమెంట్లు లేని రోజుల్లో, సుబ్బారావు వీధులన్నీ తిరిగే వాడు భానుమతి ఇల్లు వెతుకుతూ. ఆ రోజుల్లో భానుమతి ఎవరింట్లోనో తద్దినం గారెలు వండుతుండేది, అతనికి తద్దినం ఎంగేజిమెంటు ఉన్న రోజునే ఆమె మరో ఇంట్లో వంటకి కుదురుకునేది. సుబ్బారావుకి ఒళ్ళుమండేది, ఒక రోజున రెండు తద్దినాలుండడం వల్ల వచ్చే ఆపద ఇది. సుబ్బారావుకి యమధర్మరాజు మీదా, చిత్రగుప్తు మీదా వచ్చేటంత కోపం వచ్చేది.

కృత యుగంలోనో ద్వాపర యుగంలోనో జ్ఞాపకం లేదు – యమధర్మరాజుకి ఏలి నాటి శని పట్టిన రోజుల్లో, సావిత్రి అనే అమ్మాయికి భయపడి, సత్యవంతుడు అనే అబ్బాయి ప్రాణాలు అతనికి వాపసు చేయాల్సి వచ్చింది. ఈ విషయం మీకు తెలిసే ఉంటుంది. అప్పుడు తన ముఖం ఎవరికీ చూపించలేక, పనంతా చిత్రగుప్తుడికి అప్పచెప్పి, నెల్లాళ్ళు లీవు పెట్టి ఇంట్లో కూచున్నాడు యమధర్మ రాజు. ఆస్థానం వదిలిన వాళ్ళు [illegible] ధర్మరాజుకి బహుళ; మళ్ళా అనే గతి పట్టడంవల్ల కాబోలు, ఒక అధికమాసంలో చచ్చేవాళ్ళల్లో చాల మంది బాపడం [illegible] కారు. ఒక నెల్లాళ్ళ పాటు సుబ్బారావు—భానుమతుల కష్టమర్ల ఇళ్ళల్లో రోజు కొక్కొక్క తద్దినమే వచ్చింది.

ఇది సుబ్బారావు ఎంత కాలంగానో ఆశిస్తూ వచ్చిన విషయం. ఆమె కంఠం, గాజుల చప్పుడు, ఆమె పచ్చడిచేస్తూంటే వినవచ్చిన రుబ్బురోలు గడబిడ శబ్దం, ఆమె పోపు వేస్తూంటే వినవచ్చిన మధుర శబ్దాలు ఆమె గారెలు కాగుతూన్న నూనెతో పడెయ్యగానే వచ్చిన చుయ-చుయ శబ్దం—ఇవన్నీ రోజూ అతనికి పిచ్చెక్కించాయనే చెప్పాలి. తద్దినం కామందు


భార్య- 'భానుమతమ్మ. కాకరకాయలో కారం కాస్త ఎక్కువే వేశావా!' అంటే చాలు-అంటే ఆమె పేరు వినబడితేనే చాలు—సుబ్బారావు తనువు పులకించేది. అతని ప్రేమ శుక్లపక్ష చంద్రుడిలా అభివృద్ధి చెందింది.

ఐతే-ఒక్కటే వచ్చింది బాధ అతివి ప్రేమతో బాటు సిగ్గు పెరిగి. ధైర్యం కృష్ణపక్ష చంద్రుడిలా క్షీణించడం మొదలెట్టింది. ఆమె కంఠం వినబడేసరికి, ఇతని గొంతులో వెలక్కాయ పచ్చడి అడ్డుపడేది. ఏదో ఊపిరి సలపనట్టుగా ఉండేది. గుండెలు అడ్డంగా కొట్టుకోడం మానేసి, నిలువుగా కొట్టుకోడం మొదలెట్టేవి. ఎదురుగా వచ్చేసరికి ఇతను తల వంచేసుకునేవాడు నోటమాట వచ్చేది కాదు.

ఇది ఇలా ఉండగా, ఒకరోజున భానుమతే పలకరించింది సుబ్బారావుని. ఇతను హాలులో కూచుని తమలపాకులకి సున్నం రాసుకొంటున్నాడు ఆమె గుమ్మం అవతల నిలబడి ఉంది. తను ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తూందనీ, ఎక్కడైనా కొంప ఖాళీగా ఉంటే చూపిపెట్టమనీ కోరింది సుబ్బారావుకి మల్లెపూలూ, సన్నజాజీ, చందమామ, కొండవాగూ ఏవేవో గుర్తుకొచ్చాయి. 'కావాలంటే మా ఇల్లు తీసుకోండి. నేను అడవిలో ఉండమన్నా ఉంటాను; నడిబజారులో ఉండమన్నా ఉంటాను; ఆ ఇంట్లోనే స్టోర్ రూమ్‌లో పడుకోమన్నా పడుకుంటాను.' అనాలనుకున్నాడు సుబ్బారావు. పిడికిలి బిగించి, ధైర్యం చిక్కబట్టుకుని మాటాడ్డం మొదలెట్టబోయాడు. ఇంతలో ఆమె అంది—తనకీ, తన ఐదుగురు పిల్లలకీ ఒక వంట గదీ, ఒక చూరు గదీ, ఒక స్టోరు గదీ, ఒక హాలూ ఉంటే చాలుట! పెద్దకూతురు కాపురానికి వెళ్ళిపోయినట్టేననీ, పెద్ద కోడలు ఇంకా కాపురానికి రాలేదనీ చెప్పింది

సుబ్బారావు హృదయంలో హఠాత్తుగా ఒకవంద కేండిల్ పవర్ బల్బు మాడిపోయింది.

ఇంత జరిగినా, వాడు మాతో ఎప్పుడూ చెప్పలేదు తద్దినానికి వెడుతూనే ఉన్నాడు; పరధ్యానంగా గారెలు తింటూనే ఉన్నాడు. ఆ రోజున మత్తుమందు ప్రభావంలో పిల్లలులేని భానుమతి గుర్తుకొచ్చి అలా అరిచాట్ట. సుబ్బారావూ భానుమతీ ప్రణయోదంతాన్ని పరిశోధనలు చేసి తెలుసుకున్నమేము ఇప్పుడు సుబ్బారావుకి పెళ్ళి కూతుళ్ళను చూపించడం మానేశాం. చూపిస్తే పిల్లలెంతమంది?' అని అడుగుతాడేమోనని భయం.



గణేష్ పాత్రో

(గతసంచిక తరువాయి)

7

సరోజనికి జబ్బు తగ్గు ముఖం పట్టినట్టే పట్టి-మరో పదిరోజుల్లో తిరగేసింది మళ్ళా! ఈ మారు ఇంకా భయంకరంగా వుంది. వరసగా పదిహేను రోజులు స్పృహ లేకుండా మంచం మీద పడిఉంది సరోజని. అందరికీ పిడికిళ్ళలో వున్నాయి గుండెలు. డాక్టర్ని మార్పించారు. మందులు ఇంజక్షనులతో గివదినానికీ సరోజిని శరీరం జల్లెడలాగా తూట్లు పడిపోతూంది గానీ రోజుకొక కొత్తచేష్ట, కొత్తపరిణామంతో జబ్బు ముదిరి పోతోంది.

వెక్కిళ్ళు పట్టుతున్నాయి.

పెదాలకి తడి తగిల్తే కడుపులోః పేగులు కదిలిపోయేట్లు వాంతులు చేసుకుంటుంది. గ్లూకోజ్ ఇంజక్షన్ల మీద బ్రతుకుతోందేగాని పచ్చి మంచినీళ్ళు గూడా ఇవ్వడంలేదు.

'విశాఖపట్నం తీసుకెళ్ళమంటారా?'' చాలా వినయంగా, భయంగా డాక్టర్ని అడిగాడు కృష్ణమోహన్. డాక్టరు ముందు ఆశ్చర్యపోయాడు తరవాత తమాయించుకొని చిరునవ్వు నవ్వాడు.

''మిస్టర్ మోహన్. రోగికి ఎలాటి

సీరియల్

ప్రమాదమున్నా నేనే మీకు సలహా యిస్తాను తీసికెళ్ళమని; మీరు అడగక్కర్లేదు మరికొద్ది రోజుల్లో తప్పక సర్దుకుని తీరాలి. అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాను. కంగారు పడకండి కంగారుపడి ఇప్పు డెక్కడికి దీసుకెళ్ళినా ప్రమాదం కూడా! కదపడానికి వీలులేని పరిస్థితిలో వుంది అమ్మాయి."

ఆ డాక్టరు సిద్ధహస్తుడు. వైద్య వృత్తిలో తల నెరిసిన వృద్ధుడు. ఎక్కడికీ తీసుకెళ్ళ కూడదని హెచ్చరిస్తూంటే మొండి కెత్తే ధైర్యం లేకపోయింది మోహన్‌కి. గానీ ఎలా? బాధ తాను చూడ లేకపోతున్నాడు. విలవిల్లాడి పోతున్న సరోజనిని మందుల దయకి వదిలిపెట్టి మామూలుగా గడపలేక పోతున్నాడు. రోజులు ఉధృతమైన రోగంతో హోరా హోరి పదహేను రోజులపాటు, బల హీనంగా పోరాడుతున్న సరోజని-అలిసి పోయింది, చిక్కిపోయింది. జబ్బు చేతుల్లో చిక్కిపోయింది.

"భోజనానికి రా నాయనా!"

పదేపదే భోజనం పేరుతో విసిగిస్తున్న కా[illegible]త్తయ్యను చూస్తే చిరాకేసింది మోహన్‌కి. తనకి ఆకలిలేదు! తనేం చచ్చిపోడు. సరోజనికంటే చాలా మెరుగ్గానే వున్నాడు.

"ఆకలి లేదత్తయ్యా!" కళ్ళు మూసుకునే జవాబు చెప్పాడు.

"అత్తయ్య కాదు నేను."

కళ్ళు తెరిచి చూశాడు.

అమ్మ!

"అమ్మా!" కుర్చీలోంచి లేచి సరిగా కూర్చున్నాడు. అమ్మని చూసి ఎన్నాళ్ళయి పోయింది అప్పుడెప్పుడో ఒకమారు సరోజని చూసి పోవడానికి అమ్మొచ్చే సరికి తాను ఇంట్లో లేడు. డాక్టరు కోసం వెళ్ళాడు. తిరిగొచ్చేసరికి వెళ్ళిపోయింది.

"ఎంతసేపయిందమ్మా నువ్వొచ్చి?" అడిగాడు.

"పొద్దుట నుండీ ఇక్కడే వున్నాను. నీకు కనిపిస్తేనా?" గదమాయించలేదు. గాని నిందా పూర్వకంగానే అంది.

"అదే....పొద్దుటినుంచీనా?...." ఆశ్చర్యపోయాడు.

ఒక గడియ మౌనంగా నుంచుంది కామాక్షి. తరవాత నెమ్మదిగా కొడుకు భుజం మీద చెయ్యివేసి లాలిస్తూ పిల్చింది "నాన్నా! దా! కొంచెం ఎంగిలి పడు. అవతల మీ నాన్న కూడా వొచ్చి కూర్చున్నారు. నీ దిగులు చూసి వాళ్లు కూడా తిండి మానేశారు."

"ఛ ఛ! దిగులా? నాకేం దిగులమ్మా?" నవ్వాడు మోహన్. "భలేవారే! నాకు దిగులెందుకు? సరోజకిప్పుడేమయిందని? ఏం ఫరవాలేదు. మరోగడియకి లేచి కూచుంటుంది. నాకు ఆకలిగా లేదంతే!"

తనకి తాను ధైర్యం చెప్పుకున్నాడు మోహన్.

కామాక్షి ఒప్పుకోలేదు. ప్రతిమాలి కోప్పడి, నవ్వించి, ఒప్పించింది భోజనానికి. సరోజిని పడుకున్న గదిలోంచి బయటికెళ్ళారిద్దరూనూ.

సీతాపతి, రాజశేఖరం వరండాలో దిగులుగా కూర్చున్నారు. ఏదో మాట్లాడుకుంటూన్న వాళ్లు వీళ్ళరాకతో ఆగిపోయారు. రాజశేఖరం ప్రతిదినం వచ్చివెళుతూనే వున్నాడు. మోహన్ ఆరాటం, ఆవేదనా చూస్తూనే వున్నాడు.

"రా, కూచో," తన ప్రక్కనున్న కుర్చీ చూపించాడు సీతాపతి. మోహన్ వెళ్ళి కూర్చున్నాడు

కామాక్షి వడ్డన ఏర్పాట్లు చెయ్యడం కోసం లోపలికెళ్ళింది. ముగ్గురూ కొంతసేపు మౌనంగా కూర్చున్నారు.

"చూడు మోహన్!" రాజశేఖరం నెమ్మదిగా ప్రారంభించాడు. "సరోజినితో పాటే నువ్వు కూడా జబ్బు పడిపోవడం బాగులేదు. ఇల్లు వాకిలీ మరిచిపోయి, నీ తిండి తిప్పలు కూడా నిర్లక్ష్యం చేసుకుని నువ్వు ఒంటికి తెచ్చుకోవడంవల్ల ఏమైనా ప్రయోజనముంటుందంటావా? సరోజినికేమైంది చెప్పు? మరీ ఇంత తెలివితక్కువగా ప్రవర్తించకు. ఏం, నీకంటే దాన్ని కన్నతల్లి, తండ్రికి యెక్కువ బాధగా వుండాలికదా? మరి వాళ్ళు నీ లాగే ఐపో

జరిగిన కథ

శ్యామలరావు కృష్ణమోహన్ స్నేహితులు, లాస్టూడెంట్లు. శ్యామలరావు అశయంగొప్పది. కారణం తనతల్లి మూగది. ఆమె అనేక బాధలకులోనై చనిపోయింది. మానసికంగా బాధపడే అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనే తన నిర్ణయాన్ని తెలుపుతాడు స్నేహితుడు మోహన్‌కు సెలవులకు వెళ్ళిపోతున్న రోజున. మోహన్‌తల్లి కామాక్షమ్మ కొడుకు విషయంలో అమితప్రేమ చూపుతుంది. కానీ మోహన్ సరోజ వివాహ విషయంలో మాత్రం విముఖత కనబరిచింది. కారణం సరోజకు ఫిట్స్ జబ్బు. శ్యామలరావు స్నానానికి వెళ్ళినప్పుడు చౌదరాణి విచిత్రంగా కలిసింది. స్నేహితుడు సాహూ శ్యామలరావు రాకను చూసి ఆనంద పడిపోయాడు. చౌధరాణి భర్త తిరిగి వచ్చాడు.

తున్నారా చూడు?" సుతిమెత్తగా చీవాట్లు వేస్తున్నాడు రాజశేఖరం.

"అసలు ఎందుకై పోవాలి బావా?" నవ్వుతూ రాజశేఖరానికి తోడుకలిశాడు సీతాపతి. "సరోజకి ఒంట్లో జబ్బు వుంది, దాని కర్మకది బాధపడుతూనే వుంది. నీడు ఆరోగ్యంగా వున్నవాడే

ఇలా తీసుకుంటూండడం చూసి మీ చెల్లి కుమిలి పోతూంది.

"హిస్టీరియా ఎంత ఉధృతంగావున్నా ప్రమాదకరంకాదు. అది మనం ప్రపంచంలో చూస్తున్నాము గదా? అదీగాక డాక్టరు ఒక ప్రక్క చెప్తూనేవున్నాడు. పెళ్ళికాగానే పూర్తిగా ఈ జబ్బు తగ్గిపో వచ్చునని."

తండ్రి చెప్పిన మాటలకి ఆశగా తలెత్తాడు మోహన్.

నయమైపోతే—ఇప్పుడు మనం పడ బాధలన్నీ తలచుకుని మనమే నవ్వుకుంటాం" నవ్వుతూనే అన్నాడు సీతాపతి.

ఐతే సరోజనికి వివాహం జరిగితే ఈ జబ్బు నయమైపోతుందన్న మాట. ఐతే మరి ఆలస్యం దేనికి? ఇంకా ఎన్నిమార్లు ఇలాంటి భీభత్సాలు జరగాలి? ఎన్నిమార్లు సరోజని ఇలా శుష్కించిపోయి కోలుకుంటూండగా తిరిగి ఫిట్టొచ్చి మంచం పట్టేస్తుండాలి.? ఈ పెద్దవాళ్లు యింకా ముహూర్తాల కోసమే వెతుకుతున్నారా పంచాంగాలు?

అమ్మకి చెప్పి సాధ్యమైనంత త్వరలో ముహూర్తం పెట్టించాలి. సరోజని మేలుకోవడం తడవు, తాళి కట్టేయాలి.

"అన్నం పెట్టింది వాడన. భోజనాలకి రండి" కామాక్షి గుమ్మంలో కొచ్చి పిల్చింది.

అప్పుడే ముహూర్తం గురించి అడిగే యాలనేంత ఆత్రంగా వుంది మోహన్‌కి. గానీ ఇంతలో పెళ్ళిళ్ళ నీలకంఠం శాస్త్రి గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.

"అన్నగారూ, నన్ను రమ్మని కబురు పెట్టారట?" అంటూ లోపలి కొచ్చాడా యన.

మోహన్‌కి అర్ధమైపోయింది. డాక్టరు మాట మీదనైనా కాస్త కళ్లు తెరిచారు పెద్ద వాళ్ళు. సంతోషం.

"భోజనానికి నువ్వు ముందులే మోహన్!" తొందర చేసింది కామాక్షి. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు మోహన్. లేచి అమ్మ వెంట వెళుతూ గదిలోంచి సరోజనిని చూశాడు. 'లే త్వరగా లే! నువ్వు లేవగానే నీకు మంచి తాయిలం పెడతాను.' అని మనసులోనే సరోజనిని ఊరించాడు పెదాలు తడిచేసుకుంటూ. చాలా రోజుల తరువాత అతని మొగం మీద నవ్వు కనిపించింది. కామాక్షి వెంట వంట గదిలోకి దారితీశాడు నవ్వుకుంటూ.

"అన్నగారూ, నన్ను రమ్మని కబురు చేశారట?"

"ఔను అలా కూర్చోండి" కుర్చీ చూపించాడు సీతాపతి అతనికి నోటమాట రావడంలేదు. నీలకంఠంతో ఏం మాటాడాలో ఎలా మాటాడాలో. అదీ రాజశేఖరం సమక్షంలో మరీ కష్టంగా తోచింది. రాజశేఖరానికి కూడా అలాగే తోచింది.



"అసలు కిందటి మారు సరోజని జబ్బుపడి కోలుకున్నప్పుడైనా నెమ్మదిగా మోహన్ చెవిని వేసువుండాలి. ఇప్పుడు ఈ పరిస్థితిలో సరోజనిని మరొకరి కిచ్చి చేస్తామని తెలిస్తే వెర్రెత్తి పోతాడు... వెర్రెత్తిపోయి ప్రాణాలమీదకైనా తెచ్చుకుంటాడు, లేదా పెళ్ళి ప్రయత్నాల్ని ఖరాబైనా చేస్తాడు. ఎలాచావడం? కామాక్షితో

నేను చెప్తూనేవున్నాను. మరి మా పిల్ల మీకు అక్కర్లేక పోయిన తర్వాత మీరు మీ వాడ్ని ఆదుపులో వుంచుకోవద్దా బావా?" బాధలో ఏం మాటాడుతున్నాడో తెలియక విస్ఫూరంకూడా వేశాడు సీతాపతి.

"ఎలా చె ప్ప మ ం టా వ య్యా?' తలొంచుకునే రా జ శే ఖ ర ం జవాబు చెప్పాడు. "ఎప్పుడు చెప్పమంటావు? ఇదేదో సామాన్యంగా ఒక్క ముక్కలో చెప్పేసే సంగతి కాదు. కా స్త స్థిమితంగా కూర్చుని వ్యవహారం మాటాడాలంటే ఆ అవకాశమి స్తేనా వాడు? ఎప్పుడూ ఇక్క దేనే: అందులోనూ. సరోజని పోయిన సారి జబ్బు పడ్డ తరవాతనై తే, బొత్తిగా ఇల్లు మరిచి పోయాడువాడు. మీ చెల్లెలికి వాడంటే ఎంత గార మోనీకు తెలుసుగదా? పుట్టినప్పట్నుండీ నేటిదాకా వాడు ఏది కోరితే అది తెచ్చివ్వడమే. మా పనిగా నీ. ఎప్పుడై నా కాదు. కూడదని అన్నపాపాన పోలేదు. ఇప్పుడు వాడి మనస్సుని ఎలా నొప్పించ మన్నావు? వాడ్ని ఎలా ఒప్పించ మన్నావు?'' మనసంతా వెళ్ళగక్కాడు.

''నిజమే బావా! గానీ ఇప్పుడు వాడి మంచికోరిగదా, మనం చేస్తున్నాం? పెళ్ళ యితే హిస్టీరియా తగ్గడం అన్నది కచ్చి తంగా ఏ డాక్టరూ చెప్పలేదు. జరగొచ్చ న్నాడు. అలాంటప్పుడు మరివాడి బతు కంతా బుగ్గిలో కలిసిపోయే ప్రమాదం తప్పించడానికి మంచి చేసినా ఏడుస్తాడు వాడు. ఏడుస్తాడని మనం మానేస్తామా? ఈ పాటికై నా చెప్పేసి వుండాల్సింది.''

''సీతాపతీ! ఎలాంటి పరిస్థితిలోనూ వాడి మనసు గాయపరచడం ఇంతవరకూ మాకు అలవాటు లేదయ్యా. అదే ఇంత అనర్థానికి దారితీసింది. ఇంతెందుకు? నీకు తెలీదా. వీడికి చిన్నప్పుడు ఉగ్గుతో, చేదు పడితే. కింకపట్టి ఏడిచే వాడని చెప్పి— కడుపునొప్పితో బాధపడినా సహించిందే గానీ-పాలుపట్టిన చేతితో చేదివ్వలేక పోయేది కామాక్షి. అలా పెరిగాడు మరి.''

"అన్నగారు నన్నురమ్మని కబురు చేశారట?'' నీలకంఠం తన ఉనికిని వాళ్ళకి గుర్తు చేశాడు. ఇద్దరూ అతని పై పొకమారు చూశారు. తిరిగి మాటల్లో పడ్డారు.


''మోహన్‌కి ఇప్పుడెలాగా చెప్పలేం గనక ఒక ఉపాయం చేద్దాం. ఏదో మిష పెట్టి,అవసరంగా ఈ వూర్నుండిదూరంగా ఎక్కడికై నా పంపిచ్చేద్దాం.'' రాజశేఖరం గుట్టుగా సీతాపతితో అన్నాడు.

''ఇప్పుడు వాడు చచ్చినా కదలడు. దానికి నయమయేదాకా హరి బ్రహ్మాదులై నా వాడ్ని ఈ గడప దాటించలేరు. ఊరం టావేం విటి?''

''పోనీ తగ్గిన తర్వాత పంపి స్తేసరి ''

"అలాగా లాభం లేదు బావా! వింటు న్నాను గదా. పెళ్ళి చేసుకుంటే హిస్టీరియా

మీ ఇంటి అందమే మీ ఆనందము



మీరు కట్టించు ఇల్లు, మీ జీవితాంతము కష్టపడి, పొదుపుగా చేర్చబడిన మీ కష్టార్జితముతో కొన్న స్థిరాస్తి. కన్న కలలు నిజమయ్యే శుభసమయము. దీనివల్ల కలుగు ప్రయోజనములను, మీ తరువాత తరములవారికికూడా శాశ్వతపరచుటకుగాను, కె.సి.పి. & దుర్గా సిమెంటుతో కట్టండి.

స్థిరముగా శాశ్వతముగా కట్టండి! కె.సి.పి. & దుర్గా సిమెంటునుపయోగించండి. ఆ సిమెంటు మీకు కావలసిన గుణములకంటే అధిక మోతాదులలో కలిగియున్నది. అంతేకాదు, ఇది గట్టిబడుట, బీటలు వారకుండుట. త్వరగ గడ్డకట్టుట, చూడచక్కని మేలురకపు చక్కదనమును కన్పింపజేయుట మొదలగు గుణములను గల్గియున్నది. అంతేకాదు. కె.సి.పి. & దుర్గా సిమెంటుయొక్క ప్రత్యేకత ఏమాత్రం కల్తీ జరిగినా మీకే తెలుస్తుంది!

కె.సి.పి. & దుర్గా సిమెంటు



తయారుచేయువారు:

ది కె.సి.పి. లిమిటెడ్.
38, మౌంటు రోడ్, మద్రాసు-6

ది ఆంధ్రా సిమెంటు కంపెనీ లిమిటెడ్.
సేల్స్ ఆఫీసు—విజయవాడ



SISTA S-KCP-168-TEL

నయమైపోతుందని. ఆ మాట నువ్వు చెప్తున్నప్పుడు వాడి ముఖంలోకి చూశావా? వాడూరుకోడు. సరోజనికి నయం కాగానే పెళ్ళి చెయ్యమని కూచుంటాడు. పోనీ ఎలాగో తంటాలుపడి పంపించినా, ఎంత కాలం అలా ముసుగులో గుద్దులాట? సరోజనికి తెలివి రావడం తడవు. నేనే చెప్తాను 'అమ్మాయ్! నీకూ మోహన్‌కీ పెళ్ళికాదు' అని! దెబ్బతో గుండె ఆగి చచ్చిపోతే చచ్చిపోనీ!'' ఎందుకంత కర్కశత్వమో తనకే తెలియలేదు. సీతాపతికి! రాజశేఖరం మాటాడలేక పోయాడు.

"అన్నగారు నన్నెందుకో....''

నీలకంఠం వాక్యం పూర్తి కాకుండానే సీతాపతి ''అదే, అదే! మీతో పనుంది'' అంటూ వ్యవహారంలోకి దిగాడు.

8

క్రొత్తముని మొగుడెలా వుంటాడో చూడాలని శ్యామలరావు ఆ సాయంత్రం బయలుదేరాడు. దారి పొడుగునా కుముదిని గూర్చే ఆలోచించాడు. ఆమె జీవితం ఒక కొలిక్కి వచ్చినట్టే. మొగుడొచ్చేశాడు. ఆ రావడం కాస్త పెందరాళే వచ్చాడు. తానూ ఉదయమంతా కంగారుపడిపోయి ఆమె జీవితం గూర్చి ఎన్నెన్నో ఊహాగానాలు చేస్తే. ఊహాతీతంగా సమస్య పరిష్కారమైపోయింది.

కొట్టుమూల పెద్ద పెనం వేసుకుని బూందీ వేయిస్తున్నాడు జొతిష్ఠిర్. శ్యామలరావుని చూసి నమస్కారం చేశాడు.

"పట్నంనుండి గణేశ్ వచ్చేశాడా?'' అతని భాషలో అడిగాడు శ్యామలరావు.

''ఆఁ, వచ్చాడు బాబూ. పిలుస్తాను కూర్చోండి.'' అని బల్ల చూపించి లోపలికి సాహూ కోసం కేక వేశాడు. ఇల్లంతా విశృంఖలంగా వుంది. తనకి తండ్రి చెప్పిన సందడేమీ కనిపించడం లేదు. తిక్కముండా కొడుకు. వస్తూనే పెళ్ళాన్ని తీసుకుని పోలేదు గదా?

సాహూ శ్యామలరావుని చూడగానే చిరునవ్వు నవ్వాడు.

"మీదికి పోదాం రా!'' అనిపిల్చాడు.


ఇద్దరు మిద్దెక్కారు.

కొంతసేపూ ఏమి మాటాడుకోలేదు.

"మీ బావ వచ్చాడట?'' శామలరావు అడిగాడు.

''ఆ. వచ్చాడు'' ముభావంగా జవాబు చెప్పాడు సాహూ. శ్యామలరావుకి చాలా ఆసక్తిగా వుంది. విషయాలు తెలుసుకోడానికి గానీ అలా ఆసక్తి కనపరచడం బాగుంటుందో లేదో భయం వేసింది.

"రాక పోయినా బాగుండి పోయేది'' అని మళ్ళా సాహూయే అనడంతో ఆ సంభాషణ కొంత సాగించడానికి అవకాశం ఏర్పడింది.



"ఏం?" అడిగాడు శ్యామలరావు.

"వచ్చినవాడు తిన్నగా రాకుండా. ఒండా రోగాలతో ఒచ్చాడు. మంచం దిగలేదు, పొద్దుటి నుండీ ఇప్పటి దాకా మాకెవరికీ ఊపిరి సలప నివ్వలేదు. కుముదిని సంగతి సరేసరి"

"ఏం రోగాలు"

"ఏవడికి తెలుసు? కలగాపులగంగా రోగాలన్నీ కనిపిస్తూనే వున్నాయి ముందు వాళ్ళవూరు వెళ్ళాడట. పెళ్ళాం ఇక్కడుందని చెప్పగానే ప్రయాణం కటాడు. అదే సుఖమని పించిందేమో వాళ్ళకి. బండి కట్టించి భద్రంగా పంపించేసి ఇతని బాధ ఒదిలించుకున్నారు. గానీ మాకు తప్పదుగా?" బాధపడ సాగాడు. సాహు.

"ఏమంటాడతను? ఇక్కడే వుంటాడటనా?"

"ఉండకేం చేస్తాడు? ఏం చెయ్యగలడు? భూమి పట్టనంత స్వాభిమానం వుంది. కొంచెం నెమ్మదించగానే పెళ్ళాన్ని తీసుకొని ఎక్కడో ధేన్ కెనాలో. పాడు కెనాలో వుందట ఒరిస్సాలో. అక్కడికి పోతానంటాడు. ఇన్నాళ్లు అక్కడే వున్నాడట. గానీ చూసి చూసి అతనితో ఎలా పంపిస్తాం? దారో హరీమన్నా అంటాడు"

ఇప్పుడు కుముదిని పరిస్థితి మరింత దారుణ మనిపించింది శ్యామలరావుకి.

"అవిడే మంటుంది?"

"ఏమీ అనడంలేదు. మొగుడ్ని చూడ గానే కొంత ఆనందపడింది. గానీఒస్తూనే అతనడిగిన ప్రశ్నలు, అతను ప్రవర్తిం చిన తీరు చూడగానే—మళ్ళీ తన పాత జీవితం తనకి జ్ఞాపకమొచ్చింది. నాకు తెలుసు శ్యామలరావ్, ఈ మొగుడెందు కొచ్చాడా అని దిగులు పడుతుంది కుము దిని. సంబరపడడానికి, ఒకప్పుడు సంసారం కుదురుగా సాగనిగచ్చిన మొగుడు గనకనా?"

"అతన్ని నేను చూడొచ్చునా?"

"ఏం చూస్తావా? రా"

ఇద్దరూ మళ్ళా మెట్లుదిగి కిందికెళ్లారు. ఇంట్లోపల ఒక పెద్ద గదిలో పక్క ఏర్పాటు చేశారు అతని కోసం. ఇంకా గదిలోకి వెళ్ళక ముందునుండే టర్పెంటిన్ వాసనేస్తోంది. లోనికెళ్ళగానే కుముదిని లేచి కొంగుతో ఒళ్ళంతా కప్పుకుంది.

"బావని చూస్తానని ఒచ్చాడు శ్యామ లరావ్." చెప్పేసి సాహూ వెళ్ళిపోయాడు అతనికి అక్కడికి రావడమే ఇష్టంలేదు.

"కూచోండి" అంది కుముదిని. చిన్న నవ్వుతో కూచుంటూ మంచం వైపు చూశాడు. వెల్లకిలా పడుకుని తలకింద చేతులు పెట్టుకుని కళ్ళు మూసుకున్నా డతను. పుల్లలాగా వున్నాడు. గానీ శరీరం మంచి ఛాయతో మెరుస్తోంది. అనాకారి కాడుగాని అనారోగ్యం మాత్రం అణువణువునా కనిపిస్తోంది. వంటినిండా కురుపులు, తల జడలు కట్టేసింది. చర్మం సాఫుగా వుండకుండా ఎక్కడికక్కడ విచ్చిపోయినట్టు అసహ్యంగా వుంది,గానీ ఆ నుదురు, కళ్ళు చూస్తుంటే కొన్నేళ్ళ కిందట ఎలా అందంగా వుండేవాడో అర్థ మౌతుంది ఇప్పుడు బాగా శిధిలమై పోయిన సొగసుదనం.

"నిద్రపోతున్నారా?" అడిగాడు నెమ్మ దిగా.

"అలాగే వుంది" అంది టర్పెంటిన్ అరిన చేతులు గుడ్డకు తుడుచుకుని.సీసాకు మూత పెడుతూ, ఇంతవరకూ అతని ఒంటికి టర్పెంటిన్ పట్టిస్తోంది కుముదిని.

అతను లేస్తే ఒకమారు చూడా లనీ తనకుంది గానీ ఎప్పుడు లేస్తాడో? అంతవరకూ తానిక్కడ కూర్చోవడం బాగోదు, అసలు అతను నిద్రపోతున్నా డని తెలిస్తే తను రాకపోయేవాడు, ఎదు రుగా నేలమీద తలవంచుకుని కూర్చుంది, ఈ కుముదినిని తాను ఏ ఆచ్ఛాదనా లేకుండా శరీరమంతా చూసిన సంగతి గుర్తొచ్చింది శ్యామలరావుకి, ఇప్పుడు గుర్తుకు రాకూడదేమో!

"ఇన్నాళ్ళు ఎక్కడుండేవారు?"మాట ల్లోకి దిగబోయాడు శ్యామలరావు,

"ఎవరు?" హఠాత్తుగా కళ్ళు తెరిచా డతను,

(సశేషం)

పతిత -

'పతిత' అంటే అర్థం ఏమిటో? జీవి తంలో పతనమై పోయిన వాళ్ళంతా పతిత లనేనా అర్థం? ఈ అర్థం ఒక్క ఆడదాన్నిగూర్చే లోకం ఎందు కంటుందో అంతుబట్టదు స్త్రీ—సర్వాంతర్యామి. స్త్రీ లేనిదే ప్రపంచం లేదు. అటువంటి మహత్తర వ్యక్తిని గురించి నీచమైన నిందా రోపణ కూడా చేయడంలో ప్రజ ఎంత ముందడుగు వేస్తుందో ఒక్కోమారు ఎంత ఆలోచించినా అవగాహన కాదు. ఆడది జన్మనిచ్చేందుకు ఎలా కారకురాలవుతుందో వినాశనానికికూడా అంతే కారకురాలవుతుంది. పురుషునికంటే ముందుగా— స్త్రీ స్త్రీని నిందిస్తుంది, ఆమెలోని తప్పును చూపుతుంది, లోకానికి చాటుతుంది. ఈ తరుణంలో పగ-కక్షలు కూడా సహకరిస్తాయి. పతివ్రతకూడా పతిత కాక పోయినా పతితగా లోకానికి చూపించి, నిరూపించేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు ఎవరు పతిత? శరీరకంగా తప్పుచేసిన ఆడదే పతిత? లేక తప్పుడు ప్రచారం చేసిన పతివ్రతలాటి ఆడది పతితా?

పతితకు అర్థం తెలియక ఆలోచన తెగక ఆలోచించే వాళ్ళకు ఇరుగు పొరుగు ఎల్లాయమ్మలే అందిస్తుంటారు అర్థాన్ని కూడా—బాగా ఆలోచించి చూస్తే!

కొంతమంది జీవితాలను గురించి తీవ్రంగా ఆలోచించక తప్పుదు సత్యాన్ని అబద్ధంగా ప్రచారం చేస్తున్నారని తెలిసి నవుడు. ఆ విషయమే మళ్ళీ నాకు అడగా లనిపించింది మా వంటావిడ సుబ్బాయమ్మగారిని;

"ఏం అఘాయిత్యం చేసిందండీ మీ ప్రక్కవాటాలోకి క్రొత్తగా కాపురాని కొచ్చిన పంతులమ్మ?'' అని అడిగాను.

ఇటువంటి విషయాలంటే ఆసక్తి వుండదు నాకు. ఆవిషయం సుబ్బాయమ్మ గారికి బాగా తెలుసు. నేనూ, నా పిల్లలు, మా వారు—ఈ గొడవలే తప్ప మరో ప్రసక్తికి తావివ్వనని తెలిసి కూడా కుతూహలాన్ని దాచుకోలేక సుబ్బాయమ్మగారు అందిగాని నేను సమాధాన మివ్వనని తెలుసు. రెండు మూడుసార్లు పైయి అయ్యేది నేను మాట్లాడలేక పోయేసరికి, నా జవాబులాటి ప్రశ్నకు దావాపు యాభై ఏళ్ళున్న ఆమెలో ఉత్సాహం కలిపెట్టాను.

ఒక్కసారి తలమీద ముసుగు మరింత ముందుకు లాక్కుంది. దీపారాధనకోసం చేస్తున్న వత్తులు మరింత వేగంతో చేయ నారంభించింది. అలాటి విషయాలు చెప్పే పుడు యిలాంటి వారు ఎందుకంత ఉత్సాహ పడిపోతారో అర్థం కాదు ఒక్కోమారు.

"ఆఁ....ఏముందీ? ఈ రోజు ప్రేమ వ్యవహారం మామూలే కనండీ! దొరికాడు కదాని ఎవడినో ప్రేమించిందట. పెళ్ళి వూసెత్తినపుడల్లా రేపూ మాపు వాయిదా లెయ్యటం మొదలెట్టాడట. తీరా కడుపొచ్చే అయిపులేకుండా పుడాయించాట్ట. ఆ పాపిష్టి వాడు" మెటికలు విరుస్తూ అంది సుబ్బాయమ్మగారు.

ప్రతీ ఆడదానికి జరిగేది ఒకే రకమయిన అన్యాయమే! ఆ పంతులమ్మను దులుపుతూ కూడా స్త్రీ జహజత్వాన్ని మరచిపోలేదు సుబ్బాయమ్మగారు. మోసం చేశాడదే మెటికలు విరిచింది. ప్రతిస్త్రీ ఆ విషయం తెలుసుకుంటే ఇక 'పతిత' అనే మాట ఈ ప్రపంచంలోనే వుండదు. కానీ అలా అనటం మానవ సహజం!

అంటే ఎవరూ

సరికి తీయించుకోమన్నాట్ట. నేనాఘాతకపు పనులు చెయ్యనని కాళ్ళా వేళ్ళా పడిం దట...."

"మరి ఆవిడకు పెద్ద దిక్కులేరా?" ఆడదాన్ని జీవిత మంతేగదాని ఆలోచిస్తూ అడిగాను.

"లేకేం! తగుదునమ్మని కూతుర్ని వూరిమీద వదిలి పెట్టిందాతల్లి. నీకా పని చేయటం యిష్టంలేకపోతే మానెయ్ ఇప్పుడు మాత్రం పెళ్ళి చేసుకోను. కొన్ని కారణాలవల్ల కొంత కాలం ఆగాల్సి వుంటుందని' చెప్పి. తీరా నెలలు నిండగానే

"లబోదిబోమని తల్లి ఎంత మొత్తుకున్నా చేసేదిలేక ఈ వూరొచ్చేశారు" ఏదో బరువంతా దిగి పోయినట్లుగా అందామె.

"పాపం!" అన్నాను.

వెంటనే చివ్వున లేచింది సుబ్బాయమ్మ గారు "పాపం అంటా రేమిటండీ దాన్ని చూస్తే మీకు మతిపోతుంది. మెళ్ళో పుస్తె పూసలేదు సరికదా దాని పువ్వులు దాని షోకు అబ్బో చెప్పనలవికాదు.' నెత్తి

ఆర్. మాధవీలత

మీది ముసుగు మరింత ముందుకు లాక్కొని తిరిగి మొదలు పెట్టింది. "మా కోడల ముందు కదిలేస్తే దానమ్మ అంతా చెప్పి ఏడ్చిందట. దీని నోరూరుకోదు కదండీ-నోట్లో నువ్వు గింజ దాగని మన సత్త్వం మా వాడితో అంతా పూస గ్రుచ్చి నట్లు చెప్పిందట 'ఓహో అదా సంగతి' 'పతిత' అన్నాట్ట. ఆ విషయం మళ్ళీ అక్కడికి మోసేసింది. దాంతో ప్రారంభ మయింది రభస. నేను పతితనా అంటూ ఒంటికాలిమీద లేచిందా సుకుమారి బుద్ధి గడ్డి తిని అన్నాం మహాతల్లీ. తప్పు తప్పు అంటూ రెండు లెంపలూ వేసుకొని యిట్లో కొచ్చేశాం. "అని కొంచం ఆగి," మా వాడన్నట్లు ఆ సుకుమారి పతిత కాక పత్తిత్తనవ్వటండీ'. అంది మెల్లిగా. ఆమె మాటలకు నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు. ఒకళ్ళ ననటం ఎందుకు? రెండు అని పించుకోవటం ఎందుకు? ఎవరి బ్రతుకులు వారివి అయినా ఆ అమ్మాయి మనసులో ఎన్ని సుడి గుండాలున్నాయో? నిందలు వేస్తారేకాని అసలు బాధను గ్రహించి ఓదార్చ దెమిటి ప్రపంచం?

సుబ్బాయమ్మగారు నెత్తి మీది ముసుగు మరోసారి ముందుకు లాక్కొనే ప్రయత్నంలో వుంది. మరో నిందారోపణకథ మొదలు పెట్టబోతుందన్నమాట. అతి నేను వినే స్థితిలో లేను. 'సుబ్బాయమ్మ గారూ! స్కూలు నుంచి పిల్లలు వచ్చే వేళ అయింది, టిఫినూ, కాఫీ తయారు చెయ్యద్దూ" అంటూ లేచాను.

నా మాటలతో ఆమె ప్రదేశన్ అంతా సాదయిపోయింది నసుక్కుంటూ వంట గదిలోకి వెళ్ళి పోయింది. యాంత్రికంగా పనిలో వుండి కూడా ఈ విషయాలు చెప్పడ మంటే ఆమెకు ఎంత సరదా! వీళ్ళ విషయమే యిలా వుంటే యిక యవ్వనంలో వున్న వారి సంగతేమిటి! 'యవ్వనం' అనగానే పదేళ్ళ నాటి విషయం జ్ఞప్తికి వచ్చింది. పదేళ్ళు అంటే నర్సు రోజ్-నా మనోఫలకం మీద అలా గేమెదుస్తుందామె. రోజ్ నిజంగా నలగని రోజా పుష్పం. ఆమె అసలు పేరు రోజ్ మారరెట్. మంచి మనసు, వయసు, అందం వున్న రోజ్‌ని చెడి పోయింది. పతిత, కులట, అని రకరకాల నామ కరణాలు చేసింది ప్రపంచం. వాటికి అర్థాలు ఆమె విషయంలో ఏవి సరైనవి కావు. కానీ వాటిని ఆమె భరించక తప్పలేదు. ప్రపంచాన్ని ఎదిరించలేక ఆమె నిందను మొయ్యలేదు తెలివిలేక అన్యాయకు రాలిలా నిందను మొయ్యలేదు. కానీ, తన సర్వస్వం అని భ్రమించిన తన భర్త తనను మోసం చేశాడు. అందుకే ప్రపంచం అలా అంటున్నా న్యాయం కోసం నిందనలను భరించింది. 'పతిత అని ఆమెను అంటూంటే ఆ రోజుల్లో నాకు అర్థం కాలేదు.

వైద్యం కోసం కొంతకాలం నేను ఆసుపత్రిలో వున్నాను. ఆ సమయం లోనే రోజ్ పరిచయమయింది. డాక్టర్ల దగ్గరనుంచి స్టాఫ్ వరకు ఆమంటే ఎంతో సన్నిహితంగా చూసేవారు. మధ్యాహ్నాం సమయాల్లో పసిపిల్లతోబాటు రోజ్ కొడుకు ఆరేళ్ళ అబ్బాయి, ఆ అబ్బాయితో పాటు అతని కన్నా చిన్నపిల్లా భోజనం తెచ్చే వాళ్లు. 'మమ్మీ....మమ్మీ' అంటూ ఎంతో ముద్దుగా వుండేవాళ్ళు డాక్టర్లు అందరూ మిస్. రోసీ అని పిలిచే వారు. ఈ వ్యత్యాస మేమిటో నాకు అర్థం కాలేదు.

(సశేషం)



వి.రాజారామమోహనరావు

రోజూ సాయంత్రం నీరెండ ఆ ఎదురింటిని అందంగా పెయింట్ చేస్తుండేది. నేనూ నరసింహం వండుకుతింటూ, ఆ ఇంటి కెదురుగా రూమ్‌లో వుంటున్న రోజులవి. ఎకౌంటెన్సీ పుస్తకాల తలనొప్పికి రిలీఫ్‌గా సాయంత్రం పూట డాబా మీద కొచ్చేవాణ్ణి.

మా డాబా పక్కన వో పాకుంది మా వీధికి ఆపాకే ఆఖరి యిల్లు. మెట్ల మీంచి డాబా మీదకి వస్తుంటే ముందు ఆ పాకే కనపడేది. కాస్సేపు డాబా మీద అటూ ఇటూ పచార్లు చేశాక పిట్ట గోడమీద కూచుని రోడ్డుని, ఎదురింటినీ చూట్టం తప్ప మరేం కాలక్షేపం వుండేది కాదు. బజార్లోకి ఎక్కడికేనా వెడదామంటే తిరిగి రావటం ఆలశ్యమవుతుందని ఎకౌన్‌టెన్సీ పుస్తకాలు భయపెట్టేవి.

డాబా మీంచి ఎదురింటి ఆవరణమంతా కనపడేది. బిల్డింగే పెద్దది. అలాంటివి మరో రెండు బిల్డింగులు కట్టుకునేంత కాంపౌండ్. ఖాళీ జాగా కనపడనీయకూడ దన్నట్టు పెంచారు గార్డెన్‌ని.

చిన్న లాన్....పచ్చగా మెరిసే గడ్డి గాలి కదిలినపుడు కనపడే పూలరంగులు. గేట్ దగ్గరనుంచి బిల్డింగ్ వరకూ బద్ధకంగా పరుచుకున్న గ్రావెల్. నీరెండ వీట న్నిటి మీద నడుస్తూ కదిలేది. అదే రోజూ నేను చూసే పెయింటింగ్.

ఇంత ఎండ ఆ తోటని వదిలేసి వెళ్ళటానికి సిద్ధ మయేటప్పుడు ఇంట్లోంచి బైటకొచ్చేవాళ్ళు. ఆయనతో కొద్దిగా పరిచయం వుంది నాకు. కనపడినప్పుడు విష్ చేసుకునే పరిచయం.

నరసింహం రూమ్‌లో వుండటమే తక్కువ. ఒకవేళ వున్నా ఏదో పుస్తకం పుచ్చుకునేవాడు. ఎక్కువగా మాట్లాడే తత్వం కాదు వాడిది. వాడు బాగా యిష్ట పడే పుస్తకాలు కొన్నుండేవి. అవి పుచ్చుకూచుంటే ఈ లోకంలో వుండే వాడు కాదు. కష్టపడి కబుర్లలోకి దింపుదామన్నా వాడు మాట్లాడే పద్ధతి జిడ్డుగా వుండేది. సినిమాల గురించి మాట్లాడినా సిగరెట్ల గురించి మాట్లాడినా వర్గదృష్టి, సామాజిక విలువలు అంటూ తన ధోరణిలోకి లాగేశే వాడు. అందుకని వాడితో కబుర్లన్న సరదాని చంపుకోక తప్పలేదు నాకు.

ఓ రోజు సాయంత్రం నరసింహం డాబా మీద కొస్తే రోజూ నేను చూసే ఎదురింటి అందాన్ని చూపించాను.

ఎదురింటాయన ఆవిడా వచ్చి లాన్‌లో కూచోటం. కాసేపు వాళ్ళ మూడేళ్ళ పాపతో ఆడకోటం....ఆయా తెచ్చిన టీ కబుర్లతో, నవ్వుల్తో తాగటం....యివన్నీ నరసింహం చూశాక....'ఎలా వుంది....' అన్నాను.

'బావుంది....' అన్నాడు. బావుందన్న మాటలో మూడక్షరాలు ఎందుకున్నాయిరా భగవంతుడా అన్నంత ముక్త సరిగా అన్నాడు. నేను రోజూ చూసే అందాన్ని పాడలా బావుందని ముక్తసరిగా. పొడిగా కుదించేయటం నాకేం బావుండలేదు.

ఫేమిలీ లైఫ్ కూడా యాంత్రికంగా మారిపోతున్న యీ రోజుల్లో ఎదురింటి వాళ్ళు అలా రోజూ కొంత ప్రైము కులా సాగా గడపటానికి ఏర్పరచుకోటం. అలా వుండగలుగుతోండటం నన్ను బాగా ఆకర్షించాయి. ఇది నరసింహం దృష్టికి కూడా వచ్చింది.

మాసిన బొంతలా చంద్రయ్యుంటే దానిమీద అతుకులా వుంటుంది చంద్రయ్య పెళ్ళాం. మనిషిని చూడగానే రోగిష్టిదని తెలిసిపోతుంది. సీదు పట్టిన ముఖం ఎండలో మెరుస్తోంది. కళ్ళ కింద నీడ ల్లోకి ఎండ వెళ్ళలేక పోతోంది.

అన్ని తిట్లు తిడుతున్నా చంద్రయ్యని బతిమాలి మరీ అన్నం పెట్టింది. చంద్రయ్య పాక గుమ్మంలో కూచుని అన్నం తింటుం డగా లోపల్నించి పాకుతూ పసిపిల్లా డొచ్చాడు.

దుఃఖమనేది గొప్పవారికో మాదిరీ బీదవారికింకో మాదిరి వుంటుందా? అంతస్థుల విషయంలోనే కాక దుఃఖం విషయంలో కూడా బీద వానిది చివరి మెట్టేనా? !

తేవాలని మరోసారి ప్రయత్నించి చూశాను.

ఈ లోగా మా డాబాపక్క పాక ఆసామి చంద్రయ్య వచ్చాడు. చంద్రయ్య రిక్షా తొక్కుతాడు. బండిని పాక బైట పెట్టి లోపలికెళ్ళాడు. నరసింహం దృష్టి అటువేపు వుండటం వల్ల నేనూ చూశాను. పాక తప్పుని దాటుకుని కాస్సేపు చంద్రయ్య కేకలు వినపడ్డాయి మాకు. మేం చూస్తుం డగానే రుసరుసలాడుతూ చంద్రయ్య పాక బైట కొచ్చాడు.... వెనకాలే పెళ్ళాం

చంద్రయ్య కాస్సేపు వాణ్ణెత్తుకున్నాడు. బీడీ కాల్చుకున్నాడు. పిల్లాణ్ణిచ్చి వెళ్ళే టప్పుడు ఆకాశం వెలిగేంత సంతోషం కాక పోయినా మొత్తానికి ముఖం మాడ్చుకు మటుకు వెళ్ళలేదు.

రిక్షా తీసుకుని వెళ్ళిపోతున్న చంద్రయ్యతో పాటు నా చూపు ఎదురింటి గేట్ వరకూ వెళ్ళింది. అప్పుడే ఎదు రింటాయన ఏదో జోక్ చేసి నవ్వున్నాడు.... ఆవిడగాలికి వూగే సన్నటి తీగలా గల గలా నవ్వింది.

నేను మళ్ళీ అడక్కుండానే నరసింహం వాళ్ళ ప్రసక్తి తీసుకొచ్చాడు. చివరికి అసలు అందమంతా ఎదురింటి తోటలో వాళ్ళ ప్రవర్తనలో కన్నా నా ఆలోచనలో వుందన్నాడు. నాకు తెలియకుండానే నాలో ఆ అప్పర్ క్లాస్ లైఫ్ మీద కోరికుందన్నాడు. నిజంగా భార్యాభర్తల మధ్య అనురాగమే నన్ను ఆకర్షించి వుంటే పక్కపాక చంద్రయ్య బతుక్కూడా నన్ను ఆకర్షించి వుండాలన్నాడు.

మనుషుల ఆర్థిక స్థితిగతుల్లో తేడాలున్నా దుఃఖం సంతోషం అందరి మీద చూపించే ప్రభావం మటుకు వొకలాగే వుంటుందన్నది నా ఉద్దేశం ఈ విషయం నరసింహం వొప్పుకోడని నాకు తెలుసు. అందుకనే వాడితో వాదించకుండా ఎందుకొచ్చిన గొడవలే అని వూరుకున్నాను.

నేను నరసింహం ధ్యానలోంచి తేరుకుని ఎదురింటి వేపుచూశాను. అప్పుడే పాపని నడిపించు కుంటూ లాన్‌లోకి వస్తోందావిడ .... నిండుగా నెమ్మదిగా నడుస్తోంది.

* * *

ఆ వార్త నన్ను చేరగానే ముందు నమ్మలేక పోయాను. అందమైన నా పెయింటింగ్ మీద ముద్దగా రంగు వొంపింది ఆవార్త. ఎదురింటి లక్ష్మీపతిగారి భార్యని ఆ పురిటి గండం నుంచి ఊళ్ళోని చాలా మంది డాక్టర్లు ఎంతో ప్రయత్నం చేసికూడా బతికించలేక పోయారు.

ఊళ్ళో పలుకుబడి డబ్బుతో పాటు వో మిల్లూ వుందేమో లక్ష్మీపతి గార్కి రెండు రోజులు ఎదురింటి నిండా హడావిడే. వచ్చేవాళ్ళు వెళ్ళేవాళ్ళు....వాళ్ళలో చాలామంది ఫార్మాలిటీ కార్ల మీద వచ్చారు పరామర్శకి.


నా ఎకౌంటెన్సీ పరీక్షల గొడవలో యిది పెద్దగా పట్టించు కోకపోయినా బాధ మటుకు కలిగింది. హడావిడి తగ్గాక వో సారి వెళ్ళి ఎదురింటాయన్ని పలకరించి రావాలను కున్నాను.

నాలుగోరోజుకి హడావిడి పూర్తిగా కాక పోయినా చాలా వరకూ తగ్గింది. రోజూ సాయంత్రం ఎవరో ఒకాయన మటుకు రెగ్యులర్‌గా వచ్చి చీకటి పడే వరకు వుండి వెళ్ళేవాడు.

ఎప్పుడూ గడ్డం కూడా మాయనీయని లక్ష్మీపతిగారు మాసిన బట్టల్లో కన పట్టం మొదలెట్టారు.

రేపేనా వో సారి వెళ్ళిరావాలనుకున్నాను. ఎలా పరామర్శించాలనీ తెలియని అయోమయం నా వుద్దేశాన్ని వాయిదావేస్తూ వచ్చింది.

ఆ రోజు అర్ధరాత్రి మా డాబా పక్కపాక రోజు కన్నా గట్టిగా మూల్గింది. డాక్టరు వచ్చాడో లేక డాక్టరు లాంటి



కాంపౌండరేనా వచ్చాడో లేదో ఆ పాకలో చీకటే సాక్ష్యం చెప్పాలి. మొత్తానికి మర్నాటి మధ్యాహ్నానికి మా వీధికి మరో చావు వార్త తెలిసింది. చంద్రయ్య పెళ్ళాం చచ్చిపోయింది

నరసింహం వూళ్ళో లేడు. సాయంత్రం డాబా మీద కెడితే యిబ్బంధిగా అనిపించింది ఇంకా లక్ష్మీపతి గారింటికి రోజూ ఒకళ్ళోయిద్దరో వచ్చి వెడుతూనే వున్నారు. ఆరోజు నేను గమనించిందేమిటంటే రోజూ చీకటి పడగానే చంద్రయ్య పాకలో మినుకుమినుకు మని వెలిగే కిరసనాయిలు దీపం ఆ రోజు బాగా చీకటి పడేవరకూ వెలగలేదు.

లక్ష్మీపతి గారింటికి వెళ్ళాలనుకుంటూ మరో రెండు రోజులు గడిపేశాను. చంద్రయ్య భార్య పోయి రెండో రోజు. తెలతెలవారు తుండగా నరసింహం వూర్నించొచ్చాడు. వాడికి తలుపు తీయటానికి వెళ్ళిన నాకు చంద్రయ్య కనిపించాడు. పూసలు జారి పోయిన పాములా రిక్షా నడిపించు కెడుతున్నాడు.

"ఏమిటిరా....అలా చూస్తున్నావు." అన్నాడు నరసింహం.

చంద్రయ్య భార్య పోయి రెండు రోజులు కూడా కాలేదని చెప్పాను. నరసింహం కొంచం సేపు బాధ పడ్డాడు. చంద్రయ్య మాకు తరచుగా రిక్షా కట్టేవాడు. "చంద్రయ్యని పలకరించావా...." అనడిగాడు తర్వాత నరసింహం.

ఏమనాలో తోచలేదు. సాయంత్రం వెళ్ళాగోలాగ లక్ష్మీపతిగార్ని, చంద్రయ్యని పలకరించాలనుకున్నాను.

సాయంత్రం ఆఫీసు నుంచి రూము కొచ్చాక ముఖం కడుక్కుని బైలుదేరాను. వెంటనే మళ్ళీ లక్ష్మీపతిగారు బైటికెళ్ళటం మానేసి నట్టుంది.

నన్ను చూడగానే...."రండి... రండి" అన్నారు లక్ష్మీపతిగారు. రోజూ సాయంత్రం వచ్చి కూచునే ఆయన పక్కనే వున్నాడు. కాస్సేపు మాటలేం సాగలేదు మా మధ్య.

పక్కనున్నాయన తన స్నేహితుడని ఆయనే ప్రస్తుతం మిల్లు వ్యవహారమంతా చూసి పెడుతున్నాడని లక్ష్మీపతిగారు చెప్పారు.

అరగంట కూచున్నా అయిదారు మాటలన్నా ఎక్కువ మాట్లాడలేక పోయాను. లక్ష్మీపతిగారిలో నిరుత్సాహం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. ఆయనమళ్ళీ మామూలుగా మిల్లు వ్యవహారాల్లో పడితేనే ఈ బాధ నుంచి తేరుకోగలరనిపించింది.

ఇంక లేచొచ్చేముందు ఆసే అన్నాను పరామర్శ అలవాటులేక ఆ విషయాన్నే కొంచం అవకతవకగా .. "మీరిలా బెంబేలు పడితే ఎలా....అన్నీ తెలిసిన వారు....పెద్ద షాకే అనుకోండి ..ఏం చేస్తాం—" అన్నాను. అలా అంటుండగానే చంద్రయ్య గుర్తొచ్చాడు.

"చంద్రయ్య చూడండి....ఎలా తన పనిలో పడ్డాడో...." అన్నాను. లక్ష్మీపతిగారు దానిమీద ఏదేదో అన్నారు లక్ష్మీపతిగారి స్నేహితుడు చంద్రయ్య ఎవరూ అనడిగితే ఆయనే సమాధానం చెప్పారు.

నేను లేచి వచ్చేస్తోంటే లక్ష్మీపతిగారి స్నేహితుడు కూడా లేచాడు. ఇద్దరం కలిసి గేటువరకూ వచ్చాం. వస్తుండగా జరిగిన మాటల్లో ఆయనన్నాడు.

"చంద్రయ్య విషయం మీరు చెప్పింది నిజమే అనుకోండి. అయినా రిక్షావాడిని మా వాడిని ఒకేలా అంచనా వేస్తే ఎలా చెప్పండి. మావాడు గడిపిన లైఫ్ మీకు తెలియదు గాని మిసెస్‌ని ప్రాణం క్రింద చూసేవాడు. చంద్రయ్యంత తేలిగ్గా మా వాడు ఎలా కోలుకో గలడు చెప్పండి." అన్నారు.

అలా అన్న ఆయన మాటలు నన్ను కొంచం మందలించి నట్టుగా వున్నాయి. నాకేమనాలో తెలియలేదు. భార్యపోయిన బాధ చంద్రయ్యకి లక్ష్మీపతిగార్కి సమానమే అన్న వుద్దేశం నాలో చూచాయగా వుంది. లక్ష్మీపతిగారి స్నేహితుడి మాటలు విన్నాక అది బలపడింది.

లక్ష్మీపతిగార్కి అవకాశం వుంది. కాబట్టి తీరుబడిగా కూచుని బాధపడ గలుగుతున్నారు. చంద్రయ్యకి ఆ అవకాశం లేదు.

బాధ. సంతోషం అనుభవించటానికేనా మరిచి పోటానికేనా జీవిత స్థితిగతులు చుట్టూ పరిసరాలు చాలావరకు తోడ్పడతాయన్న మాట అనిపించింది.

నరసింహం గుర్తొచ్చాడు. వాడి మాటలు వాడి ధోరణి నిజమే అనిపించింది వో క్షణం.

అగ్ని కోల

చెరచబడ్డ పడుచుపిల్ల
చెప్పే విషాదం విను!
స్వేచ్ఛ కొరకు పోరాడ
వచ్చిన యోధుల శవాల చూడు!
అణచబడ్డ జనులలో
రగులుతున్న అగ్ని కణాల చూడు!
ధనం చేస్తున్న దౌర్జన్యానికి
అధికారం చేస్తున్న దమనకాండకు
అడ్డు గోడలుగా నిలిచి
అసువుల నర్పిస్తున్న
నగశిఖరాల మీది
సహోదరుల మహాశక్తి గమనించు!
నగరాలలోని నయవంచకుల మధ్యన
వ్యక్తిత్వాన్ని చంపుకొని
శక్తి సామర్థ్యాల అమ్ముకొని
షేడ్ క్రింది దీపంలా
నిమ్మ దృక్కు లెంతకాలం?
మహావృక్షం క్రింద
పెరుగుదల నెరుగని మొక్కల్లా.
మరుగుజ్జ బ్రతుకు లెంతకాలం?
తెగించు. నడుం బిగించు!
విను వీధి దద్దరిల్ల
విప్లవ శంఖం పూరించు!
రణరంగంలోకి నరునివై
ప్రవేశించు!
శ్రీ కంఠుని గళములోని
హాలాహల జ్వాలామాలికవై
విప్లవించు!
వ్యాపించు!!

—ఎన్. వి. రావు

హనీమూన్ యాత్రాశెట్టి

— శాయి

(గత సంచిక తరువాయి)

రైల్లో ఆ రోజుకి రిజర్వేషన్ కోసమని సురాదు కాఫీలు త్రాగి స్టేషన్‌కు బయల్దేరాం. రిజర్వేషన్ కౌంటర్ ముందు పెద్దహేను మేకలు తిరిగి పోయి ఉంది 'క్యూ'

'ఇంత పొడుగుందేమిట్రా 'క్యూ' అని సారధి భుజం మీద చేయి వేశాను కాని వాడక్కడ కనిపించలేదు. ఆశ్చర్యంగా వెతికాను. అక్కడే క్రింద తల పట్టుకొని కూర్చుని ఉన్నాడు.

"ఏమైందిరా!" అన్నాను ఖంగారుగా.

"'క్యూ' రాబాబూ! అది చూసేసరికి కళ్ళు తిరిగినాయి ఇంత పొడుగు 'క్యూ' లో ఏ నాడయినా నుంచున్నామా చచ్చామా?" అన్నాడు నీరసంగా.

"ఈ క్యూలో నుంచుంటే ఇంటికి చేరతామని నమ్మకం లేదు!" అన్నాడు దిగులుగా.

అన్నట్లు మన వీధిలో పంపుదగ్గరింట్లోని సీతాపతి రైల్వేలోనే యేదో ఉద్యోగం చేస్తున్నారని చెప్పాడు గదా. రైల్వే మినిష్టర్ చెయ్యి విరిగేట్లు షేక్ హాండ్ ఇచ్చారనీ. లాల్‌బహదూర్ శాస్త్రి వీడి వాకచక్యం చూసి వళ్ళుమండి గాఢంగా కౌగలించుకొన్నాడనీ, చెప్తూండేవాడు. వాడినడుగుదాం క్యూలో వెళ్ళనవసరం లేకుండా పని జరిపేస్తాడేమో!"

ఇద్దరం సీతాపతిగురించి గేటు దగ్గర టి. పి. ని ...ం.

"ఆయన మీ బంధువా సార్?" అవడిగాడు టికెట్ కలెక్టర్ మర్యాదగా.

"ఓహో! వాడికి చాలా పరువున్నట్లుంది" అన్నాడు సారధి మెల్లగా.

"ఆఁ బంధువు కాదు గానీ, ఫామిలీ ఫ్రెండ్ లేఁ" అని దర్జాగా చెప్పాం.

"పదు... నేను తీసుకెళ్తాను!" అంటూ మా వెంబడే బయల్దేరాడు. త్రోవలో మెల్లగా అన్నాడతను.

పెద్ద కథ

"ఆయనక్కొంచెం రికమెండ్ చెయ్యాలి సార్! నా ఇంక్రిమెంట్ ఆగిపోయింది. ఆయన తలుచుకొంటే నిముషాల్లో అయిపోతుంది!"

"పోన్లేరా చెబుదాం!" అన్నాడు సారధి.

స్టేషన్లోని పెద్ద గదిలోకి తీసుకెళ్ళాడతను. లోపల ఓ సూట్ వాలా ఫాన్ క్రింద కూర్చుని ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"మీ కోసం వెదుకుతోంటే నేనే తీసుకొచ్చాను సార్ వీరిని!" అన్నాడు టి. సి. ఆయనతో.

"ఏం కావాలి?" అన్నాడా ఆఫీసరు.

"హబ్బే....మీరు కాదు....సీతాపతని, మా వీధిలో ఉంటాడతను .... అంటే అదే! గవర్నర్ పేట లేదూ ...రైల్వేలో చేస్తున్నాడు... ఆయనకోసం"

"సరిగ్గా తెలుసుకోకుండా, యిలా కనబడ్డ ప్రతీ వాడినీ తీసుకొచ్చావంటే నీకు ఛార్జిషీటిస్తాను!" అన్నాడతను టి. సీ. తో.

ముగ్గురం బయటికొచ్చాం.

"సీతాపతంటే ఈయన కాదండీ! మా వాడు నల్లగా, పొట్టిగా...."

"పోయి అడిగండి!" అనేసి చక-చక వెళ్ళిపోయాడా టి. సీ.

సీతాపతి గురించి మరో ఇద్దరు ముగ్గురనడిగి చూశాం.

"సీతాపతులు వెరశి డజను మందున్నారయ్యా! అందులో ఏ సీతాపతి?" అన్నాడో సీతాపతి. ఇక లాభం లేదని బయటి కొచ్చేస్తూంటే మా క్కావల్సిన సీతాపతి మా కెదురొస్తూ కనిపించాడు.

"ఏమిటిలా వచ్చారు?" అన్నాడు నవ్వుతూ.

"నీ కోసమేనయ్యా బాబూ! వచ్చే శుక్రవారానికి రిజర్వేషన్ కావాలి. అక్కడేమో కిలోమీటరు పొడుగునుంది క్యూ!" అన్నాము.

"ఓస్! అంతేనా? పదండి!" అంటూ మమ్మల్ని వెంబడి తీసుకెళ్ళాడు. 'క్యూ' దాటి వెళ్తుండగా మా ఆఫీసులో పనిచేసే బ్రహ్మానందం, మధ్యలో నుంచుని కనిపించాడు. వాడినిచూసి జాలిపడ్డాడుసారధి.

"రిజర్వేషన్ కోసమేనా?" అనడిగాడు.

"అవునండీ! పొద్దుట్నుంచీ యింత వరకూ ఎనిమిదడుగులు ముందుకువేశాను. మరి మీరో?"

"మేమూ అందుకే!" అన్నాడు సారధి.

"అలాగయితే క్యూలో నుంచో లేదేం?"

"ఛ! వెధవ క్యూలో ఎవడు నుంచుంటాడోయ్! ఏనాడూ నుంచోలేదు,

అయినా స్టేషన్లో చాలా ఇన్ఫ్లూయెన్స్ ఏడ్చింది మేము డార్జిలింగ్ వెళుతున్నా మని తెలిసి అతను మా వీధిలోనే ఉంటాడులే—తనే మా యింటి కొచ్చాడు రిజర్వేషన్ చేయిస్తానని మేము కూడా రానవసరం లేదన్నాడు గానీ-సరదాగా వచ్చాం!....'' అన్నాడు సారథి. వాడు చెప్పేదంతా నాకూ నిజమే నేమో అని పించింది.

బ్రహ్మానందం ఇప్పుడు చాలా నమ్ర తగా నిలబడ్డాడు.

''అలాగాండి! అవునండి!'' అన్నాడు చేతులు జోడించుకొని

అదివరకు వాడు ఆఫీసులో పెద్దగా మాట్లాడే వాడు

'వస్తా' అంటూ మేము తిన్నగా నడిచి రిజర్వేషన్ ఆఫీస్ దగ్గరకు నడిచాము. అప్పటికే సీతాపతి లోపలకు వెళ్ళి రిజ ర్వేషన్ క్లర్క్‌తో మాట్లాడు తున్నాడు.

''రైల్వే వాడివయితే మాత్రం? నువ్వె వరో నాకు తెలీదు. వెళ్ళి క్యూలో రా. ఇంకా గొణిగావంటే పోలీస్‌ని పిలుస్తాను'' అన్నాడు రిజర్వేషన్ క్లర్క్.

''కొంచెం మెల్లగా మాట్లాడండి! అవతల మా వాళ్ళున్నారు!'' అన్నాడు సీతాపతి భయంగా

''మెల్లగా ఏమిటోయ్! ముందు బయటకు నడు!'' అన్నాడతను మరింత గట్టిగా. సీతాపతి బయటి కొచ్చేశాడు. ఏడుపుకి సిద్ధంగా ఉన్న అతని మొహం మా దగ్గర కొచ్చేటప్పటికి నవ్వుగా మారి పోయింది.

''ఒక్క సీటుకూడా లేదండీ ఆరోజుకి ఆ మర్నాటికయితే ఎన్ని కావాలంటే అన్ని ఇస్తానన్నాడు పాపం చాలా బాధ పడ్డాడు లేవని చెప్పటానికి కాఫీ తెచ్చిస్తా నంటోంటే బలవంతం మీద బయట పడ్డాను....'' అన్నాడు.

''ఫర్లేదులే!'' అంటూ బయటకు నడిచాం.

సీతాపతి వెళ్ళిపోగానే నేను గట్టిగా నవ్వేశాను.

''ఎందుకు!'' అన్నాడు సారథి కోపంగా

'ఇప్పుడు 'క్యూ'లో నుంచోక తప్పుదుగదా! ఈ పని అప్పుడే చేస్తే ఈ పాటికి చాలామంది కంటే ముందు ఉండే వాళ్ళం.'' మధ్యలో బ్రహ్మానందం పలుకరించాడు.

''అదృష్టవంతులు సార్! అయిదు నిమషాల్లో పనయిపోయింది!'' అన్నాడు.

''అవును'' అన్నాడు సారథి కోపంగా ఇక ఆ వేళకి చస్తే 'క్యూ' లో నుంచోడానికి వప్పుకోలేదు. బ్రహ్మా నందం చూస్తే పరువు పోతుందన్నాడు. ఇద్దరం ఇంటి కొచ్చేశాం.

వసారాలో మా తాతయ్య కూచుని ఉన్నాడు. నాపై ప్రాణం పైనే ఎగిరి

పోయింది. తనెక్కడ మాతో బయల్దేర తాడో అని, అనుకొన్నంతా అయింది కూడానూ.

డార్జిలింగ్ వెళ్తున్నారని తెల్పింది. త్రివేణీ సంగమం వెళ్ళాలని ఎప్పట్నుంచో అనుకోవడం ఎలగూ మీరటు వెళ్తున్నారు గదాని బయల్దేరాను....' అంటూ మొదలెట్టాడు. భోజనాలయాక ''కాని



అల్హాబాద్! మేము వెళ్ళేత్రోవలో లేదే?" అన్నాను తప్పించు కోడానికి ప్రయత్నిస్తూ. ''ఎందుకు ఉండదురా! దార్లోవచ్చేట్లుగా మనం వెళ్తేసరి కొంచెం ఖర్చు ఎక్కువవు తుందనుకో! అదంతా నేను చూసుకొంటా గదా!....''

''నోర్మూసుకోరా! తాతయ్య వెళ్ళాలంటూంటే కాదంటా వేంటి? నువ్వు కూడా వద్దూగాని తాతయ్యా! అసలు నేనే నీకో కార్డు ముక్క వ్రాసి పడేద్దామను కొంటున్నాను రమ్మంటూ. నువ్వీలోగా రానే వచ్చావ్!''

"అలా చెప్పువాడికి! నాలాంటి ముసలాడిని వెంట త్రిప్పడం మీకొంచెం కష్టమే అనుకో! అయినా పెద్ద చిన్నా అంటూ ఉండాలి గదా!''

నాకు సారధిగాడిమీద వళ్ళు మండి పోయింద

''తాతయ్య సంగతి ఇద్దరకూ బాగా అనుభవమే! మహావాదస్తం మనిషి.

కాసేపయిం తర్వాత సారధి నన్ను ప్రక్కకు తీసుకు పోయి అన్నాడు.

"నీకు తెలీదురా రాస్కెల్. తాతయ్య మనతో రావడం చాలా ఆరోగ్యం మనకి. మన బడ్జెట్ ఇప్పటికే దారుణ మయిన లోటులో ఉంది. పైగా ఏదయినా అరాం

తరంగా ఖర్చొచ్చినా కూడా తాతయ్య మనకి అందగా ఉంటాడు....ఇలాంటి వన్నీ గ్రహించు కోవాలోయ్!'' తప్పయి పోయిందని ఒప్పుకొన్నాను.

దాంతో మాకు ఆర్థికబాధ తప్పి పోయింది. ఉత్తరక్షణంలోనే ఇద్దరం రైల్వే టైం టేబుల్లు తీసుకొని అలహాబాద్ మీదుగా డార్జిలింగ్ వెళ్ళే రూట్లు కని పెట్టాం. ఝాన్సీ వెళ్ళి అక్కడి నుంచి మానెకపూర్ మీదుగా అల్హాబాద్ చేరు కోవడం. అక్కడినుంచీ బరోని మీదుగా సిలిగురి వెళ్ళి డార్జిలింగ్ చేరుకోడం-ఇది సారధిగాడు కనిపెట్టిన తేలికయిన మార్గం కానీ అదే చాలా చుట్టు తిరిగి వెళ్ళే మార్గమని ఏ మాత్రం బుర్రలేని వాడు గాని ఆ రూట్లో వెళ్ళడని తర్వాత తెలి సింది. (అప్పటికి సగం ప్రయాణం అయిపోయింది.)

మర్నాడు ప్రొద్దున్నే ఇద్దరం రిజర్వే షన్ క్యూలో నిలబడ్డాం. మేము వెళ్లే ప్పటికే పెద్ద 'క్యూ' ఉందక్కడ. మా ముందున్న ఓ కాలేజి స్టూడెంట్ 'లలలా' అంటూ ఇంగ్లీష్ ట్యూన్ పాడుతున్నాడు.

"కౌంటర్ దగ్గరకు షుమారుగా ఎప్ప టికి చేరతా మంటారు?'' అడిగాడు సారధి

"క్యూలో ముందున్న ఆ ముసలా యన్ని చూశారా?'' అడిగాడు కుర్రాడు.

"ఆయన 'క్యూ'లో చేరినప్పుడు నాలానే ఉండేవాడు. అక్కడికి చేరుకొనే సరికి ముసలాడయి పోయాడు. అదీ సంగతి! ఫర్లేదులే! నవ్వండి! ఇది జోకు!'' బాగోదని కొంచెం నవ్వాను. సారధి మొఖమాటానికయినా నవ్వలేదు. మధ్యా హ్నం భోజనాలు లేవు. రెండింటికి కౌంటర్ చేరుకున్నాం. తీరా శుక్రవారం నాడు ఒక్క సీటు కూడా ఖాళీ లేకుండా నిండి పోయింది. "శనివారం నాడు దొరుకుతవి బెర్తులు కావాలా?'' అడిగాడు రిజర్వేషన్ క్లర్క్.

"శనివారం నాడు అష్టమి కదా. అష్టమి నాడు ఎలా బయల్దేరటం?'' అన్నాడు సారధి.


"ఆ! మీలాగా తిధుల్ని నక్షత్రాల్నీ చూసుకొంటూ కూర్చుంటే నెలలో ఇరవై రెండు రోజులు రైళ్ళు నడవ్వు! '' అన్నా డతను. "త్వరగా తేల్చండి! వెనకచాలా మంది ఉన్నారింకా'' అంటూ గదమా యించాడు కూడా.

'అదేమీ చూడక పోబట్టే రైళ్ళు ఇలా పడిపోతున్నాయి!'' అన్నాడు వెనుక నుంచి ఓ శాస్త్రుల్లుగారు.

'సరే! ఆ రోజుకే ఇవ్వండి!'' అన్నాడు సారధి.

డబ్బు కట్టేసి టికెట్లు తెచ్చుకున్నాం.

ఇంటికెళ్ళేసరికి మా సతీరత్నా లిద్దరూ చాలా ఆదుర్దాగా ఎదురు చూస్తు న్నారు.



"ఇలా చెప్పా చెయ్యకుండా అంత పేపుండి పోతే మా కివతల ఆదుర్దాగా ఉండదూ?" అన్నారు.

"అంచే మేము రావడం కొంచెం ఆలస్యమయితే. మా కోసం ఆదుర్దాపడే ప్రాణులున్నాయంటారు!" అన్నాడు సారధి నవ్వుతూ.

"ఆ! మా శ్రాద్ధం! మీ కోసం కాదు ఆదుర్దా! జేబులో అంత డబ్బు పెట్టుకు పోయారు. జాగ్రత్తగా ఉందో లేదోనని" అన్నారు వాళ్లు.

ఆ మాటలకు మా ఇద్దరకూ చాలా కోపమొచ్చింది గానీ మామూలుగానే ఊరుకొని సహించాము. అసలు సంగతి తరువాత "అష్టమినాడు ప్రయాణమా?" అంటూ ఇంతెత్తున లేచారు. సర్ది చెప్పే సరికి తల ప్రాణం కాళ్ళకొచ్చేసింది.

"ఆ మాట కొస్తే ఓ దుర్ముహూర్తం లోనే ఈ ఉద్యోగం తాలూకూ ఇంటర్వ్యూ అయింది. మరి నాకీ ఉద్యోగం దొరక లేదూ?" అన్నాడు వాడు.

"ఆ లెక్క కొస్తే ఓ వెధవ ముహూర్తంలో మనకు పెళ్ళి చూపులయినయి. మరి దాన్తాలూకూ చెడు తగిలే కదా నాకు మీతో పెళ్ళయిందీ?" అందావిడ

"హాయిగా ఆ ఫుట్‌బాల్ గంగాధరాన్నే చేసుకోవాల్సింది. ప్రాక్టీస్‌కోసం

రోజూ విన్నే తంతూదేవాడు!" అన్నాడు సారధి కోపంగా.

ఆవిడకు పుట్ బాల్ ఆటగాళ్ళంటే ఇష్టం. అంచేత సారధికి వాళ్ళంటే మంట.

ఝామ్మంటూ ప్రయాణ సన్నాహాలు ప్రారంభించేశాం. అష్టమి రానే వచ్చింది. ప్రొద్దున్నే లేచి ముందు బెడ్డింగులు సిద్ధం చేయాలనుకొన్నాం. మా యింట్లో బెడ్డింగ్ని బెల్టుల్లోపల బంధించడానికి చాలా అవస్థలు, బలం ఉపయోగించాల్సివచ్చింది. చివరకు అదో ఏనుగులా తయారయింది. వాడి బెడ్డింగ్ వాళ్ళింట్లో అటక మీద ఉంది వాన్నిబయటకు తీసుకెళ్ళి దుమ్మంతా దులిపేసరికి రెండు గంటలు పట్టింది. దాన్తాలూకూ దుమ్మూ ఆ వీధంతాపొగలా వ్యాపించేసింది. చుట్టుప్రక్కల ఇళ్ళవాళ్లు వాని ఘాటుకు చాలా సేపటివరకూ దగ్గటం వినిపిస్తూనే ఉంది. దాన్నిండా బట్టలు, దుప్పట్లు సర్ది తీరాకట్టబోయేసరికి బెల్టులు కనిపించలేదు ఇల్లంతా గాలించేసినా లాభం లేకపోయింది.

"మన చిన్నిగాడు ఆ మధ్యనోసారి వాటితో ఆడుకొన్నాడు!" అంది వాళ్ళా విడ.

"నా కనుమానంగానే వుంది! ఇదా రాస్కెల్‌గాడి పని అని...." అంటూ పళ్లు బిగపట్టి వాడికోసం వెతికాడు. నేనూ గదిలో వెతికాను. పట్టి మంచం క్రింద కూచుని కనిపించాడు.

"ఏం చేస్తున్నావురా ఇక్కడ?" అడిగాను.

"ష్! అరవకు బాబాయ్! నాన్న నాకోసం వెతుకుతున్నాడు! వెళ్ళిపో!" అన్నాడు చివరకు ఆ బెడ్డింగ్ కొబ్బరి తాడుతో కట్టాల్సి వచ్చింది. రెండు సూట్ కేసులూ కూడా తయారయినయి. టిఫిన్ బాస్కెట్ ఆ రాత్రి తయారు చేయాల్సిన బాధ్యత లేడీస్ సెక్షన్‌కిచ్చాం! తాతయ్య రేకుపెట్టె క్రొత్త అయిటం. అదొక్కటే యాభై కిలోల బరువుకి తగ్గలేదు తెల్లారుజామున మూడింటికి బండి.

"ప్రొద్దున్నే మెలకువ వస్తుందో లేదో" అన్నాడు సారధి.

"పోనీ స్టేషన్‌కి వెళ్ళి అక్కడే పడుకుంచేసరి!" అంది సారధి భార్య.

"అప్పుడుగాని సామాను పోగొట్టుకొనే భాగ్యం కలుగదు!"

"అలారం పెట్టుకొందాం." అన్నాను. అందరికీ ఆ అయిడియా నచ్చింది.

"ఓ వేళ అది మోగకపోతే?" అంది మా ఆవిడ అది వరకు అది చాలాసార్లు మకష్మల్లన్యాయం చేసిన రోజుల్ని గుర్తుకి తెస్తూ.

"అదీ ఆలోచించాల్సిందే" అంటూ ఆలోచనలో పడ్డాడు సారధి.

"పిచ్చివెధవల్లారా! నాకు రెండింటి నుంచీ మెలకువగానే ఉంటుంది. నేను లేపుతాలే పడుకోండి!" అన్నాడు తాతయ్య

ఎందుకయినా మంచిదని అలారం కూడా పెట్టుకొని, పెందలాడే ఏడున్నరకి పడకలమీద చేరాం.

"పెందలాడే పడుకొంటే, చాలా తెలిగ్గా మెలకువ వచ్చేస్తుంది!" అన్నాడు సారధి. మేము పి యు సి చదివేప్పుడు ఓ తమాషా జరిగింది.

మా క్లాస్ వాళ్ళందరం కలిసి నాగార్జున సాగర్ ఎక్స్‌కర్షన్ వెళ్ళాలనుకొన్నాం. ప్రొద్దున్నే అయిదుగంటలకల్లా కాలేజి నుంచి బస్ బయల్దేరేట్లు ఏర్పాట్లు జరిగినయి. అంటే నాలుగున్నరకల్లా కాలేజీకి అందరూ చేరుకోవాలన్నమాట. మేము అంతకు ముందెప్పుడూ ఆ టైముకి లేచి ఎరగము. అందుకని మా గది యజమాని వెంకట్రామయ్య గారికి సంగతి చెప్పి నాలుగ్గంటలకు లేపమని బ్రతిమాలి వచ్చాం చాము ఉదయం మాకు మెలకువ వచ్చే సరికి రూములోనే ఉన్నాం. టైము తొమ్మిదయిపోయింది కోపంగావెళ్ళి వెంకట్రామయ్య గారి తలుపుకొట్టాం. మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడాయన.

"వెళ్ళలేదేం ఇవాళ ప్రోగ్రాం కేన్సిలయిందా?" అన్నాడు.

"బాగుందండోయ్! మీకే మెలకువ రానప్పుడు మమ్మల్ని లేపుతానని ఎందుకు చెప్పారు?" అనడిగాడు సారధి కోపంగా.

ఆయన ఘొల్లున నవ్వాడు.

(సశేషం)

దిబెస్ట్

● "నిజం చెప్పండి డాక్టర్‌గారూ! నేను కోలుకోవడానికి ఏమైనా అవకాశం ఉందా?" దీర్ఘంగా అన్నాడు పేషంటు.

"మీరేం కంగారు పడకండి. ఈ జబ్బు వచ్చిన వాళ్ళు 10మందికి 9 మంది చనిపోతారని వైద్య శాస్త్రంలో ఉంది. ఇప్పటికి నా దగ్గర యీ జబ్బు వాళ్లు 9మంది చనిపోయారు, నువ్వు పదోవాడివి. కనుక నువ్వు తప్పక బ్రతుకుతావు. కంగారు పడకు" ధైర్యం చెప్పాడు తల పండిన డాక్టర్.

—రంకిరెడ్డిరాము, కాకినాడ-3.

పనికిరాని పరిజ్ఞానం

* క్రీ. శ. 1177సం॥లో కిటికీలకు గ్లాసువేయు పద్ధతి కనిపెట్టబడింది.

* 1200 సం॥లో వీణను ఇంగ్లాండులో చేసిరి.

* నవంబర్ 1453వ సం॥రంలో బ్రిటిష్ మ్యూజియం తెరువబడింది.

* 1457 సం॥లో ప్రథమ వార్తాపత్రిక ముద్రింపబడినది.

* 1522 సం॥ గులాబీ పువ్వు ఇంగ్లాండులో నాటబడినది.

* 1664 సం॥ ప్లేగు వ్యాధి ప్రప్రథమముగా వచ్చినది.

* 1777లో ఇనుప బ్రిడ్జి నూతనముగా నిర్మించిరి.

* 1876 సం॥ జూన్‌లో చైనాలో రైలు ప్రవేశపెట్టిరి.


* 1882లో ఎలక్ట్రిక్ ట్రాముకారు కనిపెట్టబడినది.

* 1907లో ఇండియాలో తొలిసారి సినిమాహాలు కలకత్తాలో కట్టించిరి.

సేకరణ: ఆదూరి పేర్రాజు
విశాఖ

సంస్కారం

దార్ల తిరుపతిరావు



'ఆప్ హీ కేగీత్'లో లత కంఠం విన్పించనీయకుండా కిశోర్ గోలెత్తిం చేస్తున్నాడు. దాంతోపాటు నా స్వరం కూడా కలిసి పాడ్తూ కిటికీ దగ్గిర కొచ్చాను. ప్రకృతి పరిశీలననేది నాకు చాలా ఇష్టం కాని 'ఆ యిష్టానికి' మా ఆవిడకీ అసలు పడదు. ప్రకృతి పరిశీలనలోపడి క్రింద ఏమైనా 'స్నాన

దృశ్యాల్నే' మైనా చూస్తానేమో నని మా ఆవిడ భయం–చుట్టూ చూసాను క్రిందకి, మా ఆవిడ కన్పించలేదు. కిటికీకి మరీ దగ్గిర కొచ్చాను. చుట్టూ మరోసారి పరకాయించి చూసాను. 'స్నాన దృశ్యాల్లాంటి' వేమీ లేవు. పర్వా లేదను కున్నాను.

అది మేడమీద గదేమో సగం వీధికి పైగా కన్పిస్తూంది. మిగతా దృశ్యం కూడా కన్పించును కాని అక్కణ్నించా వీధివంపు తిరిగింది. మళ్ళీ ప్రకృతి రసాస్వాదనలో పడ్డాను ఓసారి నేనిలా చూస్తుండగానే పరవశించి పోయేసరికి ఎప్పుడొచ్చిందో మా ఆవిడ గభాల్ని తలుపులు మూసింది. చప్పుడుకి 'ఏమిటని' చూసాను. ఆవిడ రూపం చూసేసరికి నాకు భయమేసింది "బుద్ధుండక్కర్లా. బయ టెవరైనా చూస్తే ఏమనుకుంటారు? అసలు ఆవిడ చూస్తే ఏమవుతుంది?" అని నానా దులుపులు దులిపేస్తుంది నాకేమీ అర్థం కావడంలేదు. ఏమిటో చూద్దామని మళ్ళీ కిటికీ దగ్గిర కెళ్ళబోయాను. గభాల్ని వెనక్కిలాగింది "అబ్బా. రత్నం స్నానం చేస్తుందండీ" అంది తలకాయ పట్టుకుంటూ. అప్పటిగ్గాని నేను చేసిన తప్పు నాకిర్థం కాలేదు. అప్పట్నుంచీ అది ప్రొద్దున్నే నన్ను లేవనీయదు. లేస్తేగబాల్ని కిటికీలు మూసేసి క్రిందికి దింపేస్తుంది నన్ను జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాను.

రేజర్ సెట్లో అన్ని పరికారాలూ తీసి సబ్బు మొహానికి పెట్టూ వీధిలోకి చూస్తున్నాను. దృశ్యం ఎప్పుడూ ఉన్నదైనా నాకు విసుగనిపించదు. నాకు అలవాటు ముందుగా నాగరాజు దంపతుల్ని, రాజారావు దంపతుల్ని చూడ్డం. క్రొత్త సంసారాలే. రెండూను....రోజూ చూస్తూనే ఉంటాను. హడావిడిగా కన్పిస్తూంటారు వాళ్ళు. రోజూ విచిత్రంగా చూస్తుంటాను.

అప్పుడే నాగరాజు లేచినట్టున్నాడు రిక్షా తీసాడు తుడవటానికి. వాడు రిక్షా తొక్కుతుంటాడు. నూకాలు పరుకులు పట్టుకొచ్చినట్టుంచి చిల్లర కొట్లోంచి. గబగబా వంటింట్లో పెట్టివచ్చి కొంగుతో తెచ్చిన బియ్యం నేల్ని వంపేసి ఏరుతుంది. అది దూది మిల్లులో పని జేస్తుంది. ఎందుకోదాన్ని చూసినపుడల్లా 'మూర్తీభవించిన అంధ్రత్వం' గుర్తు కొస్తుంటుంది. ముక్కుకి వొకవైపు నత్తు ఒకవైపు ముక్కుపుడక, రెండూ ఇత్తడివే. మొహానికి అమ్మవారిలా యింత బొట్టు. చాలా భయంకరంగా ఉంటుంది. కాళ్ళకి మెట్టెలు, కడియాలు రెండూ సంతలో కొన్నట్టివే అయినా అది 'చక్కగా' అలంకరించుకొన్నట్టనిపిస్తుంది .... నాగరాజు బండి తుడుస్తున్నాడు. వాడికి పిక్కరు కట్ బనీను తప్ప వంటి మీద

మరో గుడ్డ నే నెప్పుడూ చూసెరగను.... వాడిది కండలు తిరిగిన శరీరం....తిండి కూడా అలానే తింటాడేమో....సరైన జంటనిపిస్తుంటుంది....ప్రక్క గుడిసెల్లో కూడా అలాంటివాళ్ళే అయినా ఈజంటను చూస్తే చాలా హుషారు ఉంటుంది నాకు. యిటు వైపు రాజారావు దంపతులు.... వాళ్ళకి, వీళ్ళకీ గోడ అడ్డు. రాజారావుని చూస్తే నవ్వొస్తూంటుంది....ఎండి పోయిన గుండెలు....చూడ్డానికి బావుంటాయని, చాతీమీద మూడు జతల ఎముకలు ముందుకు తోసుకొచ్చి. కడుపు కొండ బూరెల్లాంటి బుగ్గలు. ఒంటికొక్కాస్తో. కూస్తో బంగారం. ఆవిడ్ని నేత చీరలలో తప్ప చూళ్ళేదు....మా ఆవిడ చెప్పడ మేమిటంటే "అతనికేం లేక పోతే మామగారే చదివించి, పిల్లను అంటే లక్ష్మిని కట్టబెట్టారనీ, కట్నం లేకుండా చేసుకున్నాడని. అస్తమానం రాజారావు 'లేమి'ని చెప్పుతుంటుందనీ" సూక్ష్మంగా తెల్సిన విషయాలివి....అంటే వాళ్ళకి బాగా డబ్బుందని అర్థమవుతుంది.... 'మరెలా భరిస్తున్నాడో రాజారావీమెను' అనుకున్నాను.

సంస్కారం చదువులో అంతస్థులో వుండదు. నిస్స్వార్థపూరిత మైన మనసులో వుంటుంది!

బొరియలా ఉంటుంది. కడుపు లోతు, అతని కళ్లు చూస్తే తెల్సిపోతుంది. కళ్లు కూడా లోతే. పోతే మొహం మాత్రం పర్వాలేదనిపిస్తుంటుంది. ఆర్భకుడు.... యిలాంటివాడు బి ఏ ఎలా పాసయ్యాడో, అంత ఆఫీసులో ఎలా పనిచేస్తున్నాడో నాకంతుపట్టని విషయం. అసలు విషయం 'లక్ష్మిని' ఎలా భరిస్తున్నాడో అనేది. ఇహ లక్ష్మి రాజారావుని చూస్తే నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. రాజారావుకి పూర్తి వ్యతిరేకి. కాస్త స్థూల కాయురాలు....

సబ్బుబాగా నురుగొచ్చింది. రేజర్లో బ్లేడుంచాను

"కాఫీ అక్కడ పెట్టాను. చల్లారి పోయిందని త్వరగా గొడవ పెడ్తే చెప్ప పెట్టేది లేదు" హెచ్చరించింది మా ఆవిడ. త్రుళ్ళిపడ్డాను. గబాల్ని కాఫీ తీసి నురుగు గ్లాసు కంటుకోకుండా చప్పరిస్తున్నాను క్రిందనించి మాటలు వినిపిస్తున్నాయి. చూశాను.

"నా యాలా కూడెదకావా ఎట్టవే" అంటున్నాడు నాగరాజు. వాడెప్పుడూ

'నాయల' మాట తోడు తెచ్చు కుంటా దెప్పుడూ....వాడు నెల్లూరు పైడువాడు నూకాల్దీవూరే. నాగరాజుకు తల్లెవరో తండ్రెవరో తెలీదు. ఈ వూరొచ్చేసిన క్రొత్తలో రిక్షా అదీ సంపాదించుకున్న తర్వాత నూకాలు కులంవాళ్లు. దాన్ని వీడికిచ్చి మనువు చేసారు. అప్పట్నించీ వీడికి ఈ వూరే పుట్టిల్లు.

''పెదతాత్రా....కూడు మెక్కేసి త్రాగ్వాత మందు. ఆ ఎనక రాజమ్మ దగ్గిర కెల్టం. నా కెరిక నేదను కుంటన్నావేట్రా. ఈ మద్దిన రిక్షాతొక్కిన డబ్బులు సర్గ్గా తెత్తన్నావేట్రా నీ మందుకీ. ముండకే సరిపోటల్లేదు....అవున్నే నీ బుద్దెక్కడి పోద్ది'' అంది ముత్యాలు.

'ఒహో రంగం బావుందే' అను కుంటూ వంగాను....ముందుకి.

''నాయాల. ఏటే పొద్దుటే పెట్టే సేవు ''

''అవును పొద్దుటేటి. మద్దినాలేటినాకు. ఎప్పుడు పడితే అప్పుడేగదూ. దానగ్గిర కెల్టం....అనంజికేనేదు బుద్ది. ఎదవ నీ లాంటి వోడిదగ్గిర బల్డబ్బులొడుక్కు నే పడుకూ అంతే. దాన్ని నూసుకోని మురిసి పోతున్నావు. నాకు తెల్దేటి'' విచిత్రంగా మాటాడ తుందది.

''నోరు ముయ్యేసే ఏడిసేవుగాని. నా యాల్ది. తాన్నాల్నించి మాపీతానుగుందే నీ మీదొట్టు.''

''నాకాడ పరాశికాలాడ మాకు.''


''మాపీనే ఎందుకు మాత్తానేటి. నా యాల్ది నీ బాబు సొమ్మేటన్నా నా కాడ దాపిబెట్టేవేటి....నన్ను గదమాయింత న్నావు. మల్లా అన్నావంటే మక్కలిరగ తన్నేత్తా. నోరుముయి కూడెట్టు.''

''నాయుడుగాడ్ని సూడ్రా. నీ కన్నా అడ్నయం సారాతాగుతాడా. ముక్కాటాడ తాడా. నీకులాగ పూటకో రాజమ్మకెల్తాడా నువ్వు వున్నావు ఎద్దులా తాగేత్తావు కడుగు తాగినట్టు. యింకా దానగ్గిరేగదూ ఎప్పుడూను....ఎదవ'' బూతులు తిడు తుంది.

''నోర్మూయ్యే నాయాలా....యేటి కూత్తన్నావు మా బావు కూతలు నాయుడు గాది దగ్గిరికి పోయే....యెదవా....మీబాబు నాక్కట్టబెట్టేడు గాన్నే పోతే అడితో పోయిదానివి గందే. అం. నాకేటి మగ మారాజుని. నాలుగుసార్లు తాగుతాను. నలుగురు ముండ్లకెల్తాను.''

'ఎల్తావురా. ఎందుకెల్లవూ. ఆటలు సాగుతున్నాయి నీకు. మారుమనవాడ్నే ఆడతాను. నువ్వెల్తే తప్పొచ్చంప గాదు గాని నానెల్తే తప్పేట్రా....అద్నే అట్టు కుంటాను.''

''ఏటే కూత్తన్నావు. పొద్దుట్నించి కూత్తన్నావు సూత్తన్నాను కూడెట్ట కుండా నాయాల'' అని లేచాడు. రంగం సరైన పద్ధతిలో ఉంది....అనుకున్నాను.



యింక చూడ్లేక త్రాగిన గ్లాసు ప్రక్కన పెట్టాను. అద్దంలో మొహం చూచి, మళ్ళీ నురుగు పెట్టాను గడ్డానికి. ధభీ దభీ మని చప్పుళ్లు....గోల. గోలగా విన్పిస్తూ న్నాయి. ''ఆడదాన్ని గొడ్డుని బాదినట్టు బాదే సంస్కారానికి వీళ్లెప్పుడూ సిగ్గు పడరేమో" అనుకొని ప్రక్కకు తిరిగాను. ''ఇదో సీన్, '

రాజారావు మొండి గోడని ఎక్కి చూస్తున్నాడు. ప్రక్కనే లక్ష్మి.

''ఆఁ. దిగుదురూ. చూసేరు కాని'' అంది లక్ష్మి దిగుతూ.

''ఏం. అలా చూడు దాన్నెలా బాదే స్తున్నాడో.''

''అంతే తెలుసు....అంతకన్నా ఎక్కువ చేస్తాడేమిటి వెధవ. ఎవరికైనా చేసేది చెప్తే కోపంగానే ఉంటుంది'' అంది గాఢంగా.

''ఏం, ఏం చెయ్యాలి అలా అంటే.''

''ఏం చెయ్యాలేమిటా, ఏం, వాడెత్తే తప్పులేదుగాని, అది మారుమను వాత్తే వీడికి తప్పొచ్చిందేం పాపం....మీరు మాత్రం తక్కువతిన్నారేమిటీ వాడి జాతేగా.''

''ఏం....వేషాలేస్తున్నా వేమిటీ''

"మీరు మాత్రం....ఆ(జానకిని వెంటేసుకు తిరగడం లేదూ. నాకు తెలీదను కున్నారా.''

'యిదేలా వుంది సంస్కారం పేరుతో మోసగించబడ్డం' అనుకున్నాను.

"ఏడిశావ్ లే .... నోర్మూయ్ ...నీళ్ళు పడెయ్యి వస్తున్నాను'' అన్నాడు. మాటలు విన్పిస్తున్నాయి సన్నగా ..గడ్డం. బరుకుతూన్నా ....నెమ్మదిగా మాటలు విసుర్లు నిప్పు రాజుతూందేమో

"నా ఖర్మ యిలా తగులడింది గాని మా బావని చేసుకుంటే యిలా తగులడు తుందా నా బ్రతుకు చింకిచేతులా ఉంది.... ఏమిటో ముద్దా ముచ్చటా. అత్తా, ఆడ బడుచా, ఎశో నారాయణా, యింటంత చాకిరీ చేసుకొని చావాలి. ఆ కూలిముండ నయం నాకన్నా ..'' లక్ష్మి అంటుంది

'మా ఆవిడ ఈవిడి గురించన్నది నిజమేమో అన్పించింది!'

ఆడవాళ్ళకి పెట్టని ఆభరణమంటూ ఏదన్నా ఉంటే అది ఏడుపే దాంతోనే సాధిస్తారేమైనా... గబగబా బరుకుతూ న్నాను....గడ్డం....

"ఏమిటేమైంది నీకు, ప్రొద్దుటే.... దాన్నెందుకలా తిడుతూన్నావు. అదేం చేసింది'' లక్ష్మి పనిపిల్లని సాధిస్తూంది.... కోపం దానిమీద చూపిస్తూంది.

"అదేం చేసింది, ఎటొచ్చీ నా బ్రతుకే యిలా తగులడింది. పోనీ చన్పోయినన్నా కాదు, పీడా విరగడై పోయేది. అదొచ్చి అన్నీ చేసిపెట్టును మీకు......నే నేం ఉన్నాను... దాని ముందు. ఆ అందగత్తె ముందు'' జాడించేస్తుంది.

"నోర్మూయ్ వెధవేడుపూ నువ్వూను' మొదట ఆ అమ్మాయిని చేసుకుందామన్న మాట నిజమే, తిరిగిన మాట వాస్తవమే. మరే దురుద్దేశం లేదు''

ఈ ఆకారానికి తోడు లవ్వరా అన్పించి నవ్వొచ్చింది

"నాకు తెలీదనుకున్నారేమో .... నాకన్నీ తెలుస్తున్నాయి. మీరు మొన్న దానింటికెళ్ళడం అదీను. కాంతమ్మత్త చెప్ప లేదేమో అనుకున్నారు....నాకూ కాస్త లోకజ్ఞానముంది. నేనూ చదువుకున్న దాన్నే ' అంది రాగంతీస్తూ 'సంస్కారం బయట పెట్టుకోడంలా వుంది' అన్పించింది.

"నీకు తెలీదే నేనా పేళ..ఆ అమ్మాయి మా ఆఫీసులోనే కదూ పన్జేస్తుంది....ఆ అమ్మాయి పుట్టిన్రోజంటేను వెళ్ళాను. అంతే కాంతమ్మ చెంటంచేసిందన్నమాట యిక్కడకొచ్చి. ఎందుకేడుస్తావు. ఏమైపోయిందిప్పుడు. ఎవరైనా చూస్తే నవ్వ గలరు' అన్నాడు

"ఏం, ఆవిడ్నడుగుతారా వెళ్ళి.... చాలు బాబూ చాలు, యిలా ఉండనివ్వండి యీ సంసారాన్ని నడివీధిలో పారెయ్య

కండి'' అంది ఏడుస్తూ. రంజుగా తయారైంది పరిస్థితి....'గెడ్డానికి ఫినిషింగ్' టచప్ యిస్తూ యిటు వైపుకు తిరిగి చూశాను....గబాల్ని బెల్లోసారి వాయించి, రిక్షా ఎక్కాడు నాగరాజు....నా కళ్ళు నూకాలు కోసం వెదికాయి ..ప్రక్కనున్న కొయ్యకానుకొని 'కారం, నూనె' ఆయింట్‌మెంట్‌లా పెడ్తూంది దెబ్బలు తగిల్న చోట....రయ్యిన త్రొక్కుతూ వెళ్ళిపోయాడు వాడు....'ప్చ్ పాపం' అనుకున్నాను నూకాల్ని చూసి ...ఎందుకో జాలి కలిగింది దాన్నా స్థితిలో చూసేసరికి. మళ్ళీ యిట్నుంచి రాగం తారాస్థాయినందుకుంది....ఏమిటో పీలగా, బక్కగా ఉన్నా. రాజారాం గొంతు మాత్రం కంచులా మ్రోగుతోంది....

''పో....పోతేపో. నీ యిష్టంవొచ్చిన దగ్గిరకి పో. నన్నేం ఉద్ధరిస్తావా. నేనేం ఎరగనంటే నమ్మవు....నీకు నమ్మకం కల్గించడం నా తరంకాదు....నువ్వేమైనా నేను చెప్పేది వినే పరిస్థితిలో ఉన్నావా? నీ యిష్టంవొచ్చినట్టు మాట్లాడుతూన్నావు'' అన్నాడు రాజారావు.

''ఆవును అంటాను. పది సార్లంటాను. అలాంటి వెధవల్తో కలికితే యింకా అంటాను. యిక్కడో క్షణముండను. నేను పుట్టింటికి పోతాను ఈ వెధవ గొడవేదో తేలింతర్వాతే వస్తాను—కావాలంటే లేకపోతే దాన్నే పట్టుకొని ఎన్నాళ్ళిలా గ్రంధం సాగిస్తారో అదీ చూస్తాను' అక్కండ్నుంచి లేచిపోయింది....

'వీళ్ళకి సంసారం మీద ఎంతనుంచి అభిప్రాయముందో అర్థమవ్వతు ది''వాలా వరకూ పోయిందే వీళ్ళ వరస ...చిలికి, చిలికి గాలివానైందనుకున్నాను ...హడావిడిలో గడ్డం గీసుకుంది....

''ఎన్నాళ్ళైనా అలాగే చేసుకుంటావు గాని, ఆఫీసు టైమయింది'' అన్న మా ఆవిడ మాటల్తో బయటకొచ్చాను.

''యిద్దరికీ ఒకటే సమస్య'' అనుకున్నాను....ఆఫీసు టైమయిపోయింది. గబగబా తెమిలి బయటకొచ్చేశాను.

* * *

సాయంత్రమైంది. గబగబా యింటి కొచ్చేశాను. ఈ సమస్య ఎంతవరకూ వచ్చిందన్నది నాకు తెల్సేవరకూ నిద్ర పట్టేలా లేదు. అయినా మర్చిపోవాలని ప్రయత్నించాను ''ఏదైనా సమస్య ఏర్పడేవరకే అది పరిష్కారం అయ్యేది ఎప్పుడో'' అనుకున్నాను.

షార్ట్ ఏజ్

● భార్య దోమ: ఏమిటండీ! ఒక్కరోజుకే అలా మరీ బొత్తిగా చిక్కిపోయారు?

భర్త దోమ: ఆ వెధవ పేషెంటుకి బ్లడ్‌షార్టేజని తెలియలేదోయ్.

—యు. పుష్ప. హైదరాబాదు-20.

బట్టలు విప్పి స్టాండుమీదుంచాను. మా శ్రీమతి కాఫీ పట్టుకొచ్చింది. కాఫీ త్రాగుతూ ఆమె కాఫీతోపాటు వేడిగా పట్టుకొచ్చే సంగతులు వినడం నాకు ప్రతీ రోజూ అలవాటు. యివ్వాళ దానిమొహంలో ఏదో చెప్పాలన్న ఆత్రుత కన్పిస్తుంది.... మొదలుపెట్టనే గాని చెప్పదు గాబట్టి "ఏంటోయ్ 'యివ్వాళేం జరిగిందో తెల్సా' అన్న శీర్షికలో ఏం విశేషాల్లేవా?" అన్నాను వ్యంగ్యంగా.

"ఊ.... చాలు సంబరం... సరేగాని.. యివ్వాళేం జరిగిందంటే" అంది.

"చెప్పు" అన్నానుత్సాహంగా.

"పక్కింటివాళ్ళేరూ" అంది.

"చాలా పక్కిళ్ళున్నాయి ...ఎవరూ?" అన్నాను.

"అదేలెండి రాజారావుగారు."

"ఏమైంది?" అ టాపిక్కొవల్సినట్టు

"వాళ్ళావిడ్ని పుట్టింటికి పంపేశాడు."

"ఎందుకు?"

"అవిడికి తనిమీద బాగా అనుమానం వుండీ.... అయినా యితనూ అలాంటివాదే లేస్తురూ.... ఆ పిల్ల చాలాసార్లు ఏడుస్తూ మొత్తుకుంటూ అసలు విషయం చెప్పింది. ఎవర్తో జానకట ఆఫీసులో పన్జేస్తుందట ఎవరూరుకుంటారు .. కొన్నాళ్ళు పోతే తెల్సొస్తుంది" అంది

'ఎంత కథ అల్లారే' అనుకున్నాను. . అనుమానం శాన్నాళ్ళించేదిపిస్తూందన్న మాట ఆవిడ్ని.

అయినా నాకు మాత్రం మనసులో బాధగా ఉంది. చిన్న విషయాన్ని పెద్దగా చేసుకోవడం .. పెద్ద రాద్ధాంతం చేసుకోవడం.... మళ్ళీ ఎప్పుడొస్తుందో యీవిడ. ఈ సమస్యకి పరిష్కారమెలా అవుతుందో—అంతవరకూ రాజారావు కష్టాలు తల్చుకు బాధపడ్తూ ...మళ్ళీ కిటికీ దగ్గిర కొచ్చాను. 'సెంటిమెంటల్ ఫూల్'లా.... క్రిందకోసారి చూద్దామనిపించింది....మళ్ళీ యిలాంటి గొడవలు చూస్తానేమో అనుకుంటూ చూశాను క్రింద చూసిన దృశ్యం ఆశ్చర్యమనిపించింది.

"యేంటాలీశం. .శీర సింగారించేవేటి, నాయాల్ది, మా బాగున్నావే, సరిగానీ, యే పనిమాకెల్దావే, యెక్కు బండి" అంటూ రిక్షా యెక్కిస్తూ రిక్షాలో యెక్కుతూన్న సూకాల్ని గబాల్ని ముద్దెట్టుకున్నాడు అది రిక్షాలో కూర్చుని సిగ్గుపడుతూంటే ముందుకు తొక్కుతున్నాడు రిక్షాని నాగరాజు

జంట చిలకల్లా ముచ్చటేసింది చూడ్డానికి.... చాలా ఆనందంగా ఉంది. ఎంత చక్కగా కల్సిపోయారిద్దరూ.... అనుకొని ప్రక్కకి తిరిగాను—

రాజారావు ?

కుతకుతా ఉడుకుతూన్న అన్నం గిన్నె దింపబోయి చెయ్యి కాలి ఎత్తేశాడు. అన్నం ఒరిగిపోయింది క్రింద. చూస్తున్నాడు

నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

ఉన్నత సంస్కార భావాలు గలవారే యిద్దరూ అయితే యెందుకలా జరిగిందనిపించింది.

వీధి చివరకు చూశాను....సూకాలు తల్లో పువ్వులు నవ్వుతూన్నాయి....రిక్షా తొక్కుతూ నాగరాజు నవ్వుతున్నాడు.... ఏదో మాటాడుతూ సూకాలు నవ్వుతూంది.

గబాల్ని లోపలికొచ్చేశాను.

తూనికలూ కొలతలూ

డాక్టర్. మహీధర నళినీ మోహన్

కొలతలకూ, తూనికలకూ ప్రమాణాలు ఏ విధంగా నిర్వచించి స్థిర పరిచి, శ్రద్ధ వహించారు తెలుసుకున్నాం.

ఒక సామాన్య మానవుడి పాదపు పొడవును ఆధారంగా చేసుకుని, కొలతల ప్రమాణాలను సృష్టించడం ఏమి సమంజసం? ఇంతకన్నా ఉదాత్త మైన వస్తువేదీ వీరికి దొరకలేదా? నిజమే మరి మార్గాంతరం ఏముంది? ఏదో ఒక వస్తువును ఆధారంగా తీసుకోక తప్పదు కదా! అయితే ఇలాంటి భూమి ఉంది కదా. భూగోళపు కొలతలు స్థిరమైనవే కదా మరి దానిని కొలిచి దానిని ప్రమాణాలకు ఆధారంగా తీసుకుంటే ఎంతో కన్నా బాగుంటుంది కదూ? ఉదాహరణకి, భూగోళపు చుట్టు కొలతలో ఏ కోటవ వంతును, లేదా వందా కోట్లవ వంతును కొలమానంగా తీసుకోవచ్చును కదా? అల్లాగే ఈ పౌను ఏమిటి? ఒక గాజు పెట్టిలో పెట్టిన ప్లాటినమ్ సిలిండరు బరువు తూనికలకు ప్రమాణమని అనడమను అంతే కాదో ఎందుకు చేశారు? అంతకన్నా పెద్దదైనా, చిన్నది గాను ఎందుకు తయారు చేయలేదూ? ఏ ప్రమాదం చేతనైనా ఆ సిలిండరు ప్రమాణం నష్టమైపోతే మరి దాని గతి ఏమిటి? ఒక వస్తువు ప్రామాణికంగా నిర్ణయించడానికి సైద్ధాంతికమైన ఆధారాలు ఏమున్నాయి? ఏమీ ఆధారాలు లేక నిజమే కొలతల ప్రమాణముద్దను తీసుకుని గ్రాము బరువు పౌను సుమా అని నిర్ణయించడం కన్నా ఉత్తమమైన మార్గం మరేదీ లేదా? ఉంది. అదే మెట్రిక్ పద్ధతి.

1670లో లియోన్స్ చర్చిల్ వికార్‌గా పనిచేస్తున్న ఒక స్వామి దశాంశ పద్ధతిని ఉపయోగించి భూగోళపు కొలతల ఆధారంతో కొత్త మానములు సృష్టిస్తే బాగుంటుందని సూచించాడు. ఈ

సూచన ఫ్రెంచి వారికి నచ్చింది ఆ నాటికి ఫ్రాన్సులో 200 వేరువేరు రకాల కొలతలు అమలులో ఉండేవి. వాటి నన్నింటినీ తొలగించి, సార్వజనీన మైన ప్రమాణాలు ఏర్పరచు కోవాలని ఫ్రెంచి శాస్త్రవేత్తలు చాలా కృషి చేశారు ఆ కృషి మరో 125 సంవత్సరాలకి (1795లో) ఫలించింది. ఫ్రెంచి విప్లవకారులే ఈ మెట్రిక్ పద్ధతి అమలులోకి రావడానికి కారణం అని కొందరు చెప్తారు. 16వ లూయీ చక్రవర్తి మెట్రిక్ పద్ధతి ప్రవేశ పెట్టాలని నిశ్చయించాడు. ఫ్రెంచి విప్లవకారులు దానికి ఒక స్వరూపాన్ని ఇచ్చి పూర్తిచేశారు


ఏదో క్షుద్రమైన వస్తువు యొక్క పొడవును దూరము కొలవడానికి ప్రమాణంగా తీసుకోకుండా భూమధ్యరేఖ నుండి ఉత్తర ధ్రువానికి గల దూరంలో కోటవ వంతును ప్రమాణంగా తీసుకోవాలని నిశ్చయించారు. భూమధ్యరేఖ నుంచి ఉత్తర ధ్రువం వరకు గల దూరాన్ని పొల్లు పోకుండా కొలవడం సుఖసుఖాల జరిగే పనికాదు. మధ్యలో పర్వతాలు, సరస్సులు, నదులు, లోయలు అరణ్యాలు ... ఎన్నెన్నో అడ్డంకులు ఉన్నాయి. ఇవి అడ్డం వచ్చిన చోట్లలో ఎత్తు పల్లాలను లెక్కలోకి తీసుకోకుండా తొలగించాలంటే క్లిష్టమైన గణిత ప్రక్రియలు అవలంబించాలి. నిజానికి వారు కొలిచినది ఫ్రాన్సులోని ''డన్ కిర్క్'' నుంచి స్పెయిన్‌లోని ''బార్సిలోనా'' వరకూ గల దూరం మాత్రమే. ఇది సుమారు 660 మైళ్ళు ఉంది. దూరం ఖచ్చితంగా తెలిశాక ఈ రెండు బిందువులూ భూకేంద్రం దగ్గర ఏర్పరచే కోణాన్ని సరిగ్గా నిర్ణయించి, ఇన్ని డిగ్రీల కోణం అయితే ఇంత దూరానికి సమానం కనుక 90 డిగ్రీల కోణం ఎంత దూరానికి సమానం అని త్రైరాశికం వేసి గుణించి ఎత్తు పల్లాల వల్ల గలిగే లోపాలు సరిదిద్ది మొత్తానికి భూమధ్య రేఖకూ ఉత్తర ధ్రువానికి గల మధ్యదూరాన్ని తెసుకో గలిగేరు. ఈ పనికి వందల కొద్దీ పనివాళ్ళూ, ఇంజినీర్లూ, శాస్త్రజ్ఞులూ కలిసి ఏడు సుదీర్ఘ సంవత్సరాలు కృషి చేశారు. ఆ దూరంలో కోటియవ వంతుకు 'మీటరు' అని నామకరణం చేశారు. మీటరు అనే కొలత అదిగో ఆ విధంగా ఏర్పడింది. ఆ మీటరులో పదవ వంతును డెసీ మీటరు అనీ, వందవ వంతును సెంటీ మీటరు అనీ వెయ్యవ వంతును మిల్లీ మీటరు అనీ అన్నారు. ఆ మీటరుని పదిరెట్లు డెకా మీటరు అనీ, వందరెట్లు హెక్టో మీటరు అనీ, వెయ్యి రెట్లు కిలో మీటరు అనీ అన్నారు. డెసీ, సెంటీ, మిల్లీ, డెకా హెక్టా, కిలో అనేకవుపసర్గలను లాటిన్ భాషనుంచి తీసుకున్నారు.

మీటరు పొడవు సుమారు 39.37 అంగుళాలకు సమానం అయింది. అంటే

గజం కన్న ఇది 3 37 అంగుళాలు పెద్దది. పెద్దపెద్ద దూరాలను కొలవడానికి ఉపయోగించే కిలోమీటరు సుమారు 5 ఫర్లాంగులకూ సమానం.

మీటరు అంటే ఫలానా అని ఖచ్చితంగా నిర్వచించాక. బరువు తూచడానికి ప్రమాణాలను నిర్వచించడానికి ప్రయత్నం చేశారు పూర్వం ఉపయోగించిన గజానికీ పౌనుకీ సంబంధం ఏమిలేదు.

పొడవును నిర్దేశించిన తరువాత వైశాల్యమునూ, ఘన పరిమాణాన్నీ నిర్దేశించడం చాలా సులభం. ఒకటి వర్గమూ, రెండవ ఘనమూనూ చదరపు మీటరు, ఘనపు మీటరు అని వాటికి పేర్లు పెట్టవచ్చు. పెద్ద పెద్ద భూముల వైశాల్యాన్ని కొలవడానికి 'హెక్టార్'' అనే మాట ఉపయోగిస్తారు. ఇది పదివేల చదరపు మీటర్లకు సమానం (ఇది 2 471



ఏదో తోచినంత దూరాన్ని గజం అన్నారు. తోచినంత లోహపు ముద్దను తీసుకుని పౌను అన్నారు. అల్లా కాకుండా పొడవును కొలిచే మీటరుకు, బరువును తూచే తూనికకూ సంబంధం ఉండాలని నిశ్చయించారు. ఇల్లా చేస్తే పొడవు కొలతలే కాకుండా తూకపు మానములు కూడా భూదేవితో సంబంధం కలిగి ఉంటాయి.

ఎకరాలకు సమానం) ఘన పరిమాణాన్ని కొలవడానికి సాధారణంగా ఘనపు సెంటీ మీటర్లను వాడుతారు. వెయ్యి ఘనపు సెంటి మీటర్లు ఒక లీటరు. పూర్వపు వాడుకలో ఉండిన పైంట్ 568 ఘనపు సెంటీ మీటర్లకు సమానం.

4 డిగ్రీలు సెంటిగ్రేడు ఉష్ణోగ్రత వద్ద ఒక ఘనపు సెంటీ మీటరు స్వచ్ఛమైన జలం శూన్య ప్రదేశంలో ఎంత

బరువు తూగుతుందో దానిని ఒక గ్రాము అన్నారు. దీనికి వెయ్యిరెట్లు బరువును కిలోగ్రాము అని, గ్రాములో వెయ్యవ వంతును మిల్లీగ్రాము అనీ పేర్లు పెట్టేరు. ఒక కిలోగ్రాము బరువుగల ప్లాటినపు సిలిండరును తయారు చేసి బహు భద్రంగా ఉంచారు. దాని నమూనాలే ఇప్పుడు ప్రపంచమంతటా ఉపయోగిస్తున్నారు.

ఈ విధంగా ప్రస్తుతం మనం వాడుకుంటున్న మీటరు, కిలోగ్రాము, లీటరు అనే మూడు ప్రమాణాలకూ భూదేవికీ బహు దగ్గర దక్క సంబంధం ఉంది.

ఈ మెట్రిక్ పద్ధతి ఇంతకు ముందు ఏర్పడ్డ మానములన్నిటికన్నా శాస్త్రీయమైనది కావడం చేత యూరప్‌లోని అన్ని దేశాలూ వెంటనే దీనిని అవలంభించాయి. అప్పుడు ప్రపంచంలో చాలా దేశాలలో ఈ పద్ధతి వాడుకలోకి వచ్చేసింది. ఒక్క (ఇంగ్లండు మాత్రం మనకు పాతచింతకాయ పచ్చడిమీద ఉన్న మోజువల్ల. పాత మానములను వదులుకోలేక పోటినే వాడుతున్నారు నిన్న మొన్నటి దాకా) మన దేశంలో ఇటీవలనే మెట్రిక్ పద్ధతి సర్వత్రా అమలులోకి వచ్చింది. ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబరేటరీలో ఈ ప్రమాణములు గాజుపెట్టెలలో భద్రపరచబడి ఉన్నాయి. వాటినమూనాలతో దేశంలోని కొలతలూ, బరువులూ స్థిరపరచబడ్డాయి.

ఫ్రెంచి విప్లవకారులు మరొక అడుగు ముందుకువేసి. పొడవు. బరువులలోనే కాకుండా సర్వత్రా దశాంశ పద్ధతి వాడుకోవాలని సూచించారు.


1 రోజు—పదిగంటలు.

1 గంట—వంద నిమిషాలు.

1 నిమిషం—వంద సెకనులు.

అని కాలవిభజనలో కూడా దశాంశ పద్ధతి ఉండాలన్నారు. వారానికి ఏడు రోజులు అనేలెక్క బాగులేదు. పదిరోజులు చెయ్యాలన్నారు. అల్లాగే వృత్తాన్ని 360 డిగ్రీలుగా భాగించడమూ, సమకోణానికి 90 డిగ్రీలు ఉండడమూ బాగులేదని. సమకోణం—100 డిగ్రీలు అనీ వృత్తంలో నాలుగు సమకోణములు లేదా 400డిగ్రీలు ఉండాలని సూచించారు కాని ఈ మార్పులకు మాత్రం ఎవ్వరూ అంగీకరించలేదు.

అతి సులభమైనదని ఇప్పుడూ అందరూ అనుకుంటున్న దశాంశ పద్ధతిని అవలంభించకుండా నిన్న మొన్నటి వరకూ అందరూ అరలూ, పావులూ. మూడోవంతులూ పన్నెండో వంతులూ అంటూ చిత్రమైన విభజనలు ఎందుకుచేసుకున్నారూ? పదికి ఇన్ని రెట్లు అవీగానీ పదిలో ఇన్నవవంతు అవిగానీ కొలతలనూ. తూనికలనూ నాణెములనూ, పూర్వులు ఎందుకు విభజించుకోలేదూ? దశాంశపద్ధతి సులభం అని తెలియదా? ఒక మూల అంకెలను దశాంశ పద్ధతిలోనే వ్రాస్తున్నారు కదా?



ఇది విక్రమార్కుడికి భేతాలుడు వేసిన ప్రశ్నలలో ఒకటి పూర్వీకులు దశాంశ పద్ధతిని చేపట్టకపోవడానికి కారణం ఉంది. ఒక గంపెడు ధాన్యం నేలమీద పోసి, కొలత సాధనం ఏదీ ఉపయోగించకుండా ఆ పోగును పది సమభాగాలు చేయగలరేమో ప్రయత్నించండి. ఆ పని అంత సులభం కాదు. అదే పోగును రెండు సమభాగాలుగా విభజించడం సులభమే. రెండు పోగులూ సమంగా ఉన్నదీ లేనిదీ (ఉజ్జాయింపుగా) కంటితో చూచి చెప్పెయ్యవచ్చు ఆ రెండు పోగులనూ మళ్ళీ రెండు రెండు సమభాగాలు సులభంగానే చేయవచ్చు. మళ్ళీ వాటిని ఒక్కొక్కదాన్ని రెండేసి సమభాగాలు చేయవచ్చు. అంటే $\frac{1}{2}$, $\frac{1}{4}$ $\frac{1}{8}$, $\frac{1}{16}$.... భాగాలు సులభంగానే చేయవచ్చుననీ $\frac{1}{5}$, $\frac{1}{10}$, ... లు చేయడం అంత సులభం కాదనీ తెలిసిపోవడం లేదూ? కనుకనే రూపాయిలో అర్ధలు, పావులు, బేడలు, అణాలు, అర్ధణాలు, కానులు, ఏగానులు పుట్టినంత సులభంగా రూపాయికి నూరు పైసలు అన్న భావం కలుగలేదు కుంచంలో సగము (అద్దెడు) నాలుగో వంతు (మానెడు); ఎనిమిదో వంతు (తవ్వెడు): పదహారోవంతు (సోలెడు); 32 వ వంతు (అరసోలెడు): 64 వ వంతు (గిద్దెడు); 128 వ వంతు (అరగిద్దెడు) అని విభజించినంత సులభంగా పదో వంతు వందోవంతు అని విభజించలేకపోయారు. 12 లో 2. 3. 4, 6 అనే నాలుగు అంకెలు నిశ్శేషంగా పోతాయి. కనుక డజను వస్తువుల ఖరీదు ఇంత అని చెప్తే అందులో సగము. మూడో వంతు. నాలుగో వంతు. ఆరోవంతు సులభంగా అర్ధంచేసుకోవచ్చు. కాని 10 లో 2.5 అనే రెండు అంకెలు మాత్రమే నిశ్శేషం అయిపోతాయి కనుక పదిలో మూడోవంతు. నాలుగోవంతు అనే విభజన సామాన్యుల ఊహకు అందదు ఈ రకమైన కారణాలచేత 12 అనే సంఖ్యను మూలాధారంగా చేసుకుని నాణెములు. కొలతలు. తూనికలు ఏర్పాటు చేసుకున్నారు ఇదివరలో. ఇప్పటికీ అరటిపళ్లు డజను ఎల్లాగని అడుగుతారు అరుపళ్లు తీసుకున్నంత తరచుగా ఐదు పళ్ళు తీసుకోరు అలవాటు బలియమైనది అది ఓ పట్టాన మారేది కాదుకదా!

సమర్థుడు

చలపతి ఉద్యోగం పోయిందని తెలిసినప్పుడు వాళ్ళ ఆఫీసులో అంతా బాధపడ్డారు. నిజానికి అతని ఉద్యోగం ఊడిందని కాదు. అతని మీద అభిమానం ఉండి కూడ కాదు. అందుకు కారణం— చలపతి అందరికి అంతో యింతో బాకీ పడటమే. అతనికి యిచ్చిన అప్పులుపోయాయని అందరూ విచారించారు.

నిజమే చలపతి ఎవరి అప్పులు తీర్చలేడు. అతని వెనుక కూడ బెట్టింది ఒక పూచిక పుల్లలేదు. ఉన్న కాస్త ఉద్యోగం పోయింది. అలాంటి వాణ్ని పట్టుకొని— 'నా మాటకి ఏమంటావ్?' అనిఎవరూ కలదీయలేరు. మనిషిలో ఏదో మూల చోటు చేసుకున్న మానవత్వం పెద్దాల్ని పట్టుకొని మాట్లాడ నివ్వదు. 'సానుభూతి' అనే తెరలు అడ్డుగా ఉంచుతుంది.

"వెధవ, నిలపుకోలేకపోయాడు. తాగి తందనాలాడేడు, ఉద్యోగం ఊడింది.... ఇప్పుడు అడుక్కు తింటాడు." అన్నారు, ఉక్రోషం పట్టలేని కొందరు.

మిగిలిన వాళ్లు తిట్టకపోయినా, యేదో రూపంగా వాళ్ళ కసి తీర్చుకున్నారు. అది సహజం. అప్పులిచ్చారు గనుక వాళ్ళకా అధికారముంది అప్పులు తీర్చలేనిస్థితిలో ఉన్నాడు గనుక ఎవరేమన్నా తనలో మిగిలివున్న అభిమానం కొంచెం తూట్లు పడుతున్నా, పల్లెత్తు మాటఅనలేకపోయాడు చలపతి.

మినిస్టరు గారి బావ మరిది బంధువుకి కావలసిన ఉద్యోగం కాకుండా చేశాడని గాని, టెండరు పెట్టి స్వర్గాన్ని తయారు చేసే కాంట్రాక్టరు బిల్లు తిరగ్గొట్టాడనిగాని. ఉన్న తాధికారిని ఎదిరించాడనిగాని చల

శ్రీకాంత్

పతిని ఉద్యోగం నుంచి తొలిగించలేదు. అతని ప్రవర్తనే ముఖ్యకారణంఅని చెప్పవచ్చు. రెండేళ్ళ క్రిందటి చలపతి నడవడికి యిప్పటి ప్రవర్తనకు ఎంతో భేదం వుంది. అతను నైతికంగా దిగజారిపోయాడు.

ఆ రోజుల్లో-చలపతిలా ఆఫీసుకి ఠంచన్‌గా సైకిలెక్కి వచ్చే గుమాస్తా లేడనేఅంతా అనుకునేవారు అతను రూల్సన్నీ తుక్కు-పట్టాడనిభయపడేవారు. ఆఫీసులో అందరూ అతన్ని అభిమానించేవారు. గౌరవించేవారు. అతను పనిలో చాలా ఖచ్చితంగా ఉండేవాడు. అతను రాసిన ఉత్తరాల మీద ఆఫీసరు గుడ్డిగా సంతకాలు పెట్టేవాడు. అతని మీద ఆఫీసరు కెంతో నమ్మకం. అలాంటి చనువును ఆసరా చేసుకొని ఆఫీసర్ని ఎన్నడూ మోసంచేయలేదు. డబ్బుకి కక్కు-ర్తిపడి ఆఫీసుఫైళ్ళను మురికి కాగితాలతో కలుషితం చేయలేదు. అమాయకుల కాగితాలకి అన్యాయం చేయలేదు పై ఆఫీసర్ల అడుగులకు మడుగులొత్తి ప్రమోషన్ యిమ్మని కాని పనులు చేయలేదు.

చలపతి ఎప్పుడూ ఎవరికి యే విషయంలో అన్యాయం చేయలేదు. కానీ 'పైవారు' అతనికి అన్యాయం చేశారు. అతని జీవనజ్యోతిని నిర్లక్ష్యంగా ఆర్పి. అతని కన్నీళ్లు చూసి నవ్వుకున్నారు.

చలపతి భార్య - తన ప్రతిబింబాన్ని యిస్తానని అతన్ని ఊరించింది. యివ్వకుండానే ఆమె కన్నుమూసింది. తర్వాత- అతను పిచ్చివాడైపోయాడు

చలపతి తన భార్యను మరిచిపోలేక పోయాడు మరచిపోవటానికి కాలం సాయం చేయలేదు కాలకూటంలాంటి 'మందు' పనిచేసింది. ఆమెను మరిచిపోవటానికి అనేక సార్లు త్రాగాడు. ఆమె గుర్తు వచ్చినప్పుడల్లా త్రాగాడు. ఆమె అతని స్మృతిపథం నుండి తొలగిపోలేదు. అతను తాగటం మానలేదు. పైగా నా అనుకునే వాళ్ళు ఎవరూ అతనికి దగ్గరలో లేరు మరెవరూ అతన్ని ఉద్ధరించాలని 'తాగొద్దని' బుద్ధి చెప్పలేదు.

తాగని రోజులు—తాగిన చలపతిని చూసి నవ్వుకుంటూ దొర్లిపోసాగాయి తాగిన చలపతి—తాగని రోజులు వెక్కి-వెళ్ళిపోతున్నాయని గమనించలేక

రాబందులు ప్రాణంలేని జంతువులనూ, మనుష్యులనూ మాత్రమే తింటాయి. ప్రాణంతో వున్నవారిని చడీచప్పుడు లేకుండా పీక్కు-తినే వారిని ఏమనాలి?

పోయాడు. చలపతి రోజూ తాగేవాడు మామూలుగా కాదు, గుండెలనిండా తాగేవాడు. ఇష్టంలేకుంటే ఆఫీసులో ఏగ్గొట్టి బారులో గడిపేవాడు, ఇష్టంఉంటే తాగి ఆఫీసుకి వచ్చేవాడు. ఒక్కోసారి ఒక్కోరకంగా ప్రవర్తించేవాడు. అందిన ప్రతి చోటా అప్పులుచేశాడు. ఆఫీసులో ప్యూను మొదలుబయటకాబూలీవాళ్ల వరకుఅప్పులు అడిగాడు. అప్పుల పతిగా మారిపోయాడు. ఒకప్పుడు అంతా నెత్తిన పెట్టుకొని పూజించే చలపతి-అందరి దృష్టిలో దౌర్భాగ్యుడుగా మిగిలిపోయాడు.

ఎంతోమంది ఆఫీసరుతో మొరపెట్టుకున్నారు —'చలపతి తాగొచ్చి అల్లరిపెడుతున్నాడని' ఆఫీసరికి సహనం హెచ్చు కాకుంటే చలపతిఉద్యోగంఅప్పుడే పోయేది. మొదట్లో మాటలతో చలపతికి బుద్ధిచెప్ప బోయాడు. అతను వినలేదు తర్వాత— ఛార్జిషీట్స్‌తో బెదరించబోయాడు. అతను ససేమిరా అన్నాడు ఆఫీసరికి ఆగ్రహం కలిగింది. అతని ఆగ్రహానికి ఆఫీసులో పనిచేసే టైపిస్టు సావిత్రి కంప్లయింట్ జతయింది

'సార్! ఆ చలపతిని జాబ్‌నుండి తీసేస్తారా? .. లేక నన్ను రిజైన్ చేయమంటారా? .. తాగొచ్చి అతనిష్టం వచ్చినట్లు వాగుతున్నాడు... ఛీ ఛీ....ఇది ఆఫీసేనా?'' సావిత్రి మీద ఆఫీసరికి టోలెడంత ప్రేమ ఉంది. ఆమె కడిగిన ముత్యంలా మెరిసిపోతూ ఉంటుంది ఆ అందమైన అమ్మాయి కోపం చూడలేకపోయాడు ఆఫీసరు.

సావిత్రి తెల్లని చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. ఆమె కళ్లు వర్షించాయి. ఆమె పెదవులు వణికాయి. ఆఫీసరు బాధ పడిపోయాడు. వెంటనే అతని పై అధికారులకు చలపతి మీద నాలుగురతావులకంప్లయింట్ రాశాడు వారం తిరిగేసరికి చలపతిని ఉద్యోగం నుండి తీసివేసినట్లు ఆర్డర్లు వచ్చాయి.

సావిత్రి గుండెలనిండా గాలి పీల్చుకుంది.

ఆఫీసరు గుండెలనిండా తృప్తి నింపుకున్నాడు.

చలపతికి అప్పులిచ్చిన వాళ్ళంతా గుండెలనిండా భయం పెంచుకున్నారు.

తన ఇల్లాల్ని మరిచిపోలేని చలపతి ఆ రోజు కూడ గుండెలనిండా తాగాడు.

* * *

చలపతికి రావలసిన డబ్బు లెక్కలు చూసి, ఆఫీసు వాళ్ళు వారం రోజుల్లో అందించారు. అందిన డబ్బును-అప్పుల నిష్పత్తిలో పంచుకు తీసుకున్నారు అప్పులిచ్చిన వాళ్ళంతా చెప్పాలంటే, ఓరకంగా రాబందులే నయమనిపిస్తుంది అవివచ్చిన వాటినే పీక్కుతింటాయి. ఇది మిగిలింది' అనుకోవటానికి చలపతి చేతిలో ఏమీ మిగల్లేదు. మిగుల్చుకోవాలనుకున్నా— 'మిగిలిన బాకీ మాట ఏమంటావ్?' అని నిలదీసి బెదిరిస్తారని భయపడిపోయాడు.



బాకీలు పూర్తిగా ముట్టినవాళ్లు చలపతిని మెచ్చుకున్నారు. అసలు అప్పే తీరని వాళ్ళు డిక్షనరీలో లేని పెద్ద పెద మాటలతో శపించారు

సాయంత్రం నాలుగయింది. ఆఫీసులో కురుక్షేత్రం చల్లబడింది. చలపతి మనసు ఆవేదనతో బరువయిపోయింది. తనకూ ఆఫీసుకీ సంబంధం తీరిపోయింది. తనకూ జీవితానికీ బంధం ఉండిపోయింది రెండేళ్ళ క్రిందట తనకు ఆఫీసులో ఉన్న స్థానాన్ని తలచుకొని కళ్ళు తుడుచుకున్నాడు. ఆఫీసులో ప్రతి మనిషి, ప్రతి సీటూ, ప్రతిఫైలూ, ప్రతిరూలూ తనకింకా గుర్తున్నాయి అవి మస్తిష్కంలో రంగు చిత్రాల్లా కనిపించాయి. తన జీవితంలో ముత్యాలన్నీ జారిపోయాయి తనలో మిగిలి ఉంది—బండరాయిలాంటిగుండె. అవి బద్దలయితేగాని తను జీవితం నుండి విముక్తి పొందలేడు.

కన్నీరు నిండిన కళ్ళతో బరువెక్కిన మనసుతో-అట్టడుగున పడిన ఆవేదనం వరదలా పొంగగా కొన్నిక్షణాలు చలపతి ఆఫీసు అంతటినీ కలయజూసాడు. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ బయటకు నడిచాడు.

"చలపతీ!...."

అది హెడ్ క్లార్కు నరసింహం గొంతు

చలపతి వెనక్కి తిరిగాడు

నరసింహం గడ్డంకింద రెండుచేతులు పెట్టి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

చలపతి నరసింహానికి కూడ బాకీ ఉన్నాడు. అంతో ఇంతో అతనికి గుర్తు లేదు గుర్తున్నదల్లా—నరసింహం అంద ఎలా బాకీ యిమ్మని ఎప్పుడూ తనను ఇబ్బంది పెట్టలేదు. అందరిలా అతను రాబందు కాలేదు రాక్షసుడూ కాలేదు.

"చలపతీ! ..."

నరసింహం మరోసారి పిలిచాడు. ఆ పిలుపులో మార్ధవంలేదు. తప్పు చేసి పారి పోతున్న వాణ్ణి పట్టుకొని దండిస్తున్న అ కారం ఉంది.

మరి కాసేపట్లో —నరసింహంలో బడ బానలం బ్రద్దలవుతుంది. డబ్బు చే ఎవ రికి చేదు? అది—ఏదో రోజున మనిషిలో దాగిఉన్న నిజరూపాన్ని పైకితీసి అంద మైన బొమ్మలా చూపిస్తుంది. చలపతిలో ఎన్నో ఆలోచనలు మెదిలాయి.

"క్షమించండి సార్! మీకు యివ్వ వలసింది...." చెప్పబోయే సమాధానం క్షమాపకాలతో ప్రారంభించాడు. చలపతి ఆ సమయంలో తాగిలేడు. ఎందుకో అత నికి తాగాలనిపించలేదు.

"అందుక్కాదోయ్ నిన్ను పిలిచింది అలా కూర్చో" బాధపడే వారి నూరడిం చడంలో నరసింహానికున్న నేర్పు మరెవ రికీ లేదు అతను అతిశాంతంగా మాట్లాడ తాడు. ఎదుటివాడి మనసులో 'నెమ్మది' వెల్లువలా ప్రవహిస్తుంది.

నరసింహం లాంటి మంచి వాణ్ని తప్పుగా అంచనా వేసుకున్న చలపతిసిగ్గు పడిపోయాడు. నరసింహం వేపు చూడ లేకపోయాడు. మౌనంగా కూర్చున్నాడు.

"చూడు చలపతీ! ప్రతి మనిషి జీవి తంలో రాజీపడక తప్పదు. ఎదో జరిగి పోయిందని ఎప్పుడూ విచారించేకంటె ఏదైనా మళ్ళా పోతుందని భయపడటం మంచి వాళ్ళ లక్షణం....ఈ రెండేళ్ళలో ఎన్నోసార్లు తాగావు. మనసుపాడు చేసు కున్నావు ఎవర్నీ లెక్కచేయక నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావు. కానీ. నీఇల్లాలు తిరిగి వచ్చిందా?....లేదు....తిరిగి రాదు.

"చనిపోయే ప్రతివ్యక్తికి ఎంతోమంది ఆత్మీయులుంటారు. మమకారం వీడలేక వాళ్ళంతా నీలాగే మనసులు పాడు చేసు కుంటే. ఈ లోకం ఓ పిచ్చాసుపత్రిగా మారిపోదూ?....చలపతీ! ఒకప్పుడు నీ లాంటి మంచివాడు ఈ ఆఫీసులో లేడని అంతా నెత్తిమీద పెట్టుకున్నారు. ఇప్పుడు నీలాంటి తాగుబోతు మరొకరుండరని ఛీదరించుకుంటున్నారు. వాళ్ళ బాకీలు పూర్తిగా తీరవేదని నీ మీద కసి పెంచు కుంటున్నారు నాకు చాల బాధగా ఉంది. నీలాంటి మంచివాళ్ళ జీవితాలు చివరిలో ఎందుకిలా మారిపోతాయో అర్థం కాదు." నరసింహం కనుకొలకుల్లో నీరు విలి చింది.



చలపతి మాట్లాడలేదు. ఓ శుష్కహాసం అతని పెదవుల మీద మెరిసింది. తన ఇల్లాలు గుర్తుకు రాగానే చలపతి మనసు కలుకుమంది. అతనికి జీవితంతో రాజీ పడాలనే ధ్యాసాలేదు బ్రతికి బాగు పడాలనే ఆశా లేదు.

"పోన్లే చలపతీ! జరిగిందేదో జరిగింది... మీ ఊరు వెళ్ళిపోతున్నావా?.... అవును. మీ అమ్మ ఉంది కదూ?...."

చలపతిని బాధ పెట్టడం యిష్టం లేక సంభాషణ మార్చి వేశాడు నరసింహం.

"ఉంది సార్.....టిక్కెట్ తన్నే ముందు ఓసారి మా అమ్మను చూడాలని ఉంది. ఊరు వెళ్ళాలనీ ఉంది. కానీ...."

"అర్థం అయింది. నీ దగ్గర ఒకపైసా కూడా లేదు. అయిదు వందలమైళ్ళు వెళ్ళాలంటే కనీసం చేతిలో వందరూపాయలైనా ఉండాలి! అవునా?....ఆ విషయం నాకు విడిచి పెట్టు-ఆరేళ్ళగా అందరితో కలిసి నువ్వీ ఆఫీసులో పనిచేశావు. నీతో కలిసి పనిచేసిన వాళ్ళంతా తప్పకుండా సహాయం చేస్తారు."

"సార్! నా లాంటి దౌర్భాగ్యుడికి ఎవరూ సహాయం చేయరు. మీరు శ్రమ తీసుకోవడం నాకిష్టం లేదు."

"ఇది శ్రమకాదు, చలపతీ! నీకు ఏ రకంగానైనా సహాయం చేయగలిగితే నాకెంతో తృప్తిగా వుంటుంది. నువ్వు కాదనకు. రేపు ఆఫీసుకిరా." నరసింహం అభయం యిచ్చాడు.

చలపతి జీవితంలో మిగిలి పోయింది ఒకటే. అది—తన తల్లిని చూడాలనే కోరిక. కానీ, ఎలా?....నరసింహం తన మనసులో బాధను గుర్తించాడు. మని షిగా చేతనైన సహాయంచేస్తానని అంటు న్నాడు. తనంటే నరసింహానికెందుకి అభి మానం? అతను కూడా మిగిలిన వాళ్ళలా పట్టనట్లు ఊరుకోవచ్చుగా? ఒక మనిషి మీద మరో మనిషికి సానుభూతికాబోలు.

చలపతి నరసింహం వ్యక్తిత్వానికి జోహార్లు అర్పించకుండా ఉండలేక పోయాడు. నిజానికి అలాంటి సహాయాన్ని తనుకోరుకోవడంలేదు. కానీ, నరసింహం మాటను కాదనలేకపోయాడు.

* * *

నరసింహం పెద్ద మనిషి. అతని పెద వుల మీద చిరునవ్వు కనిపిస్తుంది. మాటల్లో నెమ్మది వినిపిస్తుంది. అతను ఏ పని చేసినా ఓ పద్ధతిలో చేస్తాడనే ప్రతీతి ఉంది. అతనిపై ఆ ఆఫీసులో వాళ్ళందరికి ఓ నమ్మకం వుంది. అతనికి తన చేతి కింద పనిచేసే గుమాస్తాల అభిమానం ఉంది. పై అధికారుల ఆదరణ ఉంది. బంట్రోతుల వినయం ఉంది. అతన్ని గౌరవించలేని మనిషంటూ ఎవరూలేరు.

అంతటి నరసింహం శ్రమ తీసు కుంటే యెవరు కాదనగలరు.

"మనతో అరేళ్ళుగా కలిసి పని చేసిన చలపతి చెడిపోయాడు. ఉద్యోగం ఊడింది.... 'అయ్యో! మనతో పనిచేసే వాడు తాగి చెడిపోతున్నాడే' అని మనలో ఎవరు మందలించినా అతని ఉద్యోగం ఊడేదికాదు.... మీ బాకీలు పోయేవికావు.

"జరగవలసిందేదో జరిగిపోయింది.... ఇంతకూ మీకు చెప్పేదేమిటంటే, మనం చందాలు ఎత్తుకొని చలపతికి సహాయం చేయాలి. ఎందుకంటారా?....చచ్చేముందు తన తల్లిని చూడాలనిపించింది చలపతికి. ఆమెను చూడాలంటే, అతను ఐదువందల మైళ్ళు పోవాలి. మనం కాదంటే అతను మన కళ్ళముందే కళ్ళు మూస్తాడు అతను మీకు చాలా నెలల నుండి వడ్డీలు ఇవ్వటం లేదని నాకు తెలిసింది. మరొకనెల ఇవ్వ లేదనుకొని ఎవరికి తోచింది వారు చలపతి కిచ్చి సహాయ పడతారని ఆశిస్తున్నాను.... ఏమంటారు" నరసింహం ఓ చిన్న ఉప న్యాసం యిచ్చాడు. ఆఫీసులో పనిచేసే అందర్నీ సమావేశ పరిచి.

ఎవరూ మాట్లాడలేదు. మనసులో చలపతిని తిట్టుకున్నారు. శపించారు. అతను చచ్చిపుంటే బావుణ్ణనుకున్నారు. నరసింహం మాటను ఎవరూ కాదనలేదు. కాదనే ధైర్యం ఎవరికీలేదు. నరసింహం చలపతికి చేస్తున్న సహాయానికి అభివంద నలు తెలిపారు.

నరసింహం లిస్టొకటి తయారుచేశాడు. అతను తన పేరు మీద అయిదు రూపా యలు రాశాడు. ఆ అంకెకు దగ్గరలో

మిగిలిన వాళ్ళు కూడా రాశారు. ఆఫీసరు. సావిత్రి.... గుమాస్తాలు.... బంట్రోతులు అంతా కంట్రిబ్యూట్ చేశారు. వెంటనే డబ్బుయిచ్చారు. చలపతికి అంత పెద్ద సహాయం లభించినందుకు నరసింహం చాలా సంతోషించాడు.

"చలపతీ! ఈ ఆఫీసు వాళ్ళెవరూ నీకు సహాయపడరనుకున్నావు. కానీ. అంతా సహాయం చేశారు. రెండువందల పైగా యిచ్చారు. సువ్వదృష్టవంతుడవు."ఆఫీసు మేయన్ గేటు దగ్గర తనకోసం యెదురు చూస్తున్న చలపతి భుజం మీద చెయ్యి వేశాడు నరసింహం.

చలపతి కళ్ళలో కృతజ్ఞతాభావం మెరిసింది. ఆఫీసు వాళ్ళంతా తనమీద సానుభూతి చూపించారనికాదు. నరసింహం లాంటి ఒక్కరైనా తనను అర్థం చేసుకున్నందుకు.

చాలా మంది చలపతికి నీతిచంద్రిక బోధించారు. కొందరు బుద్ధిగా జీవితాన్ని దిద్దుకోమని హెచ్చరించారు. మరికొందరు చిన్నచిన్న విసుర్లతో హేళన చేశారు. వాటిలో నిజం లేకపోలేదని గ్రహించిన చలపతి మౌనంగా ఉండిపోయాడు.

నరసింహంకు దగ్గరలో నిల్చున్న శర్మ ఓ పెద్ద పట్టు వేశాడు. ఆ పట్టుకి పొట్టలు చెక్కలయ్యేలా గుమస్తారాయుళ్లు గొల్లున నవ్వేరు.

"సార్, ఇప్పుడే చలపతికి డబ్బివ్వకండి ...పెద్ద మొత్తం కదూ-ఓ పెద్ద 'పట్టు' పట్టేస్తాడు. రోడ్లన్నీ సర్వే చేస్తాడు. మళ్ళీ మనం చందా లెత్తుకోవాలి స్టేషన్‌కి వెళ్ళేముందు. డబ్బివ్వండి."

చలపతి తల అవమానంతో వాలిపోయింది. కొన్ని క్షణాలు ఎవరిని చూళ్లేకపోయాడు.

• • •

"ఓ చలపతా!....సరిగ్గా ఎనిమిది గంటలకే వచ్చావే" గేటు తోసుకుని లోపలకి వచ్చిన చలపతిని చూసి. చదువుతున్న

బెడ్ టైం థెఫ్ట్

● "దొంగ....దొంగ" పోలీస్ ఇన్‌స్పెక్టర్ అందుకొన్న రిసీవరులో వినిపించింది.
"ఎక్కడ....ఎక్కడ" ఆతృతగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.
"మా యింట్లో...." అవతలి కంఠం జవాబు.
"మీ యింట్లో అంటే సరిగ్గా స్థలం చెప్పండి."
"మా పడగ్గదిలో...."
"అదిసరే.... నేను రావాలంటే ఎలా?"
"మీ సిబ్బందితో రండి."

గవద్గీతను ప్రక్కకు పెడుతూ—నర
సింహం పలకరించాడు.

"మరో గంటలో ట్రెయినొస్తుంది సార్...."జీవితంలో ఓ కొత్తధ్యాయం ప్రారంభించాలని ఉబలాటపడుతున్నాడు చలపతి. ఓ కొత్త గమ్యాన్ని చేరుకోవాలని కూడ ఆశపడుతున్నాడు

"అవునవును....తొమ్మిది గంటలకే కదూ రైలొస్తుంది. అలా కూర్చో చలపతీ! ఇప్పుడే వస్తాను" అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు నరసింహం.

లోపలకు వెళ్ళిన నరసింహం అయిదు నిమిషాల్లో తిరిగొచ్చి చలపతి చేతిలో అయిదు రూపాయల కాగితం ఉంచాడు.

చలపతి ఆశ్చర్యపోయాడు.

"సార్....!"

నరసింహం స్వామీ చిన్మయానందలా ప్రశాంతంగా నవ్వేడు. ఆ నవ్వు చీకటిలో కలిసిపోయి చలపతికి సరిగ్గా కనిపించలేదు.

"చలపతీ! నీకు శ్రమ కలిగించి విన్ను బాధపెట్టాలనిపించలేదు. నేనే శ్రమ తీసుకున్నాను. అందరిదగ్గర చందాలు వసూలు చేశాను. నా బాకీ జమా చేసుకున్నాను. అంతే!....నేనూ మనిషినే చలపతీ! నేనూ అప్పిచ్చాను."

నరసింహం శ్రమ వెనుక దాగి ఉన్న అంతరార్థం తెలుసుకున్న చలపతిలో ఆవేశం కట్టలు తెంచుకుంది.


"నరసింహం! నువ్వు పెద్ద మనిషివి కావు. మంచి మాటలతో మనుషుల్ని మోసగించే మరో జాతివాడివి. సాధారణ వ్యక్తి ఊహకు అందని మరో మనిషివి. నువ్వు చేసిన మోసం....దగా....అంతా అందరితో చెప్పి నీ పరువు కడిగేస్తాను" చలపతి పెద్దగా అరవాలనుకున్నాడు. కానీ. తనశక్తుడని తెలుసుకునేసరికి మాటలు పెదవులు దాటలేదు. చేతిలో అయిదు రూపాయల నోటు రెపరెప మంటుంటే దానివేపు వింతగా చూశాడు.

"చలపతీ! నువ్వంటే నాకెంతో అభిమానం. కానీ, ఇంతకంటె ఎక్కువ సహాయం చేయలేకపోతున్నందుకు విచారిస్తున్నాను."

నరసింహం చలపతి కంటికి అనూహ్యమైన ఓ పెద్ద పిశాచిలా కనిపించాడు. అతని కళ్ళలో నీలి మంటలు ప్రజ్వరిల్లుతున్నట్లు, అతని పెదవులపై హాలహలం అలలమాదిరి పరుగు తీసున్నట్లు కనిపించాయి. ఏళ్ళ తరబడి అతనిమీద తనకున్న మంచి అభిప్రాయం క్షణంలో మంచులా కరిగిపోయింది.

రంగులు కరిగిపోయిన కొయ్యబొమ్మను ఎక్కువసేపు చూడలేకపోయాడు చలపతి.

"థాంక్స్ ఫర్ యువర్ కైండ్ హెల్ప్ సార్" చేతిలో ఉన్న పచ్చ కాగితాన్ని గట్టిగా పట్టుకొని. చిన్నగా నవ్వేడు. ఆ నవ్వులో ఓ పెద్ద భావం లేకపోలేదు.



మాటలు వినబడలేదు. అప్పుడే ఆఫీసుకి వస్తున్న నరసింహానికు మాత్రం అందరి మాటలు వినిపించాయి.

"ఏం జరిగింది శర్మా?" అంటూ నరసింహం అందరి మధ్యకు వచ్చాడు. శర్మ చలపతిని చూపించాడు.

"సార్! విన్ననే చెప్పలేదూ? ఈ రాస్కెల్కి ముందుగా డబ్బిస్తే తాగి పర్వే చేస్తాడని. అనుకున్నంత చేశాడు. చూడండి సార్."

చలపతిని చూడగానే నరసింహం గుండెల్లో దడ ప్రారంభమయింది. తను చేసిన మోసం మూడో వాడికి తెలిసిపోయిందేమో అనే భయం అతనిలో కలిగింది. తనకోసం బతికే మనిషి వేరు. సమాజం కోసం కనిపించే మనిషి వేరు. ఇలాంటి ద్వంద్వాలు ప్రతి మనిషిలో ఉండటం కద్దు.

శర్మ మాటలు-తనను కాపాడుకోవటానికి నరసింహంకి కొత్త ఆలోచన్ని ప్రసాదించాయి.

"నిజమే శర్మా! నేను చాల పెద్దపొరపాటు చేశాను. చెడిపోయిన వాణ్ని బాగు చేయాలనే సదుద్దేశంతో మీకు శ్రమ కలిగించాను.... ఈ ఫూల్ ఇచ్చిన చాన్సి పాడుచేసి మనందరికీ బాధ కలిగించాడు. ఇలాంటి వాడికి ఎవరూ సహాయం చేయొద్దు కాదు, చేయకూడదు అయాం సో సారీ...." నరసింహం తన కళ్ళలో ఎన్ని భావాల్నయినా కనబరచగలడు, తన తియ్యటి మాటలతో ఎవవర్నయినా నమ్మించగలడు. అంతా చలపతిని కసిగా తిట్టుకున్నారు.

పదకొండు గంటలకు ఫ్యాన్స్— 'చలపతి చనిపోయాడ'నే తాజావార్త ఆఫీసులో అందరికీ చేరవేశారు. ఆ వార్తవిని 'అయ్యో' అని ఎవరూ విచారించలేదు. పీడ వదిలిపోయిందనుకున్నారు.

చలపతి చనిపోయాడని తెలియగానే నరసింహంకి ప్రాణం వచ్చినట్లయింది. చలపతి బ్రతికి ఉంటే? తనుచేసిన మోసం ఎవరితోనైనా చెప్పి ఉంటే? తన నిజరూపం బయటపడి ఉంటే? రకరకాలైన ఆలోచనలు నరసింహం తలలో దుమ్ముగాలిలా లేచాయి. *

ప్రపంచంలో ఎవరూ తెలుసుకోలేని కొత్త విజ్ఞానొకటి తెలుసుకున్న తృప్తి; పరదా వెనుక బ్రతికే మనిషిని చూశాననే ధీమా- ఉన్నాయి.

తన జీవితంలో కొత్త అధ్యాయాలు లేవని తెలుసుకున్న చలపతి అయిదు రూపాయలు పట్టుకొని వెళ్ళిపోయాడు.

అప్పు యిచ్చిన సొమ్ము రాబట్టుకున్న నరసింహం తనకు తానే అభినందించు కుంటూ ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు.

* * *

మర్నాడు పది గంటలకు ఆఫీసు గేటు మామూలుగా తెరుచుకుంది. కానీ, ఆ ఆఫీసులో పని చేసేవాళ్ళు మామూలుగా వెళ్ళలేకపోయారు. గేటు ముందు తప్ప తాగి పడున్న చలపతిని చూసి చీదరించు కున్నారు.

"ఛ! వెధవ.... వీడికి సాయం చేయ డం మన బుద్ధి తక్కువ. అసలు దీనికి కారణం నరసింహంగారు. మనం చేదో లెత్తుకోవడం. ఈ వెధవ మన కళ్ళముందు తాగి దొర్లడం— బాగుంది వరస. ఛ.ఛ.."

మైకంలో ఉన్న చలపతికి—

స్మృతి

ఈ నడిరేయి
ఈ కాఱు చీకటి జడల నడుమ
ఈ క్రూర భీకర మృగ గర్జనల మధ్య
పడగ విప్పిన సహస్ర ఫణులు
శత సహస్రాలుగా కదలి
కస్సుకస్సని లేచి
పగబట్టి ప్రగతిపై
బుసకొట్టు సమయాన;
కనుపించదేమి నాక్రొందనకు మెఱుపు?
ఈ వడలో
వడివడి
విడబడి పోయే
నా వడవడిలో
ఈ జీవితపు ఎడారిలో
ఈ తృష్ణ ఆ మృగతృష్ణల నడుమ
అటు పూర్వంగా
అపూర్వమై బులిపించే
తేనె పట్టువంటి నీటి పట్టు
కనుపించదేమి?
ఈ నవ లోకంలో
ఆకలికి
బలికాలేని బలహీనతతో
నే పొలికేకలు వేసే తరుణంలో
కను విప్పిన
నన్ను జూచి
కాల్వలుగా కరుణపొంగి
కనురెప్పల గట్లుమాడి
ప్రవహించిన హృది ఎటుపయనించెను?
కలుకు కత్తుల
పగర కుత్తుక
ఉత్తరించే వేళలో
చిత్తురొత్తుగ నెత్తురుల్
పొంగి పొరలగ నున్న భువిలో
విశ్వవిలయపులయకు వెలిగా
శాంతిగానం చేయవచ్చిన
పై మనస్య రీతివించిన
సౌమనస్య హేతి పెంచిన
సాధుజీవనుదేడి చెపుమా?
సహన సూత్రపు మిత్రుదేడి?

—గోరంట్ల ఫణికుమార్



మూడో మనిషి

కె. రామలక్ష్మి

(గత సంచిక తరువాయి)

వసంత చాలా మటుకు ఏకాకిగా ఒంటరి తనంలో పెరిగింది అలాంటి తండ్రి కాస్తా ఓ రోజు కన్ను మూసేసరికి ఏం చెయ్యాలో తెలియని అయోమయంలో పడి పోయింది. తండ్రి ప్రియమిత్రులైన స్వామిజీ పల్కరింప వచ్చి "యిక్కడ వంటరిగా ఎలావుంటావు. నాతో వచ్చి నా పిల్లలతో కలిసి నీ బాధ మరచి పో" అంటూ శాంతివనానికి తీసుకు వచ్చారు. తీసుకు వచ్చి అప్పుడే రెండు సంవత్సరాలు గడిచి పోయింది. మనం పట్టించుకోనప్పుడు కాలం చాలా త్వరగా గడిచి పోతుంది. ఈ రోజు వరకు యింకో ధ్యాసలేకుండా శాంతివనంలో పిల్లలే తన తోబుట్టువులుగా కాలక్షేపం చేస్తూ వచ్చింది. వసంత....ఆలోచనలు కట్టిపెట్టి మళ్ళీ యింకో పుస్తకం తీసింది.

పదేళ్ళ కుర్రాడొకడు పరుగున వచ్చి 'అక్కా అక్కా స్వామీజీ నిన్ను అర్జెంటుగా తీసుకురమ్మన్నారు అంటూ వెనుదిరిగాడు. "ఎందుకో చెప్పలేదా? అయినా అప్పుడే తోటలోంచి ఆఫీసుకి వచ్చేశారా?"

సీరియల్

అడిగింది వసంత "ఆఫీసులోనే వున్నా రక్కా. ఎవరో వచ్చారు నిన్ను వెంట పెట్టుకుని రమ్మన్నారు'' అన్నాడు కుర్రాడు—గది దాటిపోతూ.

'వస్తున్నాను పద' అంటూ వళ్ళో పుస్తకాలు తీసి గూట్లో పెట్టింది. ఉదయమే తలకి స్నానం చేసింది. జుట్టు వదులుగా రెండు అల్లికలు వేసింది. చీర సరిచేసుకుని తలుపు వేరవేసి బయలుదేరింది— ఆఫీసు కేసి ఎందుకు పిల్చిఉంటారు చెప్మా? అంటూ ఆమె మనస్సు పరి పరి విధాల ఆలోచిస్తూనే ఉంది.

ఉపాధ్యాయుల యిళ్ళకి కొంచెం దూరంలో ఉంది ఆఫీసు. స్కూలు.

ఆఫీసురూంలోకి కాలుపెడుతూనే "నమస్కారం పిలిచారా?'' అడిగింది వసంత.

"రామ్మా. వసంతా కూర్చో'' అంటూ తన పక్కనున్న కుర్చీ చూపించారు స్వామిజీ.

"వీరు సుబ్బారావుగారు మన దాతల్లో ఒకరైన వెంకట రంగారావు గారి సెక్రటరీ. వెంకట రంగారావుగారి తల్లిగారి పేరనే మనం యీ శాంతివనం ప్రారంభించినది. వారిచేతికి ఎముకలేదు. వసంతా వారి తరపున వచ్చారీ సుబ్బారావుగారు...."

వసంత సుబ్బారావుగారికి నమస్కరించింది. "ఏం లేదు. అమ్మగారు నిన్న చాలా ఆత్రంగా ఫోనుచేశారు. పిల్లలకి టీచరు లేదుట ఉన్నామె వారం రోజులు సెలవడిగి వెళ్ళిందట. కాని కారణాంతరాలవల్ల తిరిగి రాలేనని ఉత్తరం రాసిందట అంచేత పిల్లలకి ఎవరినైనా తగిన టీచరుని చూసి పంపమని స్వామిజీతో చెప్పమని ఫోను చేశారు. ఆ పని మీదే ఆగారు సుబ్బారావుగారు.

సుబ్బారావు గారికి వసంత చూడగానే నచ్చింది. స్వామిజీ అంతకు ముందే చెప్పిన దాన్ని పట్టి వసంత కనిపించేటంత అమాయకురాలు కాదని గ్రహించాడు. సోగ దేరిన కళ్ళు తేజైన ముఖంలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. సూటిగా వున్న ముక్కుమీద కనీ కనబడనంత చిన్న పుట్టుమచ్చ. పరిచయంగా నవ్వీనవ్వనట్టు నవ్వితే బుగ్గలు సొట్టలు పడుతూ వసంత సామాన్యమైన అందాన్ని వెయ్యిరెట్లు చేస్తున్నాయి. "స్వామిజీ అయితే నా కెందుకు కబురు పంపారూ?" అడిగింది వసంత.

"వసంతా, రావుగారి యిద్దరు పిల్లలూ ఆడ పిల్లలు. పెద్దమ్మాయికి ఎనిమిదేళ్ళు చిన్నదానికి ఆరు. వారి భార్య పోయికూడా ఆరేళ్ళు అయిపోయింది. అయినెప్పుడూ యీ పట్నంలోనే వుంటారు. అమ్మగారే పల్లెలో వుండి పొలాలూ అవీ చూసుకుంటూ పిల్లలతో కాలక్షేపం చేస్తుంటారు. పిల్లలని అప్పుడే ఏ స్కూల్లోనైనా వేసి దూరంగా పంపించేయడం యిష్టం

లేక యింట్లోనే అన్ని వసతులూ కల్పించి టీచర్ను అక్కడే పెడుతున్నారు. అంచేత నువ్వు అంగీకరిస్తే నిన్ను పంపాలని అనుకుంటున్నాను వసంతా.''

''నన్నా?'' ఆశ్చర్యంగా అడిగింది వసంత.

''అవునమ్మా. ఓర్పు నిదానం ఉన్న దానివి. చదువు సమర్థవంతంగా చెప్ప గల్గిన దానివి. నీకంటే వేరెవరూ నాకు స్ఫురించ లేదు. ఏం నీ కిష్టం లేదా?'' సూటిగా అడిగారు స్వామిజీ

''ఇష్టంలేదని కాదు నేనక్కడ ఉండ గలనా అని'' అనుమానంగా అంది వసంత

''గొప్పవారి పిల్లలైనా పిల్లలు తల్లి లేనమ్మ. వారికి కావలసింది ఆదరణ. అది నీ దగ్గర పుష్కలంగా వుంది.'' నవ్వుతూ అన్నారు స్వామిజీ.

''కాదు స్వామిజీ! నేనిక్కడ యీ రెండేళ్ళలో సర్వం మరిచి బ్రతుకు తున్నాన. అలాంటిది ఒక యింట్లో వుండటం అంటే ఎన్నో రకాల సర్దుకు పోవలసిన అవసరాలు ఏర్పడవచ్చు వారికీ కష్టం కలుగవచ్చు నాకూ కల్గ వచ్చు....'' నసిగింది వసంత.

''అహహా! అలాంటి వేంవుండే అవ కాశమే లేదు. అంతంత కొంప. పిల్లల గదులన్నీ మేడమీదే వున్నాయి. ఇక కింద పనివాళ్లూ అమ్మగారు అంతే. మీరే చూడండి ఓ ఆర్నెల్లు. మీకు నచ్చకపోతే వచ్చేద్దురుగాని' అన్నారు సుబ్బారావు గారు.


''అలా అని కాదండీ నేనిక్కడి వాతా వరణంలో బాగా యిమిడి పోయాను. చీకూ చింతా మరచి కాలం గడిపేస్తు న్నాను. మళ్ళీ మారడం ఎందుకు అని పిస్తూంది'' అంది వసంత.

''చూడండి. తల్లిలేని పిల్లలు అయినా చాలా కట్టుదిట్టంగా పెంచు కొస్తున్నారు పెద్దావిడ. ఎక్కడ మీ కే యిబ్బంది కలు గదు. నాది పూచి. నేను యిక్కడ పట్నం లోనే వున్నా ఎప్పుడూ వచ్చి పోతూనే ఉంటాను. నలభై మైళ్ళు ఎంతసేపు వెళ్ళి రావాలి? మీరూ అలాగే కావాలంటే వచ్చి స్వామిజీని చూసి వెళ్ళవచ్చు ...మీరు కాదనకండి'' అన్నారు బ్రతిమాలు తున్నట్టు సుబ్బారావుగారు ''అమ్మాయి ఆలోచించి సాయంత్రం చెప్తుంది. మీరు నిశ్చింతంగా వెళ్ళిరండి'' అన్నారు కూర్చొన్న వారు లేస్తూ స్వామిజీ

వసంత కూడా లేచి నిలబడింది.

''నువ్వుండు వసంతా, నేను వీరిని సాగనంపి వస్తాను అని అవతలకి దారి తీశారు స్వామిజీ.

''మీరు ప్రయాణానికి సిద్ధంగా వుంటా రన్న నమ్మకంతో నేను రేపు వుదయం కారు తీసుకుని వస్తాను సెలవు ' అంటూ వసంతకి చెప్పి స్వామిజీ వెంట నడిచారు సుబ్బారావు గారు.



స్వామీజీ తిరిగివచ్చి, కుర్చీ వసంతకి దగ్గిరగా లాక్కు కూర్చుంటూ "నీ ఆలోచన నాకు తెలుసు తల్లీ ఈ పిల్లలలో నువ్వూ ఒకదానివై పోయావు ఇప్పుడీ యిల్లు విడిచి ఎలా వెళ్ళడం అనుకుంటు న్నావు. అవునా?' నవ్వేశారు స్వామిజీ.

'మీరింకెవరినైనా పంపించండి. నేను యిక్కడే ఉంటాను" అంది వసంత

"పంపిద్దును కాని ఎవరున్నారు చెప్పు? పసివాళ్ళ మనసులు గుర్తించి వారిని నైపుణ్యంతో క్రమశిక్షణలో పెట్ట కల్గేవాళ్ళింకెవరున్నారు మన స్కూల్లో ఉన్నటీ చర్లంతా ఎదో బాదరబందీ వున్న వాళ్లే జబ్బులో ఉన్న భర్తతో పోషించ వలసిన కుటుంబాలో....ఏదో ఒకటి వారిని క్రిందికి లాగుతూ వుంటాయి. యింక వారేం సానుభూతితో పనిచేయ కల్గ తారు నేను బాగా ఆలోచించే నిన్ను పంపాలను కున్నాను. చూడు సుబ్బారావు చెప్పినట్టు ఎప్పుడు నచ్చకపోతే అప్పుడే వచ్చేద్దువుగాని...."

"అదికాదు స్వామిజీ, యీ అనాధల మధ్య లభించే తృప్తి అన్ని వున్న ఆ పిల్లల దగ్గిర నాకేం లభిస్తుందని? వీరి కెవరూ లేరు ఏమీలేదు నేనంటే ప్రాణం పెట్టే పిల్లలు తయారయ్యారు. వీరందరిని

విడిచి ఎలా వెళ్ళిపోను? వెళ్ళినా ఎలా వుండగలను?'' బాధగా అడిగింది వసంత.

''నిజమే కాని అన్ని వున్న పిల్లలకి కూడా కొరతలుంటాయి వసంతా నువ్వు వెళితే నీకు అర్థం అవుతుంది. మన పక్కలచెప్పుకోతగ్గ భూస్వాములు అయినా ఆ యింట ఎందుకో శాంతి లభించలేదె వరకి. హాయిగా కాపురం చేస్తున్న కోడలు పురిటిలో పోయింది. అంతకు ముందు నుంచీ పట్నంలో ఓ కాపురం పెట్టి కాలక్షేపం చేస్తున్న రావుగారికి భార్య పోవడంతో యింటి ముఖం చూడ డం మానేశాడనే చెప్పవచ్చు. ఇక ఆ తల్లి ఎన్ని అవస్తలు పడి, ఎంత గుట్టుగా కుటుంబాన్ని కాపాడుకు వస్తూందో ఆలో చించి డబ్బు నీళ్ళలా కర్చుపెడుతూ బాధ్యతలు ఏ మాత్రం పట్టించుకోని కొడు కుని ఏ విధంగానూ అదుపులోకి తేలేక ఆమె యీ మనుమల మీదే తన మనస్సుని నిలుపుకుంది పెంచుకు వస్తూంది. ఆమె గారే మన శాంతివనానికి రెండు లక్షలు పైగా చేసే భూమి ఓ లక్ష రొక్కము యిచ్చారు ఆమె మనస్సు అంత పెద్దది. వసంతా అటువంటి వుత్తమురాలు నేను తప్పక ఆదుకొంటానని తెలిపి కబురంపి నప్పుడు నా ధర్మం నేను నెరవేర్చవద్దా? చెప్పు'' అడిగారు. ఓ క్షణం వారిద్దరి మధ్య నిశ్శబ్దం ఆవరించింది. మరు క్షణం తనో నిర్ణయానికి వచ్చినట్లు తల పంకిం చింది వసంత.

"సరే స్వామిజీ నేను రేపు వుదయం సిద్ధంగా వుంటాను. ఉదయం ప్రార్థన సమయంలోగా నన్నిక్కడ నుంచి తీసుకు వెళ్ళేలా ఏర్పాటు చేయమని చెప్పండి.'' అని గబగబ తన నివాసం కేసి పరుగెత్తి పోయింది వసంత.

స్వామీజి తేలికగా నిట్టూర్చారు ఆయన మనస్సు మీదనుంచి కొండంత బరువు దిగినట్లయింది. గొప్ప భూస్వాములో వ్యాపారవేత్తలో కాక రావుగారి కుటుంబం మర్యాదకు మారుపేరు. అటువంటి కుటుంబంలో చోటు చేసుకుంటే వసంత జీవితం చల్లగా సాగిపోతుందని వూహిం చారు స్వామిజీ. ఆ విధంగా నైనా తన స్నేహితుని ఆత్మకు శాంతి లభించుతుం దని భావించారు.

రావుగారి సెక్రటరీ సుబ్బారావుకి వసంత బాగా నచ్చింది. అలాంటి అమ్మాయి ఒకత్తె ఆ యింట్లో తిరుగుతూ ఉంటే నైనా రావుగారి చిల్లర తిరుగుళ్ళు మాని ఒళ్ళూ యిల్లూ గుల్లచేసుకోడం మాని పల్లెపట్టున వుండి మళ్ళీ పెళ్ళి ప్రసక్తి తెస్తారేమో నన్న ఆశ కల్గింది.

స్వామీజీతో మాట్లాకి తిన్నగా న్వర్ణ ముఖి యింటి క్రింది భాగంలో ఉన్న తమ ఆఫీసుకు వెళ్ళారు. వెళుతూనే యింటికి ఒక కాల్ బుక్ చేసి పని చూసు కోవడం ప్రారంభించారు.



అసలు సుబ్బారావుగారు వయస్సుకి చిన్నే అయినా అనుభవానికి తల నెరసిన వారే. చిన్న తనంలో తండ్రి పోడంతో అమ్మగారి సహాయంతో లా పాసయి కుటుంబాన్ని ఆదుకున్నారు. అన్నదమ్ము లని చదివించుతూ తోబుట్టువులకి పెళ్ళిళ్ళ

చేశారు. సహృదయుడూ రావుగారి మంచి కోరేవాడూ అయినా తన కళ్ళముందే రావుగారు రోజుకి రోజు దిగజారి పోతూంటే చూస్తూ ఏం చేయలేని స్థితిలో ఉన్నారు.

పదకొండయినా రావుగారు క్రిందికి దిగిరానే లేదు. 'అమ్మగారు ఐదొంద లిమ్మంటున్నారు' అంటూ స్వర్ణముఖి పని పిల్ల వచ్చి అడిగింది.

అడిగినప్పుడు ఉంటే యివ్వడం లేకుంటే అప్పుతెచ్చి సర్దడం సుబ్బారావు అలవాటైపోయింది. ఎందుకని అడిగినందు కొకసారి జరిగిన రసాభాసతో యిక అలా అడగడం కూడా మానుకున్నారు. రేసుల కని, నగలకని, బట్టలకని యింటికని వేలకి వేలు ప్రతినెలా ఖర్చు అయిపో తూంది. బ్యాంకు నిల్వ తరిగితే తిరిగి ఊరువెళ్ళడం డబ్బు పుట్టించు కొచ్చి బ్యాంకులో వేయడం విధాయికం అయింది.

"అయ్యగారింకా లేవలేదా?" అని అడుగుతూనే ఐదొందలు స్వర్ణలక్ష్మి చేతిలో పెట్టారు సుబ్బారావుగారు.

'లేచారు. స్నానం చేస్తున్నారు. ఈ రోజు మధ్యాహ్నం ఎన్నాళ్ళరెదతారట - నాలుగు రోజు... వే

"అలాగా?" ... తన పనిలో మునిగిపోయారు సుబ్బారావుగారు.

గవర్నమెంటు ఆఫీసులో కంటే ఎక్కువ పైళ్ళు పెరుగుతున్నాయి.

సుబ్బారావుగారి బల్లమీద పిటిషన్లు. కౌంటర్ పిటిషన్లు. ఎపీళ్ళు ఒకటేమిటి? అన్నీ తగాయిదాలే. కోర్టుగొడవలే. కాని ఏం చెప్పినా పట్టించుకోరు రావుగారు. 'చూసేయండీ' నేనెందుకు మధ్యలో?' అంటారు. ఎలా? ఈ భూమి తగాదాలు. యీ తగళ్ళులూ, దస్తావేజులూ అంత సులభంగా తేలేవే. దానికి తోడు భూకా మందు దగ్గిర లేకపోతే పెత్తందార్లు చెలా యించే జులుం వీరికెలా తెలయ చెప్పాలి? ఎప్పుడేనా ఓ రెండు నెలలపాటేనా ఊళ్లో వుంటే అన్నీ సాఫీగా చేసుకోరావచ్చు. కాని ఏం లాభం? ఒక్క క్షణం అక్కడ కాలునిలువదు రావుగారికి. తనఆలోచనలతో సతమతమయిపోతూనే విసుగ్గా పేపర్లు తిరగేస్తున్నారు సుబ్బారావుగారు

"హల్లో ఏమిటి యింటి విశేషాలు? అమ్మెందుకంత అర్జంటుగా ఫోను చేసింది?" చేతిలో పట్టుకొచ్చిన దినపత్రిక చూస్తూ కుర్చీలో కూలబడి-అడిగారు రావుగారు.

చూస్తున్న కాగితాలు మూసి వేసి నిల బడ్డారు సుబ్బారావు.

"నమస్కారం... ఏమిటి ఊరెడు తారట?"

"అవును... లుగు రోజులు ఉన్నారు వెళ్ళి వుంటే ... ఏం? ఏదైనా అర్జెంటు పని వుందా? పిల్లలు కులాసా కదా"' పేపరు ఒళ్లో పడేసుకుంటూ ముందుకి వంగి అడిగారు రావుగారు

"ఆ-అంతా కులాసాగా ఉన్నారు. టీచరు మానేసిందట. మళ్ళా యింకో టీచరును ఏర్పాటు చేయమని అమ్మగారి ఫోను. మిమ్మల్నిఓసారివచ్చివెళ్లమన్నారు. వెంకన్నబాబు కౌలు తీసుకున్న భూమి గొడవేదో తేల్చేస్తే బాగుంటుందని అమ్మగారి అభిప్రాయం. వాడింక లేచి తెరగ లేదట. నెలో రెండు నెల్లో అంటున్నాడట వైద్యుడు."

"నెలాఖరికి వస్తాను....వాడి మేనల్లుళ్ళు చేసుకుంటామంటున్నారుగా ఇచ్చేపేయ్యండి." పడేసిన పేపరు మళ్ళా అందుకున్నారు రావుగారు.

"అంటున్న మాట నిజమే. కాని భూషణంగారు ఎక్కువిస్తానని కబురంపారట. ఆలోచించమన్నారు అమ్మగారు."

"చూద్దాం-గాని టీచరు దొరికిందా?"

"ఆ, కుదిర్చాను. రేపు ఉదయం తీసుకెళ్ళి యింట్లో దింపి వస్తాను." ముభావంగా చెప్పారు సుబ్బారావుగారు.

"ఏం? మంచి టీచరెవరూ లేరా! పోనీ కొంచెం ఆలస్యం అయినా ఫరవాలేదని చెప్పకపోయారా? స్వామీజీ!"

"పై వూరెళ్ళి ఎవరుంటారండీ యీ రోజుల్లో-యీ టీచరు ఫరవాలేదు. ఉన్నన్నాళ్ళే ఉంటుంది. అప్పుడు మళ్ళీ చూసుకోవచ్చు."

"అలాగే చెయ్యండి. ఏం లేదు షరీ రాక్షసిలాంటి టీచరైతే పిల్లలు చదువుకోరేమోనని" నవ్వేశారు రావుగారు.

"మీరు వచ్చినపుడు చూస్తారుగా" నవ్వుతూ బదులు చెప్పారు సుబ్బారావుగారు. చూస్తారు! మీకే తెలుస్తుందన్న గర్వం ధ్వనించిందాయన మాటల్లో.

"అయితే రేపు మీరిక్కడ ఉండరు కదా. యింక అర్జెంటు విషయాలేం లేవుగా?" లేస్తూ అడిగారు.

"లేవు నే తిరిగి వచ్చాక కలుస్తాను."

చేతిలో పేపరు పట్టకుని తిరిగి మేడమీదికి వెళ్ళిపోయారు రావుగారు.

సుబ్బారావుగారు విట్టూగ్నారు. మళ్ళీ వెళ్ళగానే బాటిల్ ఓపెను చేస్తారు ఒంటి గంట భోజనందాకా అదేపని: బంగారం లాంటి మనిషికి ఎలాంటి జాడ్యం దాపురించింది: స్వగతంలో బుడ్డీనీ స్వర్ణముఖినీ కలిపి తిట్టుకున్నారు. మళ్ళీ పైళ్ళలో తల దూర్చేసరికి ఫోను వచ్చింది. తమ టీచర్ని వెంటపెట్టుకుని వస్తున్నట్టు చెప్పి ఫోను పెట్టేశారు. అబ్బ: ఒక పని అయింది. ఇక ఈ వసంతగారి నా ఇంట దింపి పరిచయాలు చేసి వస్తే మిగిలినపనీ అవుతుంది అనుకుంటూ కాగితాలన్నీ కట్టి పెట్టి ఆఫీసురూం తాళంవేసి బయటికి నడిచారు.

వీధిలో పనులన్నీ ముగించుకుని తిరిగి ఆఫీసు చేరేసరికి సాయంత్రం అయిపోయింది స్వామీజీ ఫోను చేసి వసంత తెల్లవారు జామునే సిద్ధంగా వుటుందనీ జాగ్రత్తగా తీసుకువెళ్ళి దింపి రావలసిందనీ చెప్పారు. ఎందుకో ఆమెనుచూడగానే అనిపించింది క్యూరియాసిటీ కేనా తప్పక ఒప్పుకుంటుందని సుబ్బారావు గారికి

తెల్లవారు జామునేయిబ్బంది లేదు. కారు సిద్ధం చేయించి పోర్టుకోలో పెట్టించారు డ్రైవరుని ఆఫీసులోనే పడుకోమన్నారు.

నాలుగున్నరకంతా లేచి బయలుదేరారు సుబ్బారావుగారు. శాంతివనం ప్రాంతంలో యింకా బాగా చీకటిగావుంది నిశ్శబ్దంగా వుంది. అక్కడా అక్కడా ఒకటీ అరా కాకి కూస్తుందంతే.

స్వామిజీ ఆఫీసు గదిలో దీపం వెల్గుతోంది. స్వామిజీ వసంత కూర్చుని నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. కారు రావడం చూసి స్వామిజీ బయటికి వచ్చారు. సుబ్బారావుగారు కారు దిగుతూ. 'చాలా పెందరాడే వచ్చానా?' అన్నారు.

'లేదు ఎంత పెందరాడే బయలుదేరితే గమ్యం అంత త్వరగా చేరుతాం' నవ్వుతూ

జాబ్ ఇంటర్వ్యూ

- "నీ పేరు?" ఆఫీసరు ప్రశ్న.

"సోమలింగం...." ఉద్యోగానికొచ్చినాయన జవాబు.

"మీ వూరు?"

"సోమార్లపాడు"

"ఎంతవరకు చదివావ్?"

"నా అప్లికేషన్‌లో చూసుకోండి."

"నీ ఎక్స్‌పీరియన్స్ ..."

"దాంట్లోనే చూసుకోండి."

"అయితే మీరిక వెళ్ళండి"

"మరి నా ఉద్యోగం?"

"మేము పంపే రిగ్రెట్ కార్డులో చూసుకోండి."

వసంత భుజంమీద చేయి వేశారు. సుబ్బారావుగారే వసంత రెండు పెట్టెలు అందుకుని డ్రయివరు కిచ్చారు.

వసంత చాలా మౌనంగా గంభీరంగా ఉంది. ఆమె మనస్సులో ఆయిన వాళ్ళని వదలి వెళ్ళిపోతున్నంత బెంగగా వుంది. స్వామిజీ నిర్ణయాన్ని కాదనే ధైర్యం లేదామెకి. తండ్రి పోయిన దగ్గర నుంచీ తండ్రి కంటే ఎక్కువగా చూసుకుంటూ తన మంచి చెడ్డలని కనిపెడుతున్న చేదోడు వాదోడు ఆయన మాటనెలా తీసేస్తుంది?

వంగి స్వామీజీ పాదాలకి నమస్కరించింది మౌనంగా. "వెళ్ళిరామ్మా. నీకేం భయం లేదు. సుబ్బారావు నాకు తెలిసినవారే. అంతకంటే రావుగారి తల్లి దగ్గరకు నిన్ను పంపడానికి నా కెంతో సంతోషంగావుంది. ఆమెనొకసారి చూస్తే నువ్వే ఒప్పుకుంటావు - నా నిర్ణయం సరైనదని" అంటూ వసంత తలనిమిరారు.

"అమ్మాయికేమాత్రం యిష్టం లేకున్నా తిరిగి పంపించే బాధ్యత మీది సుబ్బారావుగారూ." అంటూ సుబ్బారావుని హెచ్చరించారు.

"అదే కదండీ కండిషన్" నవ్వుతూ వీడ్కోలు పుచ్చుకున్నారు స్వామీజీ దగ్గిర.

"వెళ్లొస్తాను స్వామీజీ!" అంటూ త్వరగా వెళ్ళి కారు వెనుక సీటులో ఓ మూలగా ఒదిగి కూర్చుంది వసంత.

ముందు సీట్లో డ్రయివరు ప్రక్కన కూర్చొని తలుపువేస్తూ 'మళ్ళీ కన్పిస్తాము స్వామిజీ' అంటూ సుబ్బారావు సెలవు తీసుకున్నాడు.


కారు శాంతివనం గేటువాటింది.

ట్రాఫిక్కు తక్కువగా వుండడంతో వేగం పుంజుకుని యిట్టే ఊరి పొలిమేరలు దాటింది.

"మీరేం బాధపడకండి వసంతగారూ. అక్కడి వాతావరణం మీకు నచ్చుతుంది" అన్నారు సుబ్బారావు-మాటల్లోకి దింపే ప్రయత్నంలో.

మేరేజ్ ఇంటర్వ్యూ

● "అమ్మాయి పేరు?" పెండ్లి కొడుకు తండ్రి ప్రశ్న.
"మూదేవి." పెండ్లి కూతురు తండ్రి జవాబు.
"ఎంత వరకు చదివింది?"
"ఏదో లెండి."
"పాడుతుందా?"
"ఏదోలెండి."
"మా అబ్బాయి మీ అమ్మాయికి నచ్చిందా?"
"ఏదోలెండి."



"అక్కడెవరుంటారు?" అడిగింది వసంత.

"అమ్మగారు. ఆమెగారి దూరపు బంధువొకామె కొంచెం సాయంకోసం వుంటుంది. పిల్లలకి పనిమనిషి వుంది. యింకా తోటా దొడ్డీ చూసే పాలేళ్ళున్నారు నౌకర్లకి కొదవ లేదు...."

"కాని...." వసంతే అంది.

"డబ్బున్న వారి యిల్లు కదా, కొంచెం దుబారా కొంచెం నోటి దురుసు వుంటే వుండవచ్చు. యజమాని పట్టించుకోనప్పుడు ఎవరికి వారే తామే అధికులం అనుకోవడం సహజమే కదా?" తేలికగా అనేశారు సుబ్బారావుగారు.

"మీ యజమానికి పట్నంలో అంత తీరిక లేని పనా?" అడిగింది వసంత.

"కొన్నాళ్ళు పోతే మీకే తెలుస్తుంది. ప్రస్తుతానికింత తెలుసుకుంటే చాలు" ముభావంగా అనేసి వూరుకున్నారు సుబ్బారావుగారు.

వసంత కూడా మూలకి జేరబడి కళ్ళు మూసింది.

'పిల్లాపాపని యిల్లూవాకిలినీ కూడా మరిపించి అంత బానిసని చేసుకున్న ఆ పనేమిటబ్బా?' అనుకుంటూ నిద్ర కొరిగింది.

కారులోనూ బయటకూడా నిశ్శబ్దం ఆవరించుకుంది.... సన్నగా చినుకు ప్రారంభమై వసంత ముఖం మీద పడుతోంది. హాయిగా ఉంది.

కారు జోరుగా సాగిపోతూంది ఉదయించే సూర్యునితో పోటీపడుతున్నట్టు.

(సశేషం)

చావు

''ఏయ్!''

''..........''

''ఏయ్! విన్నే!''

''అబ్బ నాకు నిద్రవస్తూ వుంది. మళ్ళీ రావోయ్ మిత్రమా!''

''నేనెవరినో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్!''

''నువ్వు ఎవరివో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్. అది నీ తప్పు.''

''హహహహహహహా.''

''ఏమిటా వెధవ నవ్వు.''

''చిత్రంగా వుందే! నా నవ్వు వింటే భయం వేయటం లేదూ?''

''చిత్రంగా వుందే! నీ వెధవ నవ్వు వింటే నాకేం భయం.''

''నేనెవర్నో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్! నేనెవర్నో తెలుసుకొంటే....''

''నువ్వు ఎవరివో, నీ వెకిలినవ్వుతోనే అర్థమవుతూ వుంది. పిలవకుండా వచ్చిన నీ సభ్యతే తెలుపుతోంది—నువ్వు ఏపాటి దానివో.''

''నువ్వు బొట్టు పెట్టి పిలవక్కర్లేదు నన్ను. నీవు నన్ను గురించి ఆలోచిస్తే చాలు. నీ దగ్గరికి ''రయ్'' మంటూ వచ్చేస్తాను.''

''నీ వుద్దేశ్యమేమిటో అర్థం కావటం లేదు. నువ్వెలా పిచ్చిగా ఎందుకు ప్రవర్తిస్తున్నావో అర్థం కావటంలేదు!''

''నేను పిచ్చిదాన్ని కాదు. నేను పిచ్చిదాన్నయితే, నన్ను గురించి ఈ ప్రజ అంతా ఇలా భయపడరు.''

''అచ్చా.''

''ఆ! నన్ను తలుచుకొని. తలుచుకొని చచ్చిన—నీ మిత్రుడు పరంధామయ్యను చంపిన చావుని నేను.''

''నువ్వా!!

''నేనే. రేపు నీ పక్కింటి సుందరయ్యని, ఎల్లుండి మరో అప్పలమ్మని—ఇలా అందర్నీ నాలో కలుపుకొనే—చావుని నేను.''

''నువ్వు! నువ్వు నా దగ్గరికెందుకొచ్చావ్!?''

''ఈవేళ నా దగ్గరికొచ్చిన పరంధామయ్యని చంపిన—నాగురించి తీవ్రంగా ఆలోచించావుగనుక.''

''అవును నీగురించి ఆలోచించాను! పరంధామయ్య నీ దగ్గరికి ఎందుకొచ్చాడో అర్థంకాక ఆలోచించాను! అతనిలోని ఏ వికారం నిన్నుగురించి ఆలోచించి, నీ దగ్గరికి లాక్కొచ్చిందో తెలుసుకోవడానికి ఆలోచించాను!''

"అంతేగాని నేనంటే నీకు భయం లేదా?"

"లేదు."

"హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా"

"నువ్వంటేనే భయంలేని నాకు, నీ నవ్వంటే భయం ఎందుకుంటుంది? అందుకే నిన్ను 'పిచ్చిదానివి' అన్నాను."

"హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా—"

"నవ్వకు. నువ్వు నవ్వి నవ్వి నీ నాలుక తెగిపోయినా నేను భయపడను."

"హ్హాహ్హాహ్హా...."

"ఇంతలా, నోరు తెరిచి నవ్వుతున్న నిన్ను భయపెట్టడానికి—నా చిరునవ్వే చాలు!"

"నిజమే!...నువ్వంటున్నది నిజమే!.. ఏమిటిది....నీ చిరునవ్వువల్ల నాకు వణుకు వస్తూవుంది ...ఒళ్ళంతా చెమటలు పట్టి పోతున్నాయ్...."

"తెలిసిందా! నేను ఎంతటివాడ్నో! వెళ్ళిపో నువ్వు—లేకపోతే నేను నవ్వుతాను! నా నవ్వువల్ల నువ్వు ధగ్ధమయి పోతావ్!"

"వెడతాను! వెళ్ళేముందు ఒక చిన్న ప్రశ్న—నువ్వు ఎవరివి?"

"నేను నీగురించి తలుచుకొనే నిరాశను తొలిగించి, వయసు మూడకందే, ఆశలు తీరందే, నిన్నుగురించి ఆలోచించి—నీ దగ్గరకు రాకుండా—నన్నూ, నా చుట్టూ వున్న వాళ్ళనీ అభ్యుదయంలోకి నడిపించే అభ్యుదయవాదిని. నిరాశల్ని ఓడించి, ఆశలను గెలుచుకొనే—ఆశావాదిని."

"........."

త్రిపురనేని రామ్‌గోపాల్

బ్రాందెఫెక్ట్

✻ ఒక సెకండరీ గ్రేడ్ టీచరు గారు బ్రాందీవలన కలిగే అనర్థాలను గురించి వివరిస్తున్నారు క్లాసులో. మానవుని శరీరంలో జీవించే కొన్ని పురుగులను తెచ్చి నీళ్ళున్న గ్లాసులో వేశారు. అవి బ్రతికేవున్నాయి. వెంటనే బ్రాందీ వున్న మరో గ్లాసులో వేశారు. వెంటనే ప్రాణం వదిలాయి.

"దీనివలన మనం నేర్చుకొన్న నీతి ఏమిటి?" క్లాసు వైపు చూచి ప్రశ్నించారాయన.

"త్రాగగలినంత బ్రాందీ రోజూ త్రాగగలిగితే మంచిది." విద్యార్థుల్లోంచి జవాబు వెంటనే వచ్చింది.

చిచ్చురగిల్చిన చీకటి

పైడిపాల



నిశాటవిలో ఓ మూల నిప్పంటుకున్నట్టు తెల్లవారుతోంది.

వ్యాపిస్తున్న అగ్ని వెలుగులా సూర్యకిరణాల ఎర్రటి ఛాయలు. లుగుని చూసి నలుదిక్కులకు కకావికలై ఎగిరిపోతున్న పక్షులు.

కొంపలంటుకున్నట్టు రోడ్డు మీద హడావిడిగా నడుస్తున్న జనం.

జనంతో జనంకోసం జనంచేత నడప బడుతున్న ప్రజాస్వామ్యంలాంటి రకరకాల వాహనాలు.

ఉన్నట్టుండి రోడ్డు పక్క ఓ గుంపు అంతకంతకీ జనం తేనెటీగల తుట్టలా వచ్చి చేరుతున్నారు. ఏదో సామెత చెప్పినట్టు అంతమంది జనం చేరడానికి కారణమేదో ఉండాలనుకొని గుమిగూడుతున్నారు. వెర్రిజనం. ప్రాణంవున్న మనుషులతో బాటు ప్రాణంలేని సైకిళ్లు. స్కూటర్లు. మోటర్లు చిన్నకార్లు....వచ్చి అక్కడ ఆగిపోతున్నాయి. ఇంతకీ గుంపు మధ్యనున్న విచిత్రమేమిటో మాత్రం చాలా మందికి తెలీదు. మోళీకో ఇంకో మోసానికో అది వేళకాదు. ఇంతలో 'ఏమిటి?' అనే ప్రశ్న ఉష్ణసంవహన విధానంలో వున్న మనుషుల ద్వారా లోపలకెళ్ళి తిరిగి అదేరీతిలో 'పసిగుడ్డు నెవరో పారేశారు' అనే సమాధానం వచ్చింది.

'ఏ తల్లి కని పారేసిందో యెంచక్కా వున్నాడే తల్లీ!'

''ఆ తల్లి మనిసో రాక్షసో యింత అందమైన పాపణ్ణి పారేసుకోడానికి.'

'ఏ దిక్కుమాలిన నంజ కందో పాపం ...'

'ఎంత బజారు ముండైతే మాత్రం దాన్ని గుండా, రాయా?'

'కన్న తీపైనా లేని కఠినాత్మురాలు నారాయణమూర్తీ!'

'ఆ పెళ్ళి కాపిదానికొచ్చిన పోగాలమో!....'

ఆడా మగా అని లేకుండా ఎవరి నోటికొచ్చినట్టు వాళ్ళు చేస్తున్న వ్యాఖ్యానాలు వడిసెలలా తగుల్తున్నాయి దూరంగా నిల్చున్న ముత్తేలమ్మకి. ఇంకా చదువుకున్న బాబులు సణుగుతున్నదేదో తనకర్థం కావడం లేదు. ఆ రాళ్ళ వర్షంలో పెల్లుబుకుతున్న మాతృ మమతతో హృదయం రంపపు కోతకు గురవుతుంటే వెళ్ళి కుర్రాణ్నెత్తుకొని 'వీడు నా బాబు' అని గట్టిగా అరవాలనిపించింది, కాని ప్రజలు నమ్మరు. నమ్మితే మాత్రం చిత్రవధ చేస్తారు. అంతకంటె గుండె రాయిచేసుకొని ఏం జరుగు తుందో చూడాలి.

ముత్తేలమ్మ మెదడులో సవాలక్ష ఆలోచనలు.

ముత్తేలమ్మ హృదయంపై కోటానుకోట్ల సమ్మెట పోట్లు.

ముత్తేలమ్మ కళ్ళనుండి ధారాపాతంగా కన్నీటి బిందువులు.

గుంపు కొంచెం పలచబడింది, మోటర్లు స్కూటర్లు....వేటిదారిన అవి పోతున్నాయి. పదోపరకో మిగిలారు, ఇప్పుడు ముత్తేలమ్మకి జనం మధ్య పాపడు స్పష్టంగా కనిపిస్తున్నాడు. దగ్గరకెళ్ళి

గుంపులో తనూ నిల్చుందామనుకుంది. కాని ఎవరైనా పోలికలు గుర్తిస్తే?.... ఇంకేమైనా వుందా? సిటీ బస్ స్టాప్‌లో నిల్చుని తదేకంగా పాపడి వైపే చూస్తోంది ముత్తేలమ్మ.

"నెంబర్ టెన్ ఎక్కవేటీ?" ఇంత వరకు వెనకనే కాచుకూర్చున్న రోడ్ సైడ్ రోమియో బస్సెక్కుతూ హెచ్చరించాడు ముత్తేల్ని.

'తూ! సచ్చినోడా' వినిపించీ వినిపించనట్టుగా అని ముఖం తిప్పేసుకుంది.

'ఆడది కనిపిస్తే సాలు యేం పొయ్యే కాలమో యెనకాలే పడతారు యెదవలు!'

అతగాడు బస్సెక్కిపోవడంతో ముత్తేలమ్మ మనసు కాస్త కుదుటబడింది. ఆ బిడ్డ వైపే రెప్పవేయకుండా చూస్తోంది. ఆ పదిమంది కూడా లేరిప్పుడు. ఎవరి ముట్టుకు వాళ్ళు వెళ్లిపోతున్నారు. ఈసారి ఏదో చిన్న కారాగింది.

ముత్తేలమ్మ హృదయంలో ఆశలు చిగిర్చాయి. కళ్లు ఆనందంతో మిల-మిలా మెరిశాయి. ఆతృతతో అటే చూస్తోంది. ఆయమ్మ తప్పకుండా తీసికెళ్తాది.

చిన్న కారులోంచి దిగిన ఆరిందాని చూపి పాపడు 'కేర్' మన్నాడు. ఓ సారి ఎగాదిగా చూసి ఓ రూపాయి కాగితం చేతిలో పెట్టి కారెక్కింది.

ముత్తేలమ్మ ఆశల్ని నేలమట్టం చేసి కారు ముందుకు దూసుకుపోయింది. పొత్తిళ్ళలో పాపాయికేం తెలుసు రూపాయి విలువ?—గుక్కపట్టి యేడుపు. ముత్తేలమ్మ హృదయంలో విచ్చుకత్తులు గుచ్చుకుంటున్నాయి.

ఏడుస్తున్న బాబు ఒక్కసారిగా ఊరుకొన్నాడు. చూళ్ళేక కళ్ళు మూసుకున్న ముత్తేలమ్మ అటువైపు చూసింది. ఎవరో బిచ్చగత్తె....అవును, బిచ్చగత్తె బాబును గుండెల కదుముకొంది. ముష్టిదాని చేతుల్లో పాపడు ..పాపడినోట్లో సగం అచ్చానాడిత మైన ముష్టిదాని ముంతల్లాంటి రొమ్ములు.

'తనకంటె ముష్టిదే నయం!"

అత్యాస ఒక్కోసారి మమతల్ని కూకటివేళ్ళతో సహా పెళ్ళగిస్తుంది.

జమీందారు అవుతాడనుకొన్న పసివాడు కళ్లులేని కబోది అయిన నాడు 'అత్యాస' స్థానం ఏమిటీ! ?

ముత్తేలమ్మ గుండెల్లో గుబగుబలు.... బిచ్చగత్తె పాపణ్ని తీసుకుపోదుగదా! తీసుకుపోతే తన ప్రయత్నమంతా వృధా! అలా జరిగితే ఏమైనా సరే తను వెళ్ళి పాపణ్ని లాక్కోవాలి. అది ఇవ్వనంటే తన కొడుకేనని ఎలా దబాయించడం? పోనీ తృణమో పణమో దానికి ముట్టజెప్పి పాపణ్ణి దక్కించుకోవాలి.

'అమ్మయ్య! పాపణ్ణి పందేసి యెల్లి పోతున్నది ముట్టది.''

ఈసారి ఎవరో చదువు కుంటున్న అమ్మాయి ఆగి చూస్తోంది. 'ఇలాంటమ్మ తీసికెళ్తే బాబు కలక్టరవుతాడు!.

స్కూటరు మీద వచ్చి ఆగన బోయ్ ఫ్రెండ్ ఆ అమ్మాయినెక్కించుకొని వెళ్ళిపోతున్న వాళ్ళేదో ఇంగ్లీషులో మాట్లాడు కుంటున్నారు.

'ఏటి సెపుకున్నా యే వొరుగుద్ది!'

క్షణక్షణానికీ ఆశ సన్నగిలి పోతోంది. దబ్బున్న వాళ్ళంతా ఆగి చూసి వెళ్ళి పోతున్నారు.

ది గ్రేట్ లీడర్స్

క్రొత్తగా వచ్చిన డాక్టరు మెంటల్ హాస్పిటల్‌లోని పేషంట్లని పరీక్షిస్తున్నాడు.

''నీ పేరు అప్పారావు కదూ?'' ఒక పేషంటుని ప్రశ్నించాడు డాక్టర్.

''సారీ... నేను జవహర్‌లాల్ నెహ్రూని.'' ధీమాగా సమాధానం యిచ్చాడు అప్పారావు.

''ఎలా నమ్మటం?'' నవ్వుతూ అడిగాడు డాక్టర్.

''కావాలంటే కృశ్చేవ్‌ని అడగండి.''

''సారీ... అతనెవరో నాకు తెలియదు.'' ప్రక్కనే వున్న మరో పేషంట్ సమాధానం యిచ్చాడు.


''చూడండి నెహ్రూ, కృశ్చేవ్ గార్లూ దేశంగాని దేశంలో మనం ఇలా తలవంచే కంటే మన మన దేశాలు వెళ్ళిపోవటం ఎంతయినా మంచిది. నేను మా దేశం వెళ్ళిపోతున్నా...'' అంటూనే ఆ ప్రక్కనే వున్న మరో పేషంట్ జారుకుంటున్నాడు.

''అతనెవరూ?'' అర్థంకాక అడిగాడు డాక్టర్.

''ఆయనప్పుడప్పుడూ తనే కెనడీ అంటుంటాడు లెండి'' ప్రక్కనే వున్న కాంపౌండరు అన్నాడు.

డాక్టర్‌కు ఎందుకో అనుమానం వచ్చింది. ''నువ్వెవరు?'' కాంపౌండరును అడిగాడు.

''నేను లాల్‌బహాదూర్ శాస్త్రినిలెండి.''



'ఎవరిక్కావాలి?'

గ్లాస్కో పంచెలు, నారోకట్ పాంట్లు సూటులు.... లంగాలు, షర్వాలు, ఖరీదైన చీరలు....ఇంకా చిరిగిన చీరలు, నలిగిన లుంగీలు, నగ్నంగా కనిపిస్తున్న క్రీగాళ్ళు వస్తున్నాయి, ఆగుతున్నాయి —పోతున్నాయి.

ముత్తేలమ్మ గుండెల్లో మబ్బులు.... ఉరుములు.... మెరుపులు....హోరు మనే గాలి.

అందమైన ఆడవాళ్ళ కాళ్ళు చూసినా, ఖరీదైన బూట్లు చూసినా ముత్తేలమ్మలో ఆశ వర్షంలో పచ్చికలా మెరుస్తోంది.... కట్లతోను, గాయాలతోను వికృతంగా వున్న పాదాలు చేరువేతున్నప్పుడు ముత్తేలమ్మలో భయం వధ్యశాలలో పశువులా అరుస్తోంది.

ఇంతలో ఎవరో బిచ్చగాడు దగ్గిరగా వచ్చాడు. ఇంకెవరూ లేరు. బిచ్చగాడు కుర్రాణ్ణి పరీక్షగా చూస్తున్నాడు.... మోకాళ్ళ మీద కూర్చున్నాడు. బాబు పొత్తిగుడ్డల్లో నలుగురూ వేసినవి తీసుకోడానికేమోనని ఆత్రంగా గమనిస్తోంది.

'అయ్యో!, చేతుల్లోకి తీసుకుంటున్నాడు సచ్చినోడు!'

ముత్తేలమ్మకి ఒక్కసారి పరుగెత్తుకెళ్ళి ఆ బిచ్చిగాడి పీక నులిమి చంపాలనిపించింది. వాడి వంటిమీదా కట్లు కట్టమీద ఎర్రటి మరకలు....మాసినగడ్డం చేతిలో

క్ర్ర.... చూడ్డానికి అసహ్యంగా వున్నాడు. వాడు తీసుకెళ్ళి ఏం చేసుకుంటాడు గనుక!

'అయ్యో! తీసుకు పోతున్నాడు ముద నష్టపోడు'

బిచ్చగాడు కుర్రాణ్ణి తీసుకొని వడి వడిగా నడుస్తున్నాడు. అడ్డుపనే వాళ్ళే వరూ లేరు. ఒకళ్ళిద్దరు చూపినా పోసీలే కలో గెంజో కాచి పోస్తాడనుకున్నారు. వెళ్తున్న బిచ్చగాడివంక కళ్ళప్పగించి చూస్తోంది ముత్తేలమ్మ.

బిచ్చగాడు కనుమరుగవుతున్నాడు ముత్తేలమ్మ ఒళ్ళెల్లా వణికి పోతుంది. బాబు జీవితం అధోగతి పాలవుతుందనే ఆవేదన. చేజేతులా చేసుకున్న దానికి పశ్చాత్తాపం.... అడుక్కునే వెధవ బిడ్డని తీసుకు పోతున్నందుకు కసి వాణ్నేదో చెయ్యాలి. ఏం చేద్దామన్నా చెయ్యలేని నిస్సహాయమైన స్థితిలో ముత్తేలమ్మ—ఆ పాపడి కన్నతల్లి!

'ఆ యెదవకూడా పిల్లలు కావాలా!'

ఏమైనా సరే పిల్లాణ్ణి తీసుకెళ్ళ నియ్య దానికి వీల్లేదు కాని ఎలా! కావాలని తీసు కెళ్లేవాడు తిరిగివ్వమంటే ఇస్తాడా? పోనీ వాడిచేతుల్లో బిడ్డని లాక్కొని పరిగెడితే? పోలీసులు పట్టుకుంటారు నేరం బయట పడుతుంది. బతిమాలి ఏదైనా ముట్ట జెపితే....?

ఏదైనా సెయ్యాల బిడ్డణ్ని దక్కించు కోవాల'

యముడి వెంట సావిత్రిలా బిచ్చగా న్ననుసరించింది ముత్తేలమ్మ. సందులూ గొందులూ తిరిగారు గనుక దూరం తెలీ లేదు గాని రెండు మైళ్ళైనా వుంటుందను కొంది. ఓ చెట్టు పక్కనే ఆనుకొని వేసిన గుడిసెలోకి వెళ్ళిపోయాడు పాపడితో సహా బిచ్చగాడు దూరంగా నాలుగైదు గుడిసెలు తప్పిస్తే అంతగా మనుష్య సంచారం ఉన్నట్టులేదు. వెళ్ళే వాణ్ని గట్టిగా పిలుద్దామని పించింది కాని గొంతు పెగల్లేదు. తిరిగి వస్తాడేమోనని గుడిసెకు దూరంగా నిల్చుని చూస్తోంది కాని ఎంత సేపటికి బిచ్చగాడు బయటికి రావడంలేదు. విసుగెత్తిన ముత్తేలమ్మకి గుడిసెలోకి వెల్దామని పించింది. కాని ఘట్టిగా పాతికదాటని తను లోపల కెళ్తే ఏం ప్రమాదాన్నెదుర్కొవలసి వస్తుందో సాహసించి అడుగు ముందుకు వెయ్య లేక పోయింది.

అప్పట్లో వాడు రాడని నిర్ణయించు కొంది కడుపులో ఆకలి మంట శోకం —ఇంక నిలబడి లేక పోయింది. ఏం చెయ్యాలనో తేల్చుకోలేని అయోమయ మైన స్థితిలో వెను దిరిగింది.

ఆమె ఆలోచనలు ఇంటి మీదకు.... ఇంటి మీద నుండి గతంలోకి....

* * *

"ముత్తేలూ, ఇయ్యేల పని మానే త్తానే" అన్నాడు సీతారావుడు.

"ఏటిశేషం!" అంది ముత్తేలు కను బొమ లేగరేసి.

"విన్నాదిలి పొద్దుకే యెల్ల బుద్దెయ్యదం లేదే" విప్పారిన కళ్ళలోకి అదే పనిగా చూస్తున్నాడు.

"ఎల్లకపోతే బువ్వెలా గొత్తాది మావాఁ" అంటూ భుజం మీద చెయ్యేసింది.

"ఇయ్యాల ఓనరు డబ్బులిత్తాడుగా. రాత్రోచ్చేటపుడు ఇన్ని మల్లెపూలు తెచ్చి...." అతని నోటిని ఓ మృదువైన హస్తం మూసింది. నవ్వుతూ చొక్కా వేసుకొని బయటకు నడిచాడు సీతారావుడు.

"మావకి తనంటే బోల్డ ప్రేమ' అని మురిసిపోయింది ముత్తేలు. అవును మరి అంత మోజు గనుకే ఇంట్లో వాళ్ళకి ముత్తేలమ్మని చేసుకోవడం ఇష్టం లేక పోయినా వేరే కాపురం పెట్టి రెక్కల కష్టం మీద పోషిస్తున్నాడు ఇద్దరు మగ పిల్లలున్నారు ఈ పారి ఆడపిల్ల పుడితే పుట్టకుండా చేయించు కుందామని ...

సాయంకాలం ముస్తాబై కూర్చున్న ముత్తేలు చేపుల్లో పిడుగులాంటి వార్త' సీతారావుడు లారీతో చెట్టుగుద్దేసి అక్కడే ప్రాణాలోగ్గేశాడట! లారి ఓనరు దహన సంస్కారాలు మాత్రం చేయించి 'తాగి లారీ లెక్కితే బాపకేం చేస్తా'రని తప్పించు కున్నాడు. సీతారావుకు తాలూకు

బంధువులా కర్మ అయ్యేవరకు వుండి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. పోతూ పోతూ 'రాజులాంటి వాణ్ని దాని యేదా న్నెట్టుకుంది. అని అక్షితలు వేసి మరీ వెళ్ళారు. ఇద్దరు పిల్లలు మల్లా నీ ల్లోను ఉంది, ఎలా నెగ్గు కొ్తాదో యేవిటో' అని సానుభూతి చూపించిన ఇరుగు పొరుగు మూడో బిడ్డ భూమ్మీద పడే వరకు ఆదుకున్నారు.

తనంతట తను లేచి తిరిగేటప్పటికి ఏపూటకాపూట తడుముకోవలసిన అవసరం యేర్పడింది. పెద్ద కుర్రాణ్ణి నౌకరీ చేయిస్తోంది. రెండో వాడింగా చిన్నాడు. మళ్ళీ ఈ పసికందు నెలా పెంచడమనేది సమస్యగా తయారయింది వయస్సులో వున్న తనని చూసి వల్లో వేసుకుందామనుకునే వాళ్ళు సాయం చేస్తామని అడుగుతూనే ఉన్నారు తను మాత్రం రావుడు లేని బతుకెందు కను కొంది కాని లోకజ్ఞానం తెలీని పసికందుల కోసం చితిక్కా తప్పడం లేదు!


హఠాత్తుగా ఓ రోజు ఆ వూరంతా ఓ వార్త పొక్కింది—కొత్తగా ఆ వూరొచ్చిన డాక్టరు అప్పల నరసమ్మ నాలుగో కొడుకని! తిరునాళ్ళలో తప్పిపోయిన కొడుకు కనిపించక పోతే కడివెడు పిల్లలున్న అప్పల నరసమ్మ సరి పెట్టుకొని యింటి కొచ్చేసింది. మళ్ళీ ఇన్నాళ్ళకు అదృష్ట వశాత్తు డాక్టరు చేతి మీద పచ్చ బొట్టు చూసి అప్పల నరసమ్మ ఆనవాలు పట్టింది. తప్పిపోయిన కుర్రాణ్నెవరో ధనవంతులు పెంచుకొంటే ఇంత వాడయ్యాడట! డాక్టరు నిజం తెలుసుకొని ఇప్పుడు అప్పల నరసమ్మ కుటుంబానికి సాయం చేస్తున్నాడు....

ఈ సంగతి తెలిసిన ముత్తెలమ్మ మెదడులో మెరుపులాంటి ఆలోచన—ఈ పసికందుని ఊరికి దూరంగా వున్న పట్నంలో రోడ్డుమీద వదిలేస్తే ..డబ్బున్న వాళ్ళెవరైనా తీసుకెళ్ళి పెంచుకుంటే.... బాగా చదివి పెద్ద ఉద్యోగస్థుడవుతాడు.... అంతకంటె తనకేం కావాలి!

'పాపడు డబ్బున్న మారాజు కావాల..

* * *

ఆలోచిస్తూ ఎక్కడ కొచ్చిందో తనకే తెలీదుగాని ఎదురుగా 'టీ' దుకాణం కని పిస్తోంది. పని పైసలు పెట్టి ఓ టీ తాగి కొంచెం స్థిమితపడింది. ఏం చెయ్యాలో తేల్చుకోలేని సంకిగ్ధమైన అవస్థ. దిద్దుకో లేని పొరపాటు జరిగిపోయింది. ఇపుడు వట్టి చేతుల్తో ఇంటికెళ్తే పిల్లలకూ ఇరుగు పొరుగువాళ్ళకీ ఏం జవాబు చెప్పాలి? పాపణ్ణెవరో జమీందారుగారు పెంచుకుంటా మని తీసుకెళ్ళారని చెప్పాలా?—వాళ్ళను మోసపుచ్చినా తను అనుక్షణం బాబు గుర్తుకొస్తుంటే ఆ రంపపు కోత భరించ గలదా? హృదయాన్ని పాషాణంగా మార్చు కుని ఈ పనికి సిద్ధపడింది. ఇప్పుడు పాషాణం హృదయమైపోతోంది.



"ఏమైనా సరే. బిడ్డణ్ని తెచ్చుకోవాల— లేదా నేనైనా సావాల."

ముత్తేలమ్మ మళ్ళీ బిచ్చగాడి గుడిసెకి పరిగెత్తింది. ఆ పరుగులో చొరవ... తెగింపు.... ధైర్యం....

ఇంతకు ముందుకంటె వేగంగా ఆ ప్రదేశం చేరుకొంది. అదృష్టం! ... గుడిసె లోంచి బిచ్చగాడు బయటకు వెళ్తున్నాడు. ఆశ్చర్యం!—అతగాడికి ఇంతకు మునుపు చూసినట్టు కట్లు, గాయాలు లేవు!

బిచ్చగాణ్ని పది గజాలు దూరంగా వెళ్ళనిచ్చి గుడిసె ద్వారంలో అడుగు పెట్టింది. ఆ అడుగులో తెలివి.... సాహసం.... ఆత్రుత....

'ఆడు రాకుండా పిల్లగాడితో లగెత్తాల'

లోపలకు తొంగి చూసింది. ఎవ్వరూ లేరు. నులక మంచంమీద పక్కకు వత్తిగిలి పడుకున్న పాపడు చీకటిలో అస్పష్టంగా కనిపిస్తున్నాడు. పట్టలు తెంచుకున్న మాతృత్వంతో నాలుగంగలలో మంచం దగ్గరకు చేరింది.

బాబును భుజంమీద వేసుకొని మెడను ముద్దులతో నింపేసింది.

ఆమె హృదయంలో మమత.... దృష్టి ఆనందం....! ఆ సంతోషంలో బాబును రెండు చేతుల్తో పైకెత్తింది— నిద్రపోతున్నాడనుకుంటున్న పాపడి రెండు కళ్ళు స్థానంలో గుడ్లు పెరికేసిన ఎర్రటి రెండు గుంటలు....!

'పాపం పసివాడు' పాటల పోటీ

రూ 2000ల బహుమతులు

రెండు ప్రథమ బహుమతులు	రూ.	150-00 నగదు		300-00
రెండు ద్వితీయ బహుమతులు	రూ	85-00 నగదు		170-00
36 తదుపరి బహుమతులు	రూ	42-00 విలువవి		1512-00
			మొత్తం	1982-00

సినిమా సంగీత ప్రియులకు.

త్వరలో శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్‌వారి "పాపం పసివాడు" విడుదల కానున్నది. ఆ చిత్రంలో అయిదు పాటలున్నవి.

1. లక్ష్మీం క్షీర సముద్రరాజతనయాం 2. ఓ బాబూ మా బాబూ
3. అమ్మా చూడాలి 4. అయ్యో పసివాడా 5. మంచి యన్నదే కానరాదు

ఈ అయిదు పాటలు వినండి. అందులో మీకు నచ్చిన ఒక పాటను యెన్నుకొని ఆ పాట సన్నివేశం చిత్రంలో యెలా వుంటుందో యే పాత్రపై యెలా చిత్రీకరింపబడి వుంటుందో ఊహించి వ్రాయండి. ఈ చిత్ర నిర్మాణ వ్యవహర్త-దర్శకులైన శ్రీ ఎ పూర్ణచంద్రరావు, శ్రీ వి రామచంద్రరావు దృష్టిలో ఎవరి ఊహాలు చిత్రంలో సన్నివేశానికి అతి దగ్గరగా వుంటవో వారికి బహుమతులు.

మీ పత్రాలు "పాపం పసివాడు" చిత్రం విడుదల నాటికి ముందురోజునే దిగువ విలాసానికి చేరాలి. ప్రవేశ రుసుము లేదు. అయితే నగదు బహుమతులకు అర్హులు కావటానికి ఈ చిత్రంలో ఒక్క రికార్డయినా కొన్నట్టు ఆ రికార్డు నంబరు నమోదయిన అథరైజ్డు రికార్డు డీలరు బిల్లు జతపరచాలి.

ఇన్‌లాండ్ కవరులో ఒకే ప్రక్క వ్రాయాలి కవరుపైన "పాపం పసివాడు" పోటీ అని వుండాలి. వెనుక మీ పూర్తిపేరు, విలాసం యివ్వాలి. బిల్లు జతపరిస్తే కవరుపై అదనంగా మరొక అయిదు పైసాల స్టాంపు అతికించాలి.

ఈ పోటీలో యెవరయినా యెన్ని మార్లయినా పాల్గొనవచ్చు.

పత్రాలు పంపవలసిన విలాసం. ఇట్లు

V. A. K. RANGARAO వి. ఎ. కె. రంగారావు
1, PYCROFT'S GARDENS, MADRAS 6.

కబుర్లు

చలసాని ప్రసాదరావు

ఈ పుణ్యభూమిలో ఎందరెందరో మహా నాయకులు పుట్టి, ఎన్నెన్ని అధికార పీఠలెక్కి, ఎందరెందరో అమాయక ప్రజలచేత ఎంతెంతగా పూజలు చేయించుకున్నా ఎన్ని శిలా విగ్రహాలు పాతించుకున్నా, నాటికీ నేటికీ మన పర్మనెంట్ హీరో దేవుడే

సదరు ఎవర్ గ్రీన్ హీరో ముందు అనేకానేక రాజకీయ తంత్రములందు, యుద్ధములందు టోపీలు వేయుటయందు ఆరితేరిన మహానుభావులు సైతం టెంపరరీ హీరోలేనని. అందునా సైడుహీరోలు మాత్రమేనని మరోసారి రుజువయింది.

దేవుడు ఎటూ ఉండున్నాడనేది మరచిపోయి తాముదేవుళ్ళలా ఫోజులు పెడతూ ప్రజలచేత పూజలూ, భజనలూ చేయించుకో జూసినయా దేవుళ్లే మధ్య ఎక్కువయిపోయారు. దెయ్యాలు కూడా వేష ధరిస్తు అవతారాలెత్తిస్తూ దేవుళ్ళలా మేకప్ చేసుకుని దేశం మీదపడి బ్రతికే జూడటం ఈ యుగలక్షణంలా వుంది.

టాంపు సీలింగులు. అదనీ ఇదనీ అదరగొట్టేసి అమాయక ప్రజలచేత హారతులు పట్టించుకోపోయిన రాజకీయవేత్తల్ని నెల తిరగకుండానే తెరవెనక్కి తోసేసి. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా వార్తల్ని అన్నింటినీ ఆక్రమించేశారు దేవుడు

ఫలితంగా ప్రస్తుతం మన అపర దేవుళ్ళంతా సీలింగ్ సింహగర్జనల్ని పెండింగు ఫైళ్ళలో దాచేసి అసలు దేవుడి ముందు సాష్టాంగాలు పడి "కావవే వరదా! కరుణింపవే వర్షం" అంటూ గుంజీలు తీస్తూండటం దైవభక్తులెల్లరూ హర్షించదగిన పరిణామం.

దేశంలోని పెత్తందార్లలో ప్రధాని ఫస్టా లేక ప్రెసిడెంటా? అని ఆ మధ్య కొందరు రాజ్యాంగ నిపుణులు చర్చోపచర్చలు సాగించారు ఆ కీలకాంశ సమస్య బంధం ఒక పట్టాన తెగలేదుగాని మొత్తం మీద ఆ ఇద్దర్నీ మించిన పెత్తందారు దేవుడేనని మాత్రం ప్రస్తుతం రుజువయిపోయింది.

ఈ అద్భుత సత్యాన్ని అనుభవపూర్వకంగా గ్రహించి ధన్యులైన ఘనమైన

ఏలిన వారు ఈ నాడు మన రాష్ట్రం లోని అనావృష్టికి, రానున్న కరువుకు కారకుడు సదరు సర్వాంతర్యామియే కారకుడని తేల్చి పారేశారు. అందుకనుగుణంగా కొన్ని చరిత్రాత్మక, శాస్త్రోక్త, వేదవిహిత నిర్ణయాలు కూడా చేసేశారు.

వర్షాలకోసం దేవుడికి స్పెషల్ విజ్ఞప్తులూ, ప్రార్థనలూ, నైవేద్యాలు చేయించండని దేవాలయాలకు తాఖీదులు వెళ్ళాయట. దేవాలయాల్ని జాతీయం చేసి ప్రభుత్వపెత్తనం క్రిందికి తేవటంవల్ల మంత్రులకు పట్టు చీరలూ, పంచలూ బహుమతులుగా దొరకటం ఐనా మరేం జరగటం లేదనే వీరభక్తులు ఈ సత్యాన్ని గుర్తించాలి. దేవుడినీ దేవాలయాల్నీ ప్రజాసేవకై ఎలా వాడుకోవాలో పాలకులకు బాగానే తెలుసు.

అలాగే వర్షాలకోసం భజనలూ, క్రతువులూ, యజ్ఞాలూ గట్రా చేసో లేదా చేయదలచిన పైవెట్రి భజన సంఘాలకు స్పెషల్‌గా ఆర్థిక సహాయంచేసే స్కీం ఒకటి ఆలోచనలో ఉందట కూడా.

జేబుకొక సాహిత్య భజన సంఘాన్ని స్థాపించుకుని యథావిధిగా సాహిత్య సేవ, ఉదర పోషణ చేసుకుంటున్న దేశభక్తవులకిదొక సదవకాశం. గ్రాంట్లు తెచ్చుకుని గవర్నమెంట్ డబ్బుతో దేవుడికి పెళ్ళిళ్లూ, వరుణ దేవుడికి పునస్సంధానాలూ చేయించి ఆటు పుణ్యం, యిటు నాలుగు డబ్బులూ కూడా వెనకేసుకోవచ్చు.

"గ్రీన్ రివల్యూషన్ తెచ్చాం. అది చేశాం! ఇది చేస్తాం! దేశం భయంకరంగా బాగుపడిపోతోంది. చూసుకోండి మా సోషలిస్టు తడాఖా!" అని నిత్యం గర్జించే నాయకులకు ఇదొక గుణపాఠం. దేశం బాగుపడ్డా, భంగపడ్డా అంతా వాడి లీలే. వీళ్ళందరూ నిమిత్తమాత్రులలేనని దేవుడే స్వయంగా రంగంలోకి దిగి రుజు చేస్తున్నాడు.

ఆ మధ్య ఓ ఆంగ్ల దిన పత్రికలో ఓ జ్యోతిష్యులవారి అడ్వర్టయిజ్‌మెంటులో భాగంగా ఓ కేంద్రమంత్రిగారి సర్టిఫికేట్ వచ్చింది. "ఫలానా జ్యోతిషులవారు నాకు మంత్రించి దయ చేయించిన తాయెత్తు అద్భుతంగా పనిచేసింది. అమోఘమైన ఫలితాలిచ్చింది. సదరు తాయెత్తుల కంపెనీ వర్ధిల్లుగాక" అనిదాని సారాంశం.

ఎంత నాస్తిక దుర్మార్గుడైనా ఈ సర్టిఫికేట్‌ను కాదనలేడు ఇదీ మామూలు రాజకీయ దబాయింపేనని దబాయించలేడు సదరు తాయెత్తు కిసింగర్ మహాశయుని రాయబారంలా పకడ్బందీగా పని చేసిందనేందుకు దాన్ని ధరించిన పెద్ద మనిషి కేంద్రంలో మంత్రిగా ఉండటం కన్నా మరేం సాక్ష్యం కావాలి? మంత్రి అవటం—అందునా కేంద్రంలో మంత్రిగావటంఅంటే మాటలా! ప్రమాణ స్వీకారం చేయగానే గవర్నమెంట్ ఖర్చుతో

అర్జంటుగా ప్లేనెక్కి తిరుపతివెళ్ళి గుండు కొట్టేందుకు రావాల్సిందే గదా!

అయితే. అంత గొప్ప తాయెత్తుల కంపెనీ దేవుడికి మన మంత్రిగారి సర్టిఫికేట్‌తో ప్రచారం చేసుకోవాల్సిన ఖర్మేమిటని కొందరు అమాయకులకు అనుమానం కలగవచ్చు. అదొక దేవ రహస్యం. ఎంతటి వాడికీ కొందరు హంగుదార్లు ఉండకతప్పదు. ఊళ్ళు పంచేసుకోవటంలో తెలివైన వాళ్ళెప్పుడూ పట్టు విడుపులు ప్రదర్శిస్తూనే ఉంటారు. లేకుంటే ఇద్దరూ జాయింటుగా బజార్న పడటం. తర్వాత జైలుకు వెంచేయటం ఖాయం. సింహానిది ఎప్పుడూ ముందు భోజనమే. మిగిలిన బొమికెల్ నక్కలు పంతు. తెలివైన నక్కలు సింహాలచేత బొమికెలే నమిలించి అసలు అంతా తామే మింగేస్తాయను కోండి. అది వేరే సంగతి.

అందుకే దేవుడికన్నా ముందు పూజారిని మంచి చేసుకోమన్నారు అనుభవజ్ఞులు. పూజారి దయలేకపోతే దేవుడు లేనట్టే లెక్క. ఇచ్చినా ఆ వరందక్కదు. పూజారుల్ని తోడుదొంగతోగానీ. సింహం ప్రక్క నక్కతో గానీ పోల్చటం ఘోరమైన అపచారం. దేవుడికన్నా వాళ్ళకే మహిమలు ఎక్కువ.

తమిళనాడులో ఓ సుప్రసిద్ధ దేవుడికి మాన్యంగా అక్షరాలా అరవై వేల ఎకరా లుండేవి. ఆ మధ్య ఓ విచారణ కమిటీ వాళ్లు వెళ్ళి చూస్తే అందులో అక్షరాలా సలభై వేల ఎకరాలు భూనభోంత రాళాల్లో ఎక్కడా కనిపించలేదట ఇదంతాపూజార్ల మాహాత్మ్యమేనని ఆ కమిటీ పెద్దలు తేల్చేశారు. ఈపూజార్ల మహాత్యాలముందు మన పాలకులు చేసే గారడీలు ఓ లెక్క-లోవా!

మరి దేవుడు చూస్తూ ఏం చేస్తున్నా డంటారా! ఆయన గారికీ అల్పవిషయాలు పట్టించుకునే తీరికెక్కడ! అల వైకుంఠ పురిలో నగరిలో నా మూల అమ్మవారితో మూడు ముక్కలాటో ఏదో ఆడుకుం టూనో, లేక రేడియోలో క్రికెట్ కామెం టరీ వింటూనో కాలక్షేపం చేస్తుంటారు. మనం బుద్ధి తెచ్చుకుని భజనలు మొదలె డితే అప్పుడు తేలికగా శంఖచక్ర గదా దులు ధరించి గోచీ బిగించి రంగంలోకి దిగాల్సిందే. ఈ దేవ రహస్యం తెలుసు గనుకనే మన నాయకులు యెన్ని సెక్యు లర్ కబుర్లూ, సోషలిస్టు జపాలూ వల్లిం చినా శంఖు స్థాపనలూ, ప్రారంభోత్స వాలూ అన్నీ వేదోక్తంగానే జరిపేస్తారు. చెప్పే ప్రతిదీ ఆచరించి తీరాలని యెక్క డుంది చెప్పండి. అదీగాక తర్వాత్తర్వాత ఆ శంఖు స్థాపన రాళ్ళు పాతినచోట రాళ్లు తప్ప మరేం కనపడకపోతే అంతా ఆ దేవుడి మీదే తోసి పారేయవచ్చు.

వసిష్టుల వారంతటి పుణ్య పురుషులు పెట్టిన రాములవారి పట్టాభిషేక ముహూర్తమే సాద్‌సాంగ్‌తో పూర్తయినపుడు మా ముహూర్తాలూ, శంఖు స్థాపనలూ ఓ లెక్కలోవా అని దబాయించగలరు ఏ మాత్రం గుర్తున్న వారైనా!

అవును మరి! ప్రతి దానికీ ఏదో ఒక దొడ్డిదారి తెరిచి ఉండటం మన పవిత్ర భారతీయ వేదాంతాల ప్రత్యేకత. జ్యోతి ష్యానికి పార్వతీ దేవి శాపం కూడా ఈ బాపతే. ఈ కిటుకు బాగా తెలుసుగను కనే దేవుళ్ళ కన్న పూజార్లే హాయిగా బ్రతుకుతున్నారు. వీళ్ళ అవసరం సోష లిస్టు సమాజానికి ఎంత అవసరమో మన తెలివైన పాలకులు గ్రహించారు గను కనే సాంస్కృత కళాశాలలూ, యూనివర్శి టీలూ వేసి పారేస్తున్నారు అర్జంటుగా.

దేవుడు దయామయుడంటారు నిజమే. పూజార్లు బండగా, మొండిగా వసూళ్లుచేసి హుండీలు నింపుతూంటే దయగాఉండకేం చేస్తారు. ఆ మధ్య ఓ దైవద్రోహి పూజార్ల నుద్దేశించి "వీళ్ళు పండాలు కాదు ప్రభో! పిండారీలు" అని వాపోయాడు. తప్పు! తప్పు! వాళ్ళను అలా నిందించ కూడదు. వాళ్ళు కేవలం దేవుడిఏజంట్లు. మనకేమన్నా ఇబ్బందంటూ ఉంటే డైరె క్టుగా దేవుడికి అప్పీల్ చేసుకోవాల్సిందే!

అందుకనే కరువులొచ్చినా, కాటకాలొ చ్చినా మన అధికారులు గుళ్లూడగొట్టో.

గోచీలు వేలాంవేసో అయినా సరే. పన్నులు మాత్రం వసూలు చేసేస్తారు. పూజార్ల కన్నా స్ట్రిక్టుగా అప్పుడు జనం గజేంద్రుడిలా అయ్యవారికి మొరపెట్టుకోవాలి. ''కావరా మంత్రీ! కరుణించులోను! అనుగ్రహించు శిస్తురెమిషన్'' అంటూ రైటు కాన్ట్రాక్ట్ ద్వారా రాజధానీ నగరంబులో నా వైపు ఏర్‌కండిషన్డు భవనంలో గల మంత్రిగారికి అప్పీల్ చేసుకోవాలి.

అప్పుడు దిగుతారు మంత్రులు.

''ఏమిటీ' వర్షాల్లేవా! వర్షాలు లేకుంటే మాత్రం పంట లెందుకు పండవు? ఇంత ఘోరం జరుగుతూంటే దేవుడేం చేస్తున్నట్లు? సరేమేం దేవుడికి రాయబారం పంపుతాం. మీ కొంపలు వేలాం వేయక పోతే దేవుడికి పూజలు చేయించటానికి ఖర్చులెలా? యజ్ఞాల్లోకి నెయ్యికావద్దా!'' అన్నట్లుగా మాట్లాడేసి అంతకు ముందు అధికార్లు వసూలు చేసిన అయిదు కోట్ల శిస్తులో అరలక్ష ఉదారంగా విరాళం ప్రకటించి దయచేస్తారు. ఆ తర్వాత బాధ్యత అంతా ఆ దేవుడిదే!

అంతా విని మా అప్పారావు గాడు అంటాడు గదా: ''అయితే గురూ? ఈ మధ్య తిరుపతిలో ఓ బ్రహ్మాండమైన యజ్ఞాం జరిపించారు గదా; వందలాది డబ్బాల నెయ్యీ, బస్తాల బియ్యం, లారీల కట్టెలూ, లక్షలాది రూపాయలూ దేవుడికి హోమం చేశారు గదా! మన సుహా నాయకులంతా వెళ్ళి లెంప లేసుకుని, గుంజీలు తీసి గుండు కొట్టించుకుని మరీ వచ్చారు గదా? మరి ఈ ఉపద్రవా లేమిటి? యజ్ఞఫలం ఎక్కడ?'' అని.

నాకు వళ్ళు మండుకొచ్చింది. మా అప్పారావుగాడికి ఈ మధ్య నక్సలైట్ బుద్ధులు వంటపడుతున్నట్లున్నాయి వీడికి బ్రెయిన్‌వాష్ చేసి బుద్ధిమంతుడిని చేయాల్సిందే!

అందుకని, కాస్త కోపం తగ్గించుకుని పూజారి పోజులో శఠగోప ముద్ర పట్టి ఇలా చెప్పాను.

''నాయనా! అప్పారావూ! నీ వింకా అమాయకుడవు! ఇవన్నీ దేవ రహస్యాలు! యజ్ఞఫలం ఎక్కడికీపోదు, మన దొడ్లోనే ఏ చింత చెట్టు మీదో కాపురం పెట్టే వుంటుంది. పార్వతీ దేవి శాపం ఉందిగదరా నాయనా! అది శమించగానే తపేమని వర్షాలు పడి తీయబా యి. అందాకా నీవు బ్రతికే ఉంటావులే! భయంలేదు! యజ్ఞఫలం అనుభవించి ధన్యుడవవుదువు గాని!'' అని.

''మీ సమర్ధన అమోఘం సార్! మీరు నిజంగా పూజారికాదగ్గరు!'' అన్నాడు వాడు!

ఎంతైనా నా శిష్యుడే గదండీ!


మనుషులు
మారాలి!
పి. వి. ఆర్. శివకుమార్



కథానాయకుడు మరణించాడు!....

అవును. తెలుగు తెరపై సాధారణంగా జరగని 'అకృత్యం' జరిగిపోయింది! హీరో తలపై బలమైన దేంతోనో మోది చంపేశారు విలన్ తాలూకు వ్యక్తులు. వర్షపు రాత్రి అది. లాంతరు స్తంభం డోముమీదుగా బొట్లుబొట్లుగా జారుతూ, దీపం వెలుగులో మిలమిల మెరుస్తున్న చినుకుల్ని 'క్లోజప్పు'లో చూపిస్తూ, 'ప్రకృతి కూడా ఈ విలయానికి విలపిస్తున్నదోహో ...' అని చాటి చెప్పాడు దర్శకుడు.

'చ్చొచ్చొచ్చొ....' 'ప్చ్..ప్చ్. ప్చ్..' 'అయ్యో....' లాటి పదజాలం కుంభ వృష్టిలా కురుస్తోంది ప్రేక్షకుల 'పెదాల' నుండి.

అంతకు ముందునుంచీ గూడా కష్టాలనే సమ్మోహనాస్త్రాల ద్వారా ప్రేక్షక హృదయాల్ని దోచుకుంటూనే వున్నాడు రచయిత!

కన్నీళ్ళతో తడిసిపోయిన రుమాళ్ళని గట్టిగా పిండుకుని, మళ్ళీ నాటకం సాగి స్తున్నారు నా ముందు సీట్లలోని ప్రజలు.

నా ఖర్మ! సినిమాల్లో యిలాటి విషాద ఘట్టాలకి చలించి, కన్నీరు కార్చే సున్నిత హృదయం నాకు లేదు! పైగా ఆ సమ యంలోనే మరోలాటి వూహాలతో నవ్వొ స్తుందిగూడా!

'ధన్‌మని .... వానలో, బురదలో. యిప్పుడైతే కూలిపోయాడుగానీ. యిదే హీరో—నిజ జీవితంలో అయితే—కిటికీ లోంచైనా సరే. వానజల్లు చూస్తే చాలు. జలుబు చేస్తుందని ఏర్‌కండిషన్డ్ రూము లోకి పారిపోయి కూర్చోడూ? అతగాడు... ఎండ కన్నెరుగని యీ సుకుమారుడు.... కార్మికుల కష్టాల్ని నటించి పారేయడమూ. ప్రేక్షకులంతా అదేదో నిజమేనన్నట్లు కన్నీళ్ళు కురిపించటమూనా! ...

పస్టాసైన నా కోటి విసుర్దావని ప్రక్క సీట్లోకి చూశాను. చూసీ, చూడటంతోనే వులిక్కిపడ్డాను!

నా శ్రీమతి.... నా శ్రీమతి సైతం.... వెక్కుతోంది! కర్చీఫ్‌తో కన్నీళ్లు తుడుచు కుంటోంది!

నా మతి మతిలో లేదు.

మా యిద్దరికీ పెళ్ళై ఏడాది మాత్రమే అయింది ఆమె కాపురానికి వచ్చి ఆర్నెల్లే అయింది. యీ ఆర్నెల్లలోనూ గూడా. యింతలా 'ఏడ్పించే' తెలుగు సినిమా చూడటం యిదే మొదలు. అంచాతే, నా కామె కూడా యిలా 'లీనమై'(?)పోతుం దని తెలీదు

ఇప్పుడేం చేయ్యాలో గూడా తెలీట లేదు. నా భార్య అలా కన్నీళ్లు తుడుచు కుంటుంటే, చూస్తూ మాత్రం కూర్చోలేక పోయాను. కొద్దిగా ఆమె మీదకు వంగి, మెల్లగా అన్నాను;

"లక్ష్మీ....ఏమిటిది మరీనూ? హీరో చచ్చిపోయాడనేనా యింత ఏడుపూనూ? ఛ ...ఛ....యిది సినిమా! అంతగా అయితే, మళ్ళీ సెకెండ్ షో కొచ్చి, వో పావుగంటసేపాహీరోని మళ్ళీ చూసి, వెళ్ళిపోదాం. అంతేగానీ అలాగేడవకు....

అయినా, చదువుకున్నదానివి, నువ్వు గూడా యిలా అసహ్యంగా....'' నా మాట పూర్తికానే లేదు, చురుక్కుమనేలా చూపింది శ్రీమతి నావైపు: ''మీ అంత హృదయస్థైర్యం లేదులెండి నాకు.అయినా. చదువుకున్నంత మాత్రాన హృదయం లేకుండా పోతుందా? జాలీ, దయా యివి లేకపోవటమూ వో గొప్పేనా?''

ఈ రెండు ముక్కలూ అనేసి, మళ్ళీ స్క్రీన్ వైపు తిరిగేసింది.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కావేదు

'సినిమాల్లో ఏడిస్తేనే హృదయమున్నట్లా? లేక, హృదయమున్నవాళ్ళంతా సినిమా హాల్లో ఏడ్చి తీరాలా?

తోటివాడు కష్టాల్లో వుంటే, కన్నీరు నింపటం స్పందించే హృదయ సహజం. కానీ, ఆ 'తెరవేలుపు' తోటివాడూ కాడు—నిజంగా కష్టాల్లోనూ లేడు ఇంకెందుకీ ఏడుపు? 'యీ జీవితమే మాయ ఏదీ నీది కాదు—నిజమూ కాదు' అని గీత చెబుతుంటే, తలలూపే వీళ్ళే, సినిమా అనేది కేవలం కల్పితమూ, క్షణికమూ అని తెల్సి, దానికోసం యింతలా దుఃఖిస్తున్నారంటే అది అజ్ఞానమా, లేక 'సునితత్వమా?' అది మనిషి బలహీనతకి చిహ్నమౌతుందిగానీ, సున్నిత మనస్తత్వానికి రద్పణమెలాగౌతుంది?'

నా ఆలోచనల్లో నేనుండగానే, సినిమా అయిపోయింది. జనగణమన వేశారు. జనమంతా దొంగలు తరుముతున్నట్లు పరుగులు మొదలుపెట్టారు. సరే, ఎలాగూ గేటో రష్‌గానే వుందికదా అని, ఆ గీతం నాలగు చరణాలూ (? త్తిరింపులు పోను మిగిలింది) వినేసి, బయటికి నడిచాము.

రిక్షాలో కూర్చున్నాం. ఇంకా గాంభీర్యం వదల్లేదు లక్ష్మిని. ఎలాగైనా, మాటల్లోకి దించాలని అన్నాను :

"అదేమిటి లక్ష్మీ, అంతలా ఏడ్చేశావ్ సినిమాలో?" ఒక్క క్షణం ఏం మాట్లాడలేదామె ఆ తర్వాత నెమ్మదిగా అంది:

"మీ కసలు బాధే అన్పించలేదా ఆ సినిమా చూస్తే!"

ఆమె కంఠంలో యింకా బరువు! తేలికపరుద్దామన్నట్టుగా అన్నాను: "బాధా? హా....హా....నవ్వొచ్చింది! యూఫోం బెడ్డుమీద శయనించే కథానాయకుడు, కాసు కోసమలా నేలకూలుతుంటే...."

"చాల్లే, ఆపండి, మీ దింత పాషాణ హృదయమని అనుకోలేదు, తోటిమనిషి కష్టాల్లో కరగని గుండె కూడా...."

"స్టాప్....స్టాప్, అది కేవలమూ సినిమా, అక్కడ నిజం కష్టాలు లేవు, కేవలం కల్పితం...."

మనుష్యులు మారాలి! ఎలా?
సినిమాలు చూసి కన్నీరు కార్చినంతమాత్రాన ఒరిజినాలిటీ మారుతుందా? మూడు గంటలు లేదా ఆ రాత్రంతా మాత్రమే!
తెల్లవారితే మామూలే!!

"అంటేః కష్టాలకి నిజమూ, అబద్ధమూ కూడానా? మన జీవితాల్ని కథగా వ్రాసి మలిచిన సినిమా కల్పితమెలా అవుతుంది? సినిమాలో అయితేమాత్రం కష్టం కష్టం కాదా? అలాగైతే, మీ గీతాకారుడి ప్రకారం, జీవితమూ క్షణ భంగురమేగా! ఒకో కష్టం అనుభవిస్తున్న కొద్దీ ఒకో పాపం హరించి, పుణ్యానికి చేరువౌతున్నాం—అని సంతోషించొచ్చుగా? ఏడవట మెందుకు? ఎవరు చేసుకున్న 'కర్మ' వారనుభవిస్తుంటే విచారం దేనికి? అదీ క్షణికమేగా?

సినిమా చూస్తున్నంతసేపూ కథలో లీనంకావాలి గానీ, తెరకి చిల్లులెన్నున్నాయో, దానిపై బల్లులెన్నున్నాయో లెక్కపెట్టటం కాదండీ! పాత్ర ధారుల నటనా నైపుణ్యం గమనించాలిగానీ. నిజ జీవితాల జోలి మీ కెందుకు? ఎవరి లోసుగులు వారికుంటాయి. వాటిని విమర్శించే బదులు, ఆ కథనా చాతుర్యాన్నీ, నటనా వైదుష్యాన్నీ ప్రశంసించరాదూ?...."

చిన్నసైజు ఉపన్యాసమే యిచ్చింది శ్రీమతి అంతటి 'మూడ్' లోనూ గూడా!

అయినా సరే, ఎందుకో నా మనస్సంగీకరించలేదు. అందుకే, 'ఇకనించీ ప్రతి సినిమాలోనూ నీకు తోడుగా నేనూ "ఏడుస్తా". నీకు 'కంపెనీ' ఇస్తాను ప్రియతమా!' అని చెప్పలేక పోయాను


'ఏమో! నాకు మాత్రం సినిమాల్లో అంతగా లీనం కావటం నచ్చదు...." అన్నాను మెల్లగానే.

"నాకు మాత్రం చాలా బాధనిపిస్తుందండీ అవన్నీ చూస్తుంటేః పాపం, ఎంత హీనమైన బ్రతుకులు వాళ్ళవి! కన్న బిడ్డలకి కూడు సైతం పెట్టలేక ఎంత విలవిల్లాడి పోయిందా తల్లి! ఎంత హేయంగా వున్నాయి ఆ గుడిశెలూ, ఆ వాతావరణమూ! పచ్చి బాలింతరాలి శయనంకూడా కటిక నేల మీదేకదా! ఎప్పటికి మారతాయి వాళ్ళ పరిస్థితులు? ఎవరుద్దరించాలి వాళ్ళని?

ఈ పేద ప్రజలపరిస్థితుల్ని అవంతైనా సంస్కరించలేని ప్రభుత్వం పాతికేళ్లుగా సోషలిజం. సోషలిజమంటూ దేశాన్నేం ఉద్ధరిస్తున్నట్లు?"

'అమ్మో! ఆవేశప్పాలు ఎక్కువై, రాజకీయాలు గూడా మాటాడేస్తోందే శ్రీమతి, మందు పూటుగా కొట్టేసిన మానవోత్తముళ్ళా!' అనుకున్నాను.

'సినిమాలో చూసైతే, యింతగా కదిలిపోయిందిగానీ, నిజజీవితంలోనయితే ఆ గుడిశెల మధ్య కాలైనా పెట్టగలదా యీవిడ? ఆ హీరోయిన్ గ్లామరస్గా, ఫోటో జెనిగ్గా ఏడ్చింది కాబట్టి యీవిడ సానుభూతి చూరగొంది గానీ, అదే నిజ జీవితంలో, చిరిగిన చీరెలో, వడలిన దేహంతో, చెదరిన జుట్టూ, జిడ్డుకారే మొహమూ వేసుకుని రాగాలు పెడుతూ



ఏడ్చే యువతి 'జుగుప్స' తప్ప మరే భావాన్నయినా కల్గిస్తుందా ఈ 'సుకుమార హృదయానికి?'

కానీ, యిదేదీ పైకి మాత్రం అనలేదు అదంత శ్రేయస్కరం కాదని తెల్సు గనక.

ఇంకా ఆమె ముఖం మాత్రంవిషాదంగానే వుంది. ఏదేనా మాట్లాడించకపోతే మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టే ప్రమాదంవుందని పించిం.ది సీరియస్‌గా ముఖం పెట్టి, ఎప్రిషియేటివ్ మానర్'లో అన్నాను.

"నువ్వు ప్రతిసినిమాలోనూ ఇలానే కదిలిపోతూవుంటావా?"

"ఆఁ...." పరధ్యానం లోనుంచి వులిక్కిపడి అంది లక్ష్మి.

"ప్రతి సినిమాలోనూ అని కాదు. ఎక్కువగా కష్టాలున్న సినిమాలైతే, మన మనసు మరీ బాధచెందితే....అలా కన్నీళ్లు వచ్చేస్తాయి. 'దేవదాసు' చూసిం తర్వాత రెండ్రోజులు అన్నమే తినలేదు నేను. మనసునిండా బాధే. ఏపని చేయబోయినా, ఆ చివరి సీన్లోని దేవదాసు కళ్ళముందు

మెదిలేవాడు. ఎంత ఫీలయ్యానో! అమ్మ తెగతిట్టింది గూడానూ. అలాటి పాడు సినిమాలు చూడకపోతేనేం? అని. అలాగే చిరంజీవులూనూ ఇంకా. అడపడుచూ. రక్త సంబంధం. మూగనోమూ....''

ఇహవిలా వదిలేస్తే తెలుగులోని విషాద చిత్రాల లిస్టంతా ఏకరువుపెట్టేలా వుందనిపించి. గబుక్కున

''అంత సున్నితమైతే గూడా కష్టం కదూ?" అన్నాను.

''ఏం చెయ్యమంటారు? ఎవరివైనా సరే కష్టాలు చూస్తే నా మనసు చలించి ద్రవించకుండా వుండదు.''

ఇక నేనేం మాట్లాడలేదు.

భోజనాల దగ్గర కూడా ఆమె తన 'విషాద చిత్రాల తాలూకు అనుభవాల్ని' ఏకరువు పెడ్తూనే వుంది.

నాకు చాలా బాధనిపించింది....యీ వెధవ సినిమాకి వెళ్ళామేమిటా? అని!మా మ్యారేజీ మొదటి వార్షికోత్సవం యివాళ! ఆనందంగా సినిమా చూద్దామని వెళ్ళి, ఈ 'ఏడుపు' కొని తెచ్చుకొన్నామేమిటా అనిపించింది. కానీ అదే ముక్క బయటి కంటే. యిందాక పాషాణహృదయమైనా వుందని అంగీకరించినదల్లా,యిప్పుడసలు మనసే లేదనేయగల్దు! అందుకే ఊరుకున్నాను.

పక్క మీదికి చేరాం. మంచం మీద మరో వైపుకి తిరిగి పడుకుంది శ్రీమతి. గాంభీర్యం యింకా వొదిలినట్లు లేదు. ఎలా దాన్ని వోదార్చాలో నాకంతు పట్టలేదు

నవ్విద్దామని గనక ఏదేనా జోక్ చేశానా. బూతులు తిట్టినా తిడుతుంది. పోనీ. ఆ సినిమా గురించి ఏవేనా సానుభూతి వాక్యాలు పలికానా. పందిర దొరికిన లతలా ఆకథ చుట్టూ అల్లుకు పోయి. ఇహ యీ లోకానికి దిగిరాదు. రెండు విధాలా కష్టమే! ఎలారా భగవంతుడా!

అయిదు నిముషాలు ఆలోచించాను. ఏం తోచలేదు. ఇహ ఆలోచించ లేక పోయాను. చటుక్కున రెండు చేతుల్తోనూ. ఆమెని నా వైపుకు తిప్పుకుని. గబుక్కున ఆమె కళ్ళపై చుంబించాను

ఉప్పగా పెదాలకు తడి తగిలింది.

'హతోస్మి! ఇంకా దుఃఖిస్తోంది!'

ఈ సారి నాకు నిజంగా జాలి కలిగింది.

'ఇంత బేలా లక్ష్మి? మూడు గంటల ముష్టి సినిమా కోసం. ఉదయం నించీ. ఉత్సాహంగా సెలిబ్రేట్ చేసుకొంటున్న మ్యారేజీ యానివర్సరీ కూడా మర్చిపోయింది. సినిమా నుంచి వచ్చేసి గంట సేపయినా. ఆ సినిమాలోని కష్టాలింకా ఆమెని ఆకట్టుకొనే వున్నాయా! ఆమె నిజంగా సున్నితమనస్కయేనా! నే

నామెవి అర్థ రహితంగా హేళన చేస్తున్నానా?'

"ఛ ఇంకా ఏడుస్తున్నావా? పిచ్చిదానా, వూరుకో! అంత బేలగా వున్నా కష్టమే! నిజ జీవితంలో యింకెన్ని కష్టాలొస్తాయో? యివే తట్టుకోలేకపోతే యింక అవెట్లా ఎదుర్కొంటాం?

అలాటి కథల్ని చూస్తే బాధ కల్గటం సహజం కానీ, కొంతసేపటి కయినా మర్చిపోవాలి మరి"

"అలాటి బాధలూ, అనుభవాలూ పగవాళ్ళకి కూడా వద్దండీ! నాకు కళ్ళు మూసినా, తెరిచినా ఆ హీరోయినే కళ్ళ ముందు మెదుల్తోంది. అంతటి కష్టాలొస్తే ఎవరైనా ఎలా ఎదుర్కోగలరండీ?...."

మళ్ళీ శ్రీమతి కళ్ళనిండా నీళ్ళు. గొంతులో సుళ్ళు తిరుగుతూ తడి!

ఏ రాత్రి వేళకు నిద్ర పట్టిందో ఆమెకు, నాకు తెలీదు!

* * *

ప్రొద్దున పూట కొంచెం ఆలస్యంగా లేవటం అలవాటు నాకు. కానీ, యీవాళ అప్పుడే మెలకువొచ్చేసింది. దొడ్లో ఎవరిమీదనో అరుస్తున్న శ్రీమతి కేకల్తో.

బద్ధకంగా ఆవులిస్తూ, దొడ్డిపెపు నడిచాను. 'ప్రొద్దున్నే ఎవరిమీదబ్బా. యింతలా గొంతు చించుకుంటోంది' అనుకుంటూ.

పని మనిషి మొగుడు, దొడ్లో నిలబడి వున్నాడు.

"నీ కూతురికి నొప్పులైతే, మీ ఆవిడేం చేస్తోందిరా? నిన్నా వచ్చినట్టే వచ్చి, తగ్గి పోయాయన్నావ్. పన్లోకి రాలేదు. యివాళా ఆదేపరస! నీ కూతురి పురుడు కాదుగానీ, నా చావు కొచ్చిందిరా! ఈ వంకన ఎన్ని రోజులు పనెగ్గొడుతుంది మీ ఆవిడ?"

నోటిని 'బాకా'లా చేసి అరుస్తున్న ఆమెని చూస్తుంటే ఎలక్షన్ ప్రాపగాండాకి మైక్ లేకుండా పని కొస్తుందనిపించింది!

"మీకేం తెల్చమ్మా దాని బాదలు! రొంద్రోజులయి ఒకటే కష్టపడి పోతా వుంది. పురుడు రానూ రాదు, దాని బావా పోదు, దానరుపులూ, నొప్పులూ చూస్తా వుంటే, ముద్దగూడా నోట్లోకి పోటం లేదు ఇంక మా యింటిది పన్లు కెట్టావసద్ది?"

"మరి నా బాధలు చూసే దెవర్రా? నిన్నటికి నిన్నా రెండు పూట్లా గిన్నెలు తోముకొనే సరికి చేతులు పడిపోయాయి. మళ్ళీ యివాళానా?

పోనీ, వచ్చినవాడి వెలాగూ వచ్చావుగానీ ఆ నాలుగ్గిన్నెలూ తోమి పడేసి వెళ్ళు"

వాడి ముఖం వడిలిపోయి వుంది. వాడి కళ్ళు బాధతో నిండి, బరువుగా వున్నాయి వాడి గొంతు జాలిగా వుంది. వాడి వైఖరి దయనీయంగా వుంది.

"నాకు రాదమ్మ గిన్నెలు రాసెయ్యటం?"

"వచ్చేదేమిట్రా? రెండు సార్లు చేస్తే అదే వస్తుంది అయినా నీకు గిన్నెల్తోమటం రాకపోవటమేమిటి? అన్నీ వేషాలు...." అదేదో మహాపరాధ

మన్నట్లుంది లక్ష్మి ధోరణి. ఇహ నేను భరించలేక పోయాను

"పోన్లే లక్ష్మి వాళ్ళు బాధల్లో వాళ్ళున్నారు. ఈ రెండ్రోజులూ కాస్త సరుకుంచే...." నా మాటలు పూర్తి కాక మునుపే గయ్ మంది మావిడ.

"చాల్లే. మీరూరు కోండసలు. మీకేం తెల్సు పీళ్ళు వేషాలు! ఇవాళ కూతురి పురుడనీ. రేపు మనవడి బారసాలనీ. ఆ తర్వాత మరోటీ. యీ వంకన యిదె న్నాళ్ళు ఎగేస్తుందో తెల్సా? కానుపు రాకముందే యీ వరసైతే...."

అవును మరి. అవన్నీ అవసరాలు కావా వాళ్ళకి? యీమాచే బయటి కంచే యింకేమన్నా వుందా. ఏం చేసినా చేయగల్దు ఆవిడ.

ఇహ అక్కడ నుంచోకుండా. గదిలోకి వచ్చేశాను. వరండాలో పడివుంది యివాళట పేపరు.

మొదటి పేజిల్లోనే తాటికాయంత అక్షరాల్లో వుంది. నిన్నటి సినిమా అవ్వర్లయిజూ మెంట్.

"పేదల కన్నీటి గాథలకు అద్దం పట్టిన కళాఖండం. ప్రేక్షక హృదయాలను ద్రవీభూతం చేసి .... సామూహికంగా ప్రజల్ని ప్రభావితం చేస్తున్న సంచలన చిత్రం...."

ఏం ప్రభావితం చేస్తోందో నా కర్థం కాలేదు. 'ఏడవటం'లో ప్రాక్టీసిప్పించేదే గానీ చుంకేమైనా మేలు చేయ గల్గుతోందా?

"ఏమోనండీ! ఎవరివైనా కష్టాలు చూస్తే. నా మనసు ద్రవించకుండా వుండదు." అంటుందొక వైపు నుంచి మా శ్రీమతి. చీపురు పట్టుకు గెంతులు పెడుతోంది మరోవైపు అపరకాళిలా.

'మనుషులు మారాలి!'

మనుషులెలాగూ మారుతునే వున్నారు. షోకు చేసుకు వెళ్ళిన ముఖాలన్నీ కన్నీటి చారికల్తో. ఉబ్బిన కళ్ళతో రంగులు మారిపోగా, ఎటొచ్చీ వీటన్నిటికీ అతీతంగా. అచంచలంగా వుండి పోతోందల్లా మనసు లే!

నిట్టూరుస్తూ 'హెడ్‌లైన్స్' వైపు దృష్టి సారించాను. •

హాస్యమాచ్

● "రామూ మీ నాన్నకు నూరు రూపాయలు అప్పుయిచ్చాననుకో! నెలకు పది రూపాయిల చొప్పున నా బాకీ తిరిగి యిస్తే పదినెలల తరువాత బాకీ మిగులు ఎంత వుంటుందీ."

"నూరు రూపాయలు సార్."

"ఏంటీ లెక్క అర్థంకాలేదా?"

"అయింది సార్ మా నాన్న సంగతే మీకు అర్థంకావటంలేదు."

ఈనెల విడుదలలు

ఈ రోజుల్లో చిత్రం విడుదలకు పూర్వం రికార్డులు విడుదలవటం హాశ్చర్యం మీద హాశ్చర్యం. "మాతృమూర్తి"లో రెండు రికార్డులు అప్పుడే దొరుకుతున్నవి BOEC 7249–7250. మొదటిదానిలో ఘంటసాల—సుశీల యుగళగీతం బాగున్నది. రెండవదానిపై జమునారాణి "ఎవమొగం పెడమొగం" భలే బాగా వుంది. పాడించింది పెండ్యాల. ఈ చిత్రం మొదటి పేరు (మా అమ్మ దేవత)తో కొన్ని రికార్డులు వచ్చేసినవి. అయినా పేరేదయితేనేం కమ్మని పాటలనందించటానికి?

ఆర్నెల్లకు భౌభౌలు విభాగంలో విన దగ్గవీ కొనదగ్గవీ యివి 'కోడలు పిల్ల'లో 'నన్ను తాకే యెవ్వరో' అని బాల సుబ్రహ్మణ్యం శృంగారంగా వణకటం. వెనుక ఈశ్వరితో కలిపి 'తైతక్కలాడ' మని ఉత్సాహంలో మున్గిపోటం (BOEC 7290) సంగీతం జి. కె. వెంకటేష్. రచన ఆరుద్ర. 'శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం'లో మూణ్నాలుగు పాటలు బాగున్నవి. అన్నిటిలో మేలైనది 'నీవైన చెప్పవే జాబిలీ' అన్న ప్రేమోన్మాద భరితమూ (అడుగడుగున నా ప్రియ భామినికీ అలుక యెందుకనీ) మోద భరితమూ (తన పక్క యెవరో పదదాపి యెవరో తెలుసుకోమ్మనీ పిదప రమ్మనీ) అయిన సాల—శీల యుగళగీతం. ఆ పాట ఆలస్యంగా వచ్చిందని విచారించడమా. వచ్చింది కదా అని సంతోషించడమా యీ పాట మీలో తెల్చుకో వచ్చు. రెడ్డి—రాజుల సాహిత్య సంగీతాలు.

'పాపం పసివాడు'లో అన్ని పాటలు EMOEC 6152, BOEC 7203, 7204, 7244 రికార్డులపై సిద్ధంగా వున్నవి. 'అమ్మ చూడాలి' పాటవి భావస్ఫోరకమైన గళ్యం వాద్యవిన్యాసమూ. 'ఓ బాబు'లో నారాయణరెడ్డి రచనా లాలిత్యమూ 'అయ్యో పాపం పసివాడులో' ఘంటసాల విలాసమూ. 'మంచిమనిషి'లో తద్ధింతిటతత్ తళాంగు గూడెంవరు షులు వున్నవి భౌభౌ_ మ్యావ్ మ్యావ్ కేంద్రం నుంచి నేటి మార్పిడి వార్తలు చదివినది రికార్డుబంధు.

సరాగమాల సినిమా

పాటల పోటీ 4

రూ 924-00 ల బహుమతులు

ప్రవేశ రుసుము లేదు. టిక్కట్ల ముక్కలు, కత్తిరించిన కూపన్లు పంపే యిక్కట్లు అసలే లేవు।

అతి సులభం। సినిమా సంగీతంపై మీ అమూల్యాభిప్రాయాలు నిర్మాతల దృష్టి లోనికి తీసుకు వస్తూ చక్కని బహుమతులు గెల్చుకొనటానికి మరో అవకాశం।

సౌభాగ్య కళాచిత్రా వారి

"శభాష్ పాపన్న"

రూ 420-00 — పది బహుమతులు

సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ వారి

"వింత దంపతులు"

రూ 336-00 — ఎనిమిది బహుమతులు

గజేంద్ర ఆర్ట్ పిక్చర్స్ వారి

"కలవారి కుటుంబం"

రూ 168-00 — నాలుగు బహుమతులు

సాంగ్ నెం-4 రచన: ఆత్రేయ

పాడినవారు: ఘంటసాల

అయ్యో పసివాడా! అయ్యో పాపం
పసివాడా!
దేవుడు ఉన్నాడా. నీపై ద్వేషం పూనాడా
అశుభమూ శుభము ఎరుగని నిన్ను అనాథ
చేశాడా!
పగబట్టిన విధి నిన్ను పసిగట్టి కాటేసి దా
కలుషం ఎరుగని, నీ కళ్ళల్లో విషాన్ని
చిమ్మి కబోది చేసిందా!
॥అయ్యో పసివాడా॥

ఆకలిలో నిను కబళించాలని వెంటాడెను
యీ క్రూరమృగం
దురాశతో నీ తుది చూడాలని
ఉన్నారయ్యో బంధుజనం
॥అయ్యో పసివాడా॥

నీ తల్లి నీకోసం నిలుపుకుంది ప్రాణాలు
నీ తండ్రి నిను తలచి కురిపించెను
కన్నీళ్లు
ఆ కడుపు తీపే నిను కాపాడాలి
ఆ కన్నీళ్ళే నీ కనుచూపవ్వాలి
॥అయ్యో పసివాడా॥

సాంగ్ నెం-5 రచన: కొసరాజు

పాడినవారు: బాలసుబ్రహ్మణ్యం
ఎల్. ఆర్. ఈశ్వరి

అతను: మంచియన్నదే కానరాదు యీ
మనషులలోనా ॥హత్తెరి॥
ఆమె: నీతియన్నదే లేనేలేదు
మనసులలోనా ॥హత్తెరి॥
ఇద్దరు: చేసినమేలూ గంగలో కలిపే
గొంతులు కోస్తారోయ్
॥మంచిది॥



అయ్యో పసివాడా
పాపం పసివాడా

అతను: ఆపద వస్తే-కాపుకాటురా
ఆమె: అమ్మే బాబని-కాళ్ళబడతవు
అతను: ఏరుదాటి ఒడ్డుకు చేరంగనే
తెప్ప కాల్చి పోతారయ్యో
ఆమె: కుక్కకు ఉన్న విశ్వాసం యీ
నరుడికి లేదయ్యో ॥మంచిది॥
ఆమె: నావాదం కే-పాపం [illegible]
అతను: న [illegible]-మా-[illegible]
ఆమె: చెప్పిన మాటం-చెల్లిస్తాం
అతను: కోయరాజునం-అసిపిస్తాం
ఇద్దరు: దొంగనాటకా-ద్రోహం చేస్తే
అమ్మకు బలి ఇస్తాం ॥మంచిది॥



ఓ బాబూ

రామరాజ్యం

అది రామాపురం. ఆ గ్రామాన్ని పునరుద్ధరించటం కోసం డా॥ శంకరం తన శక్తినంతా ఉపయోగించాడు ఆదర్శవంతమైన అధునాతన గ్రామంగా పునరుద్ధరించాడు. అయితే గ్రామం బాగుపడటం యిష్టంలేనివారు కొందరు మాజీ పంచాయితీ ప్రెసిడెంట్ మరణానికి శంకరం కారకుడని గ్రామస్థుల్ని రెచ్చగొట్టారు. అందరూ కలిసి డా॥ శంకరాన్ని చంపటం కోసం ఆయన ఇంటిమీదకు మూక ఉమ్మడిగా దాడిచేశారు. అందులో వున్న అందరూ డా॥ శంకరం ఉపకారాన్ని పొందినవారే! ఆయనమీద దెబ్బతీయటానికి వచ్చారు? చేసిన ఉపకారం అపకారంగా పరిణమిస్తుందా? మంచిని పంచిపెట్టిన ఆ మహామనిషికి కృతజ్ఞతగా లభించినదేమిటి!

చక్కని ఈ సన్నివేశాన్ని అభ్యుదయ యువదర్శకులు శ్రీ బాబూరావు రామ విజేతా ఫిలింస్ "రామరాజ్యం"లో అతి చక్కగా చిత్రీకరించారు.

మద్రాసు కర్పగం స్టూడియోలో రామాపురం పల్లె సెట్ అతి వ్యయంతో నిర్మించారు. చిత్రంలో కళాకారులు కాక, రెండువందల మంది జూనియర్ ఆర్టిస్టులు



ప్రసాద్ కంబైన్స్ వారి "శభాష్ బేబి"లో జగ్గయ్య, దేవిక, బేబిరాణి.


పాల్గొన్న ఈ సన్నివేశం చిత్రానికే మకుటాయమానం.

జగ్గయ్య, రంగారావు, గుమ్మడి, చంద్రమోహన్, రాజబాబు ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య, కె. వి. చలం, నూతన నటుడు శరత్‌బాబు, సావిత్రి, చంద్రకళ, రోజారమణి నటీనటులు

సాంకేతిక వర్గం: సంభాషణలు: భమిడిపాటి; సంగీతం: ఘంటసాల; కెమెరా: మాధవ్ బుల్‌బులే; ఆర్టు: ప్రభాకర్, అసోసియేట్ డైరెక్టర్: నాగేశ్వరరావు; దర్శకత్వం: కె. బాబూరావు నిర్మాత: కె. ఏ. ప్రభాకర్. విడుదల: లక్ష్మీ ఫిలింస్.

"శభాష్ బేబి"

చిన్నతనంలోనే తన తల్లిదండ్రులను పోగొట్టుకొనుటకు కారకులైన ఒక దొంగల ముఠాను వెంటాడి ప్రభుత్వానికి పట్టి యిచ్చిన ఓ సాహస బాలిక కథ యితివృత్తాన్ని తీసుకొని ప్రసాద్ కంబైన్స్ వారు తమ ప్రథమ చిత్రంగా నిర్మిస్తున్నారు. సాహస బాలికగా బేబీ రాణి, ఆ బాలిక నేస్తంగా మోతి అనే కుక్క ఈ చిత్రంలో ప్రధాన పాత్రలను ప్రశంసనీయంగా పోషిస్తున్నారు. జగ్గయ్య, దేవిక, సావిత్రి, ఛాయదేవి,



శ్రీకాంత్ & శ్రీకాంత్ ఎంటర్ ప్రైజెస్ వారి "పెద్దకొడుకు"లో యస్. వరలక్ష్మి, జయ, కాంచన, నాగయ్య

కృష్ణంరాజు, వి. నాగయ్య, ధూళిపాళ, యస్. రాఘవరావు, శాకరాల డా॥ రమేష్, ఉదయకుమార్, రమణారెడ్డి మున్నగువారు నటిస్తున్న సెంటిమెంటల్ మరియు క్రైమ్ థ్రిల్లర్. ఈ చిత్రంలో-గుర్రాల పరుగులు సరికొత్త ఫైటింగ్స్, కాబ్రెడాన్స్, కడుపు చెక్కలయ్యే హాస్యం. అడుగడుగునా సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే సస్పెన్స్‌తో కూడిన సన్నివేశాలు నిండివున్నాయి.

బేబీరాణి మోతీలపై జూలై 18 తేదీన అవుట్ డోర్ లో షూటింగ్ ప్రారంభమైంది. వరుసగా పదిరోజులపాటు అవుట్‌డోర్‌లో షూటింగులు జరిగిన తదుపరి వాహిని స్టూడియోలో వేసిన యిన్‌డోర్ సెట్‌లో సంగీతరావుగా రమణారెడ్డి, సంతాన లక్ష్మిగా ఛాయాదేవి, సరిగమపదనిస-అనే వారి సంతానం పాల్గొన్న హాస్య సన్నివేశాలను చిత్రీకరించారు.

షెడ్యూలు ప్రకారంగా ఈ చిత్రాన్ని యాభై రోజులలో పూర్తిచేసి, అన్ని అలంకరణలతో సెప్టెంబరు నెల ఖరుకు విశాలాంధ్ర ప్రజలకు తమ ప్రథమ

కానుకగా అందజేయాలన్న సంకల్పంతో ఈ చిత్ర నిర్మాత శ్రీ ఎస్. ప్రసాద్ గారు విరామం లేకుండా వాహినీలో షూటింగులు జరిపిస్తున్నారు.


శ్రీ ఎన్. సాంబశివరావు కూర్చిన ఈ చిత్రకథకు—శ్రీ టి. పి. మహారథి మాటలు, పాటలు లిఖించారు. సంగీత దర్శకుడు శ్రీ సత్యారావు ఈ చిత్రం లోని ఆరుపాటలకు మధురమైన సంగీత బాణీలను పొదిగారు. ఛాయాగ్రహణం: కె. సాంబశివరావు. కూర్పు: శివమూర్తి నిర్మాత శ్రీ ఎస్. ప్రసాద్‌గారు ఈ చిత్రానికి ప్రతిభావంతముగా దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ప్రెస్‌రిలేషన్స్ శ్రీకృష్ణ

శ్రీ పద్మాలయా మూవీస్
మూడవ చిత్రానికి

ఆదుర్తి దర్శకత్వం

క్రిందటి సంవత్సరం కృష్ణ సమర్పించిన శ్రీ పద్మాలయా మూవీస్ వారి "మోసగాళ్ళకు మోసగాడు'' ఆంధ్రప్రదేశ్‌లోనే కాక—ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో కూడా సంచలనం సృష్టించి ఘనవిజయం సాధించిన సంగతి అందరికీ తెలిసినదే.

ఇపుడు కృష్ణ సమర్పించిన "పండంటి కాపురం'' వర్ణచిత్రం బాక్సాఫీసు వసూళ్ళలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది. మొదటి రెండు వారాల్లోను



సౌభాగ్యకళాచిత్ర వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'శభాష్ పాపన్న'లో జగ్గయ్య.

24 కేంద్రాల్లో రూ. 13 లక్షల 65 వేలు కలెక్ట్ చేసి కొత్త రికార్డులు సృష్టిస్తున్నది.

ప్రస్తుతం కృష్ణ శ్రీ పద్మాలయా మూవీస్ తరఫున సమర్పించనున్న మూడవ చిత్రానికి యావద్భారత ఖ్యాతి నార్జించిన ప్రముఖ దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించేందుకు యిటీవలనే ఒప్పందం జరిగింది.

ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్టు కార్యక్రమాలు చురుకుగా కొనసాగుతున్నాయి.

నటీనటులు, తదితర సాంకేతిక నిపుణుల ఎన్నిక పూర్తిచేసుకుని జనవరి



త్రివేణీ ప్రొడక్షన్స్ "బడిపంతులు"లో జగ్గయ్య,
ఎన్. టి. ఆర్.

73లో యీ చిత్రం సెట్స్‌కు వెళ్లనున్నది. శ్రీ జి ఆర్ శేషగిరిరావు నిర్మించే యీ చిత్రానికి శ్రీ ఫిలింస్‌వారు పంపిణీదారులు.

భక్తతుకారం

అంజలీ పిక్చర్స్ కంబైన్‌వారి "భక్త తుకారాం" ఈస్ట్‌మన్ కలర్ చిత్రం రెండవ షూటింగ్ షెడ్యూలు హైదరాబాదు సారథి స్టూడియోలో బహినాబాయి భవనం సెట్‌లో జరిగింది. ఆర్ట్ డైరెక్టర్ జి వి సుబ్బారావు కళానైపుణ్యంలో అతి సుందరంగా నిర్మింపబడినది సెట్టింగ్ బహినాబాయిగా కుమారి కాంచన ఈ షూటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నది. తుకారాంగా పద్మశ్రీ నాగేశ్వరరావు. ముంబాజీ పండితునిగా నాగభూషణం. అతని శిష్యులు నంది. వరహారంగా సాక్షి రంగారావు. పొట్టి ప్రసాద్. నిరోజీగా భానుప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు నృత్యాలను కూడా చిత్రీకరించారు. పి. నారాయణరెడ్డి రచించిన మాల్కోస్ రాగంలో బాణి కూర్చబడిన—'సరిసరి-నీ వగలు తెలిసెర గడసరి' అనే నృత్య గీతకను. 'పూజకు వేళాయెరా' అనే హిందుస్తాన్ కాఫీ-ఫేలు-భాగేశ్రీ-హిందోల్. రాగమాలికతో కూర్చబడిన ఆరు

విమిషముల నృత్యగీతికను నృత్య దర్శకుడు హీరాలాల్. దర్శకత్వంలో అతి ఆకర్షణీయంగా దర్శకుడు మధుసూదనరావు చిత్రీకరించారు శ్రీ నాగేశ్వరరావు, కాంచనల యుగళ గీతము. ఒకరు శృంగార రస తరంగిణుల పొంగగా పాడి ఆకర్షింపబోగా మరొకరు దానికి వేదాంత రహస్యమును వెలికిదీసి బోధించి విస్మయపరిచే మధుర ఘట్టము.

నటీనటులు: నాగేశ్వరరావు, అంజలీదేవి, నాగభూషణం, గుమ్మడి 'గెస్ట్' సాక్షి రంగారావు, శ్రీరంజని, మాష్టర్ రాము, బేబి శ్రీదేవి, అతిథినటుడు శివాజీ గణేషన్. ప్రముఖపాత్ర ఛత్రపతి శివాజీగా అగుపిస్తారు.

ప్రముఖ నటి కుమారి కాంచన ఒక ప్రముఖపాత్ర నిర్వహిస్తోంది.

సాంకేతిక నిపుణులు: సంభాషణలు: వీటూరి. పాటలు: ఆత్రేయ కృష్ణశాస్త్రి: నారాయణరెడ్డి, దాశరధి, వీటూరి, 12 పాటలు, కొన్ని పద్యాలు వ్రాశారు. సంగీతం; ఆదినారాయణరావు, అసోసియేట్ డైరెక్టర్: జి. సి. శేఖర్. దర్శకుడు: వి. మధుసూదనరావు. విడుదల:- లక్ష్మీ ఫిలింస్.



ఎం. ఎస్. రెడ్డి సమర్పించు
సుందరం మూవీస్ వారి
"ఊరికి ఉపకారి"లో చలం

పెద్ద కొడుకు

శ్రీ సుందరలాల్‌నహతా, శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ పతాకం క్రింద శోభన్ బాబు, కాంచన, నాయకీ నాయకులుగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం-11 కి 'పెద్ద కొడుకు' అనే పేరు నిర్ణయించారు.

'రోగం రట్టు, సంసారం గుట్టు' అన్నారు పెద్దలు. ఇంటికి పెద్దయై సంసారాన్ని, పిల్లల్ని చక్కదిద్దుకు రావాల్సిన వ్యక్తి కట్టుతప్పి ప్రవర్తిస్తూ, చెయ్యకూడని పనులు చేస్తూ వుంటె-ఆ అవివేక చర్యల ప్రభావం కుటుంబంలో తుఫాను చెలరేగి విచ్ఛిన్నం అవుతున్న సందర్భంలో-ఎంతో చాకచక్యంగా బలమివి కాకుండ, మంచితనంతో తండ్రిలో పశ్చా

త్తాపం రేకెత్తించి. పరివర్తన సాధించిన "పెద్దకొడుకు" చక్రపాణి దర్శకత్వంతో- కొత్త అందాలను సంతరించుకొంటోంది.

దాదాపు మూడువంతులు పూర్తయిన చిత్రం అక్టోబరు నెలలో విడుదల చెయ్యటానికి నిర్మాతలు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఈ ప్రయోజనాత్మక, ప్రబోధ చిత్రంలో శోభన్‌బాబు నాగభూషణం నాగయ్య రమణారెడ్డి, కాంచన, యస్. వరలక్ష్మి, జ.ప.లతోపాటు వివేకానంద్ అనే క్రొత్త నటుడు పరిచయం చేయబడుతున్నాడు.

సాంకేతికనిపుణులు: రచన: సముద్రాల. సంగీతం: ఆదినారాయణరావు. అసోసియేట్ డైరెక్టర్స్: కె. రాఘవేంద్రరావు. ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధూబాయిపటేల్. నిర్మాతలు: శ్రీకాంత్‌నహతా, శ్రీకాంత్‌పటేల్ దర్శకత్వం: కె. యస్. ప్రకాశరావు. విడుదల: రాజశ్రీ.

కొత్తతరహా సంచలన చిత్రంగా

భరణి పిక్చర్స్ 20వ చిత్రం

పద్మశ్రీ భానుమతిగారు దర్శకత్వం వహించిన భరణి పిక్చర్స్‌వారి 19వ చిత్రం "అంతా మన మంచికే" చక్కని సందేశాత్మక చిత్రంగా లక్షలాది ప్రేక్షకుల ప్రశంసలనందింది. తెలుగు చిత్రలోకంలోనే సంచలనం తెచ్చింది. ఇప్పుడు—20వ చిత్రం నిర్మాణం చురుకుగా సాగుతోంది. ఇప్పటికి మొదటి షెడ్యూలు షూటింగ్. రెండు పాటల రికార్డింగ్ జరిగాయి.

కొత్త నేపధ్యగాయని శ్రీమతి కోవెల శాంతగారిని ఈ చిత్రం ద్వారా పద్మశ్రీ భానుమతిగారు పరిచయం చేయడం మరో విశేషం

భరణి స్టూడియోస్‌లో భారీ ఎత్తున నిర్మించిన ఒక ధనికుని భవనపు సెట్‌లో- గుమ్మడి, రాజనాల, పద్మనాభం, చంద్రమోహన్, కవితలపై కొన్ని సన్నివేశాలను రెండవ షెడ్యూలులో చిత్రీకరించారు.

మరో చక్కని యింటి సెట్‌పై పద్మశ్రీ భానుమతి, ముక్కామల, నూతన తార ప్రమీల పాల్గొన్న కొన్ని దృశ్యాలను చిత్రీకరించడమయింది.

రచయిత శ్రీ వీటూరి వ్రాసిన—

"ఇద్దరు ఒకటైతే"
అదేలే ప్రేమా॥ ప్రేమా॥
పెద్దలు వేరైతే
అదేగా డ్రామా॥ డ్రామా॥

యుగళగీతని ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం, బి. వసంత అద్భుతంగా పాడగా ఆగస్టు 17న రికార్డింగ్ చేశారు

వీటూరిగారే వ్రాసిన—

"చిలకమ్మపాట—కాకమ్మనోట

వింటావా—గోరింకా

విని చూస్తావా—నా వంకా...."

పాటను నూతన నేపథ్యగాయని శ్రీమతి కోవెల శాంత శ్రావ్యంగా పాడగా సెప్టెంబరు 1వ తేదీన రికార్డింగ్ అయింది.

మొదటి పాటను చంద్రమోహన్, ప్రమీలలపైనా, రెండవ పాటను పద్మనాభం, రమాప్రభలపైనా చిత్రీకరిస్తారు.

తర్వాత షూటింగ్ సెప్టెంబరు 2, 3, 5 తేదీల్లో, తిరిగి 7 నుండి 9వరకు, మళ్ళీ 12 నుండి 17వరకు జరిగింది. ప్రధాన తారాగణమంతా పాల్గొన్న కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.

ఆద్యంతమూ, ఆసక్తినీ, అనురక్తినీ కలిగించే కొత్తతరహా కథాగమనంతో మరింత సంచలన చిత్రంగా నిర్మింపబడుతున్న ఈ కుటుంబ గాథా చిత్రంలో—

తారాగణం: పద్మశ్రీ భానుమతి గుమ్మడి, రాజనాల, చంద్రమోహన్, పద్మనాభం, త్యాగరాజు, అల్లురామలింగయ్య, పొట్టి ప్రసాద్, సీలు అయ్యర్, నూతన తార ప్రమీల, రమాప్రభ, కవిత మొదలగువారు.

సాంకేతికవర్గం :- మాటలు; పద్మశ్రీ భానుమతీరామకృష్ణ, జూనియర్ సముద్రాల. పాటలు: దాశరధి, వేటూరి; సంగీతం: సత్యం, సంగీత పర్యవేక్షణ:

పద్మశ్రీ భానుమతి. ఛాయ: లక్ష్మణగోరే. కథ. స్క్రీన్ ప్లే. దర్శకత్వం: పద్మశ్రీ భానుమతిరామకృష్ణ. విడుదల: నవయుగ.

ఆజన్మ బ్రహ్మచారి

హాస్యరస ప్రధానమైన చిత్రాలు బహు అరుదుగా కనిపిస్తున్న ఈ సమయంలో శ్రీ పద్మనాభం సమర్పిస్తున్న "ఆజన్మ బ్రహ్మచారి"లో ప్రేక్షకులకు కావలసి నంత హాస్యం లభిస్తుంది. నవ్వగల శక్తి వుండాలిగాని ఓహో! అడుగడుగునా నవ్వులే. "నవ్వను" అని భీష్మించు కొని కూర్చున్నవాళ్ళను కూడ నవ్వించి. నవ్వించి నవ్వించే చిత్రం 'ఆజన్మ బ్రహ్మచారి'.

'నవ్వే ఎరుగని కాడిస్ట్ జీవితాలు గడిపేవారికి 'ఆజన్మ బ్రహ్మచారి' ఏ డాక్టరు యివ్వలేని అపూర్వమైన నవ్వుల టానిక్. యీ చిత్రంలో మిమ్మల్ని యిద్దరు హాస్య చక్రవర్తులు గిలిగింతలు పెట్టి నవ్విస్తారు. నవ్వులతోపొట్ట పగలి పోతుంది.

సూక్ష్మంలో మోక్షంగా యిది కథ. సర్వ అనర్థాలకు ఆడది ఆటపట్టని. ఆ ఆదిశక్తి నుంచి దూరంగా వుండాలని, అందుకే పెళ్ళిపెటాకులు లేకుండా ఆజన్మ బ్రహ్మచారిగా జీవితం గడపాలని ప్రయ త్నిస్తూ చీరకనిపిస్తే చాలు శివశివ అంటూ కళ్లు మూసుకునే మారుతీరావు "నాగభూష ణం' నోటినుండి వెలువడే మాట ఒక నవ్వుల మూట. మరి ఆ నారీద్వేషిలో మార్పు తేవటం సంభవమా? అయితే ఎలా? తొందర పడకండి మరి షూటింగ్ పూర్తయి తుదిమెరుగులు దిదుకొని మిమ్ముల నందరిని ఆకర్షించడానికి అతి త్వరలో ఆంధ్రదేశం మీదకి ప్రయాణం కడుతున్న 'ఆజన్మ బ్రహ్మచారి' స్వయంగా చూసి అసలు రహస్యాన్ని తెలుసుకోండి మరోమాట! నవ్వేటప్పుడు ఒంటరిగా నవ్వితే ఆనందము వుండదు. జోక్ని ఎంజాయ్ చెయ్యాలంటే మీతో పాటు యింకొకర్ని తీసికొని వెళ్ళండి

ఈ నవ్వులు మీకు అందించటానికి నాగభూషణం. పద్మనాభం. రామకృష్ణ. రాజబాబు. కె. వి. చలం. గీతాంజలి. లీలారాణి మొదలైనవారు అద్భుతంగా కృషి చేస్తున్నారు. వీరితోపాటు శ్రీ పాలగుమ్మి పద్మరాజు. అప్పలాచార్య 'మాటలు. యస్. పి. కోదండపాణి 'సంగీతం' జె. సత్యనారాయణ 'కెమెరా' పద్మనాభం 'దర్శకత్వం' బి. పురు షోత్తం 'నిర్మాత' వీరందరు సహాయ పడ్డారు.

అన్నట్టు ఈ నవ్వుల చిత్రాన్ని ఆంధ్ర దేశంలో లక్ష్మి ఫిలింస్‌వారు

నైజాం - శ్రీ పద్మా పిక్చర్స్ వారు
సీడెడ్ - లక్ష్మిఫిలింస్ వారు అందిస్తారు.

తాత-మనవడు

చలనచిత్రరంగంలో దాదాపు 20 సంవత్సరాలుగా - ఒక్కొక్క మెట్టుగా

రాజకీయాలు

ఈ మధ్య ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ బొంబాయికి సమీపంలో విద్యార్థుల సభలో ప్రసంగిస్తూ మన దేశంలో విప్లవం రావాలనీ. అది దేశంలో అన్ని రంగాలలోనూ పరిస్థితులను సమూలంగా మార్చివేసి కొత్త పరిస్థితులను సృష్టించ గలగాలనీ. వాటన్నిటిలోనూ ప్రజలు పాల్గొన గలిగేటట్టుగా వుండాలనీ. అప్పుడే అది నిజమైన విప్లవం కాగలదనీ వక్కాణించారు. అందుకై ప్రజలంతా పాటుబడాలన్నారు కాని యీనాడు ఎక్కడ చూసినా అలజడులూ, ఆందోళనలూ ఎక్కువగా వున్నాయనీ. వాటి వల్ల విప్లవం రాదనీ హెచ్చరించారు.

బాగానే వుంది. కానీ యీనాటి పరిస్థితులలో అలజడీ ఆందోళనా లేకుండా ఏపని జరగడంలేదు. మహాజర్లవల్ల దాస్తూరీ కుదరడమేగాని ఫలితం వుండదు.

మాట వరసకి యీ మధ్యఒక పత్రికలో ఒక పెద్దమనిషి ఒక లేఖ వ్రాశాడు ఈయన పెద్ద హోదాలో వున్న వుద్యోగి. వైజ్ఞానిక సంబంధమైన వృత్తిలోవున్నారు ఆయన వ్రాసినదేమంటే తను పని చేస్తున్న సంస్థకు సప్లయి చేయబడుతున్న కూల్‌డ్రింకు సీసాలో ఒక చీమ కనబడిందట. ఈ కూల్‌డ్రింక్ పెద్ద ఫ్యాక్టరీలో తయారు చేయబడుతున్న ప్రసిద్ధికెక్కిన జాతికి చెందినదట. ఆయన వెంటనే ప్రభుత్వ ఆరోగ్య శాఖాధికారిని కలుసుకుని ఈ విషయం ఫిర్యాదు చేశారట ఆరోగ్య శాఖాధికారి యిచ్చిన సమాధాన మేమిటంటే మహాశయా, ఆ కూల్‌డ్రింక్ కంపెనీ వాళ్ళ తప్పుకాదు. ఆ కంపెనీ మీద కిట్టని వాళ్ళెవరో యీ పిపీలికాన్ని ఆ సీసాలో వేసి. ఆ కంపెనీ వాళ్ళ ప్రతిష్ఠకు భంగం కలిగించాలని ప్రయత్నించి వుంటారు. అని జవాబిచ్చారట. అంతట ఫిర్యాదు చేసిన మనిషి. అలా జరగడానికి అవకాశం లేదనీ. తమ సంస్థకు యీ కూల్‌డ్రింక్ సీసాలు నేరుగా ఫ్యాక్టరీ నుంచే సప్లయి అవుతున్నాయనీ, మీరు దర్యాప్తు చేయిస్తే...

పక్షంలో పై అధికారులకు వ్రాస్తానని చెప్పగా అప్పుడా ప్రభుత్వాధికారి తన క్రిగువ నుండే ఒక ఇన్‌స్పెక్టరును పంపి ఆ సీసాలను తనికీ చేయిస్తానని మాట యిచ్చి పంపివేశారట. ఇదంతా జరిగిన పదిహేను రోజుల వరకూ ఏ ఇన్‌స్పెక్టరూ తనిఖీకి రాకపోవడంతో విసుగెత్తి ఆయన పత్రికకు లేఖ వ్రాశాడట. ఇదీ మన ప్రభుత్వోద్యోగుల పరిపాలన. ఒక సంస్థకు అధిపతిగా పెద్ద హోదాలో వున్న ఒక పెద్ద మనిషి స్వయంగా ఫోయి పిర్యాదు చేస్తేనే ఎవరూ లక్ష్యపెట్టని పరిస్థితులలో సామాన్య ప్రజల గోడును వినిపించుకునే దెవరు? ప్రజల సమ్మెలు కడుతున్నారంటే ఆందోళన చేస్తున్నారంటే కాలక్షేపానికీ సరదాకి చేయడం లేదన్న విషయం నాయకాగ్రేసరులకు తెలియనిది కాదు.

ఈ మధ్య మద్రాసులో ఒక పెద్ద ట్రాజడీ జరిగింది కరువువల్లనో, కాటకం వల్లనో. తుఫానులూ వరదలూ వంటి ప్రకృతి అరిష్టాలవల్లనో జరిగిన ట్రాజడీ లాంటిది కాదది, అది మనుషులవల్ల జరిగిన ట్రాజడీ. ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యంవల్ల జరిగిన ట్రాజడీ. మద్రాసులోని పిల్లల ఆస్పత్రిలో జ్వరాన్ని జలుబునూ తగ్గించే ఒక మందు వాడడంవల్ల పద్నాలుగురు పిల్లలు చనిపోయారట. ఈ వార్త పేపర్లకెక్కింది. ఆ మందు స్టాకులను స్వాధీనం చేసుకున్నట్టుగా ప్రభుత్వం వారు ప్రకటించారు. కాని ఆ ముడి విష పదార్థాన్ని మందుల కంపెనీకి అమ్మినవాళ్ళనీ. దానిని మందులో కలిపిన మందుల కంపెనీ వాళ్ళనీ అరెస్టు చేశారా? చేస్తే చేసుండొచ్చును. కాని అలాంటి మందులను అమ్మకానికి అనుమతిచ్చిన ప్రభుత్వోద్యోగులకు ఏమి శిక్ష వేశారు? ఈ విషయాలన్నీ ప్రజలకు చెప్ప వలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?

దేశంలో ఆకలి. దారిద్ర్యం. నిరుద్యోగం. అనారోగ్యం వ్యాపించి వాటిలోంచి విముక్తి పొందే మార్గం కనిపించక, వ్యాపారులవల్ల. పెట్టుబడిదారుల వల్ల భూస్వాముల వల్ల. తదితర పెద్దలవల్ల అన్యాయాలు జరుగుతూంటే అడిగే నాథుడు లేక. న్యాయం జరిగే అవకాశం కనిపించక ప్రజలు విసుగెత్తి పోయినప్పుడు వారు తెగించి సమ్మెలు చేస్తారు. ప్రాణాలకు తెగించి ఆందోళన చేస్తారు. అలాంటప్పుడు, యీ ఆందోళనలకు మూల కారణాలను తొలగించక ప్రజలను నిందిస్తూ కూర్చుంటే పరిస్థితి మారదు. నాయకాగ్రేసరులు చెలవిస్తున్న విప్లవం కలలో కూడా రాదు. ప్రజలే యీ అన్యాయాలను రూపుమాపి విప్లవం తీసుకు రావాలిగాని నాయకులు కాదు విప్లవం వేసు మీద ఎవడిల్లు వాడు చక్కబెట్టుకునే నాయకుల మూలంగా విప్లవం వస్తుందని ప్రజలనుకునేంతకాలం విప్లవం రాదు.

—కృష్ణవేణి


JYOTI OCTOBER:72
REGD. NO: M 8869
శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్
పాపం పసివా
దర్శకత్వం
వి.రామచంద్రరావు B.A.(HONS)
నిర్వహణ
ఎ.పూర్ణచంద్రరావు